02-6Pg1exHMNWJQEf.qxd:02-6Pg1exHMNWJQEf.qxd 1/1/02 6:45 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం : fb.com/vaartha
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam
2-6-2024 ఆదివారం సంపుటి: 30 సంచిక: 123 పేజీలు: 12 వెల: 8.00

## నేడు మళ్లీ జైలుకు వెళ్లనున్న కేజ్రీవాల్
## రెండు బస్సులు ఢీ: ముగ్గురు దుర్మరణం
5లో

అధికార పార్టీ, విపక్ష కూటమి
# సమ ఉజ్జీ పోటీ!

### స్పష్టత ఇవ్వని ఎగ్జిట్ పోల్స్

వైఎస్సార్సీకి కొన్ని సంస్థలు అగ్రస్థానం ఇస్తే, టిడిపి కూటమికి మెజారిటీ మరికొన్ని

మహిళా ఓట్లు అధికశాతం అధికార పార్టీకే పడ్డాయంటున్న ఎగ్జిట్ పోల్స్

విపక్షంలో చంద్రబాబు, పవన్ గెలుపు ఖాయం

**విజయవాడ, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలపై ముందస్తు అంచనాలు (ఎగ్జిట్‌పోల్స్) వెలవడ్డాయి.

| సంస్థ | వైఎస్సార్సీ | విపక్ష కూటమి |
|---|---|---|
| ఆపరేషన్ చాణక్య | 95-102 | 64-68 |
| చాణక్య పార్థదాస్ | 110-120 | 55-65 |
| పోల్ స్ట్రాటజీ గ్రూప్ | 115-125 | 50- 60 |
| జన్‌మత్ | 95-103 | 67-75 |
| ఎబిపి-సీ ఓటరు | 97-108 | 67- 78 |
| పయనీర్ సంస్థ | 31 | 144 |
| పీపుల్స్ పల్స్ | 45- 60 | 111-135 |

ఈ ఫలితాలు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోరు నువ్వా? నేనా ! అన్నట్లుగా సాగినట్లు ఈ ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేసాయి. ఈ ఉత్కంఠ పోరులో మేజార్టీ అంచనా సంస్థలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్సీ పార్టీ అధికారంలోకి వస్తుందని అభిప్రాయ పడ్డాయి. మరి కొన్ని సంస్థలు ఎన్డీఎ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి పూర్తి అవకాశాలున్నట్లు వెల్లడించాయి. మేజారిటీ సంస్థలు ఈ ఎన్నికలో 52 నుంచి 56 శాతం >>2

## ముగిసిన 'ధ్యానయోగం'

### తిరిగి ఢిల్లీ వెళ్లిన ప్రధాని

**కన్యాకుమారి, జూన్ 1:** సార్వత్రిక ఎన్నికల అనంతరం ప్రధాని మోడీ ప్రతిసారి నిర్వహించే ధ్యానముద్రను ఈసారి కన్యాకుమారిలో నిర్వహించిన సంగతి తెలిసిందే. 45 గంటల దీక్షను విరమించిన మోడీ ఢిల్లీకి తిరుగుపయనం అయ్యారు. 30వ తేదీనుంచి మూడురోజుల పాటు అంటే 45 గంటలపాటు ధ్యానమండపంలోనే గడిపారు. ధ్యానంతర్వాత ప్రధాని వివేకానంద మెమోరియల్‌వద్ద >>2


శనివారం కన్యాకుమారిలోని వివేకానంద విగ్రహం సమీపంలో ప్రధాని మోడీ

# మళ్లీ విజయం మనదే

## అధికారం చేపడతాం: సిఎం జగన్ ఆశాభావం


విదేశాలనుంచి తిరిగి వచ్చిన సిఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

**విజయవాడ, జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజలు మనపై అత్యంత విశ్వసతనీయతను చూపించారని, కచ్చితంగా భారీ మేజార్టీతో అధికారాన్ని చేజిక్కించుకుంటామని సిఎం జగన్ వ్యాఖ్యానించారు, సిఎం జగన్ శనివారం రాత్రి అందుబాటులో ఉన్న మంత్రులు, కీలకనేతలతో సమావేశమయ్యారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలపై ఆయన స్పందిస్తూ ఎవ్వరి అంచనాలు వారివన్నారు. మన అంచనా మనది. మేజార్టీ సంస్థలు మన గెలుపును ఖాయం చేసిన నేపథ్యంలో మనం భారీ విజయంపై పెట్టుకున్న నమ్మకం ఒమ్ముకాదన్నారు. గత ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ చెప్పిన దాని కన్నా అనుహ్యంగా సీట్లు సాధించామన్నారు. మూడు పార్టీలు కలిసికట్టుగా వచ్చినా ప్రజలు మనవైపు నిలిచారంటే, అంతకన్నా ఏమీ కావాలన్నారు. 2019లో 151 అసెంబ్లీ సీట్లు, 22 ఎంపి సీట్లు గెలిచామన్నారు. ఈ సారి అంతకంటే ఎక్కువ సీట్లే గెలుస్తామన్నారు. ఫలితాల తరువాత దేశం మొత్తం మన వైపు చూస్తుందన్నారు. ఏ అంచనా సంస్థ ఊహాకు అందని సీట్లు మనకు వస్తున్నాయి. వచ్చే అయిదేళ్లలో మనం ఇంత కన్నా ప్రజలకు మనం మేలు చేస్తామన్నారు. చంద్రబాబులో ఓటమి భయం పట్టుకుందన్నారు. ఉద్దేశపూర్వకం హింసాత్మక ఘటనలను ప్రోత్స హిస్తున్నాడన్నారు. ఎన్నికల ప్రచార సమయం లోను ఆయన హింసను ప్రేరేపించారన్నారు. అధికారం కోసం ఎంతగా చంద్రబాబు, పవన్ ఆరాట పడుతున్నారో ప్రజలు గ్రహించారన్నారు. ప్రజలకు సంక్షేమపథకాలు వర్తించకుండా చంద్రబాబు చేయాలనుకున్నాడన్నారు. న్యాయస్థానం ఆయన ప్రయత్నాలను అడ్డుకుందన్నారు. గత అయి >>2

# లోక్‌సభకు మళ్లీ ఎన్డీయె!

బిజెపి ప్లస్ 350-390
ఇండియా కూటమి 120-160
ఇతరులు 40-50

### మూడోసారి మోడీయే ప్రధాని అంటున్న ఎగ్జిట్ పోల్స్

**న్యూఢిల్లీ, జూన్ 1:** దేశవ్యాప్తంగా ఏడుదశల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీల బలాబలాలపై అంతర్జాతీయ స్థాయిలో అంచనాలుపెరిగిపోయాయి. ప్రపంచ దేశాలు కూడా ఈసారి భారత్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలపై ఎక్కువ ఆసక్తిచూపించాయి. పొరుగుననే ఉన్న పాకిస్తాన్‌నుంచి చైనా, రష్యా, అమెరికా వంటి అగ్రరాజ్యాలు భారత్‌లో ఎన్నికలపై తమతమ సొంత అంచనాలు కూడా వెల్లడించాయి. ఇక భారత్‌లో అయితే ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఏడో విడత పోలింగ్ ముగిసిన ఆరు గంటల తర్వాత నుంచే >>2

# డయేరియాతో విలవిల


సిపిఎం కార్యాలయంలో డయేరియా బాధితుల శిబిరం

### రోజురోజుకు పెరుగుతున్న బాధితులు
### ఇప్పటికే 12 మంది మృతి
### అధికారులు తగినట్లుగా స్పందించాలి: చంద్రబాబు

**విజయవాడ, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ నగరంలో డయేరియా ముదురుతుంది. కలుషిత నీటి తాగడం వలన ఈ పరిస్థితి తలెత్తిన నేపథ్యంలో సమస్య పరిష్కారం దిశలో ప్రజారోగ్యశాఖ తగిన రీతిలో స్పందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. విజయవాడ నగరంలో మొగల్రాజపురం, సున్నపుబట్టిల ప్రాంతంలో అయిదురోజులకు పైగా డయేరియా సమస్య తలెత్తింది. ఈ ప్రాంతానికి కుళాయి పైపుల్లో వచ్చిన నీరు తాగిన వారంతా అస్వస్థతకు గురయ్యారు. దాదాపు 150 మంది వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడ్డారు. వీరికి ఆస్పత్రుల్లో చికిత్స అందుతుంది. ఈ ప్రాంతంలో తొమ్మిది మంది డయేరియా సమస్యతో మృతి చెందినట్లు నివాశితులు స్పష్టం చేసారు. అయితే వారు డయేరియా కారణంగా మృతి చెందలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఖండించారు. ఈ పరిణామాల నడుమ కలుషిత నీటిని తాగి ఇతర ప్రాంతాల వారు అస్వస్థతకు గురై ఆస్పత్రులు పాలవుతున్నారు.
వందల సంఖ్యలో డయేరియా బాధితులు రోజు, రోజుకు గుర్తింపులోకివస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ క్యాంపులు నిర్వహిస్తున్నా, బాధితులు ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితులే అధికంగా ఉన్నాయి. ఇక ప్రజారోగ్య శాఖ డయేరియా

# కొత్త వైద్య కళాశాలల్లో 380 పోస్టులకు ఓకే

### ఆయా కాలేజీలకు జారీ అయిన ఆదేశాలు

**విజయవాడ, జూన్1, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో కొత్త వైద్య కళాశాలల్లోని 21 విభాగాలకు 380 పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ కానున్నది. ఏపీ వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అన్ని వైద్యకళాశాలలకు ఈ విషయమమై ఉత్తర్వులు జారీ చేసారు. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసే దిశలో ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో మచిలీపట్టణం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలలను ప్రారంభించారు.
2024-25 విద్యా సంవత్సరంలో పాడేరు, పులివెందుల, మదనపల్లె, మార్కాపురం ఆదోని కళాశాలలను ప్రారంభిస్తాయి. కళాశాలకు 222, బోధన ఆస్పత్రికి 484 చొప్పున గతంలోనే కొత్త పోస్టులను మంజూరు చేసారు. నేషనల్ మెడికల్ కమీషన్(ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా వైద్యులు, టీచింగ్ ఫ్యాక్టలీ అందుబాటులో ఉంచడంలో భాగంగా తాజాగా మరో 380 పోస్టులను మంజూరు చేసారు.
60 ప్రొపెసర్, 85 అసోషియేట్ ప్రొపెసర్, 75 అసిస్టెంట్ ప్రొపెసర్, 160 ఎస్ఆర్/ట్యూటర్ పోస్టులకు కొత్తగా మంజూరు చేసిన వాటిలో ఉన్నాయి. 2025-25 విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా 130మంది ట్యూటర్, 37 మంది అసిస్టెంట్ ప్రొపెసర్‌లకు డైరెక్టర్ ఆఫ్ మెడికలన ఎడ్యుకేషన్ (డీఎంఈ) నియామక ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికే నూతన వైద్య కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారు,

## 3,4,5 తేదీల్లో మద్యం దుకాణాలు బంద్

**విజయవాడ, జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఈ నెల 3,4,5 తేదిలో మద్యం దుకాణాలను బంద్ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మూడు రోజు మద్యం బార్‌లు కుడా మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు. అల్లర్లు చెలరేగకుండా ముందు జాగ్రత్త చర్యగా మూడు రోజుల పాటు లిక్కరు షాపులను బంద్ చేస్తున్నట్లు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాకుడా ఒక ప్రకటనల్లో స్పష్టం చేసారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అందువలన అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటనలో వివరించారు. అదే విధంగా హోటళ్ళు, లాడ్జిలలో తనిఖీలు చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని జిల్లాలకు చెందిన పోలీసు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసామన్నారు. తప్పుడు ప్రచారం వ్యాప్తికాకుండా సోషల్ మీడియాపై నిఘా పెట్టామన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించామన్నారు.



## విచారణలో ఉన్న వివేకా హత్యకేసుపై వ్యాఖ్య తగదు

### - ఎబి వెంకటేశ్వర రావు

**విజయవాడ, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి:** వివేకానందరెడ్డి హత్య కేసు ఇంకా న్యాయస్థానంలో నడుస్తున్నందున తాను మాట్లాడటం సరి కాదని సీనియర్ మాజీ ఐపిఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఆయన ఈ అంశంపై కోర్టు విచారణదశలో సూచనలు చేయడం సరికాదన్నారు. ఈ కేసులో ప్రాథమిక సాక్ష్యాలు చాలా కీలకమన్నారు. వివేకానందరెడ్డి హత్యకేసులో అన్ని కోణాల్లో శోదించాలని తాను ఆదేశించానన్నారు. అన్ని రకాల సాక్ష్యాలు సేకరించాలని దర్యాప్తు అధికారులకు తెలిపానన్నారు. అప్పుడగు అన్ని రకాల సాక్ష్యాలు అధికారులు పూర్తి ఆధారాలు సేకరించలేదన్నారు. ఇక్కడో విషయం స్పష్టం చేయాలన్నారు. >>2

# ఏడోవిడతలో బెంగాల్ ఉద్రిక్తం



### చెరువులోకి వివిపాట్, ఇవిఎంలు
### ఎఐఎస్ఎఫ్ కార్యకర్తలపై దాడులు

**కోల్‌కత్తా, జూన్ 1:** సార్వత్రిక ఎన్నికల్లో చిట్టచివరి విడత ఎన్నికలు బెంగాల్‌లో ఉద్రిక్తతలు, ఘర్షణలమధ్య ముగిసాయి. వివిధ ప్రాంతాల్లో జరిగిన అల్లర్లు, దాడుల్లో పలువురు గాయపడినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసారు. మొత్తం 140కిపైగా ఫిర్యాదులు అందాయని ఎన్నికల అధికారులు ప్రకటించారు. 1.63 కోట్లమంది ఓటర్లు ఏడో విడత పోలింగ్‌లో ఓటుహక్కు కోసం బారులు తీరి నిలుచున్నారు. కోల్‌కత్తా, ముర్షిదాబాద్ ప్రాంతాల్లో నాటు బాంబులను పోలీసులు రికవరీచేసారు. తొమ్మిది లోక్‌సభ నియోజకవర్గాలకు శనివారం జరిగిన పోలింగ్ మొత్తం ఘర్షణలమయంగా మారింది. శాతులియా ప్రాంతంలో ఐఎస్ఎఫ్, సిపిఎం మద్దతుదారుల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది.
భంగార్, జాదవ్‌పూర్ నియోజకవర్గంలో పలుచోట్ల ఈ దాడులు జరిగాయి. కొన్ని చోట్ల అయితే ఇవిఎం, వివిపాట్ మెషిన్లను ఎత్తుకెళ్లి సమీపంలోని చెరువులో పడేసారు. దక్షిణ 24 పరగణాల జిల్లాల్లోని కుల్తాలిలో కోపోద్రిక్తులైన అల్లరిమూకలు పోలింగ్‌కేంద్రంలోకి వెళ్లి మొత్తం ఇవిఎం, వివిపాట్‌లను ఎత్తుకుపోయారు. కొందరు పోలింగ్ ఏజెంట్లను బూత్‌లోకి అనుమతించకపోవడంతో స్థానికులు కోపోద్రిక్తులయ్యారు. దీనితో ఇవిఎం, వివిపాట్‌లను పీకేసి పట్టుకుపోయి చెరువులో పడేసారు. శనివారం ఉదయం 6.40 గంటలకు రిజర్వు వివిఎంలు, పేపర్లు కూడా అల్లరి మూబ్ పట్టుకుపోయారు. బేనిమాధవ్‌పూర్ >>2

## ఎగ్జిట్‌పోల్స్ చర్చల్లో పాల్గొంటాం

### - ఇండియా కూటమి నేతల నిర్ణయం

5లో


శనివారం అస్వస్థతకు గురైన కార్మికులను హాస్పిటల్‌లో పరామర్శిస్తున్న ఎంపి గురుమూర్తి

# అల్యూమినియం ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్

### 30 మంది కార్మికులకు తీవ్ర అస్వస్థత
### బాధితులను పరామర్శించిన ఎంపి గురుమూర్తి

**ఏర్పేడు, జూన్ 1 ప్రభాతవార్త:** కర్మాగార యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా గ్యాస్‌లీక్ అయి ప్రమాదం చోటు చేసుకుంది 30మంది కార్మికులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన తిరుపతి జిల్లా ఏర్పేడు- వెంకటగిరి రహదారిలోని రాజులపాళ్యం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఏర్పేడు సిఐ శ్రీరామ శ్రీనివాస్ కథనం మేరకు సిఎంఆర్ అల్యూమినియం కర్మాగారంలో గ్యాస్ లీక్ కారణంగా 30మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు, అస్వస్థతకు గురైన వారిని చికిత్స నిమిత్తం విమానాశ్రయం సమీపంలోని బాలాజి హాస్పిటల్‌కి తరలించినట్లు ఆయన తెలిపారు. ప్రమాదానికిగల కారణాలను అన్వేషిస్తున్నట్లు తెలి >>2

02-6pg2exHMNWJQE.qxd:02-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:43 AM Page 1





శనివారం గన్నవరం విమానాశ్రయంలో టిడిపి అధ్యక్షుడు చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

# లోక్‌సభకు మళ్లీ ఎన్డీయే!

>> ఎగ్జిట్ పోల్ సర్వేలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. సుమారు పదినుంచి 15కిపైగా సర్వేసంస్థలు తమతమ సర్వేల వివరాలను వెల్లడించాయి. అత్యధికశాతం బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికే ఎక్కువ సీట్లు వస్తాయని బిజెపి ఏకైక అతిపెద్ద పార్టీగా లోక్‌సభలో అవతరిస్తుందన్న అంచనాలు పెరిగిపోయాయి. 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 350నుంచి 392వరకూ కూడా స్థానాలు వస్తాయనివివిధ సర్వేలు అంచనాలు వెల్లడించాయి. అంటే మెజార్టీమార్కు 272 స్థానాలను బిజెపి కూటమి దాటేస్తుందని అంచనావేసాయి. అదే ఇండియా కూటమికి 141 నుంచి 169 వరకూ స్థానాలు రావచ్చని విశ్లేషించాయి. ఇక ఇతరులపరంగా గరిష్టంగా 48 స్థానాలకు మించి రాకపోవచ్చని తమతమ అంచనాలు తెలిపాయి. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో దక్షిణాదినుంచి బిజెపికి ఎక్కువస్థానాలు అంచనాల్లో తేలింది. దక్షిణ రాష్ట్రాలతోపాటు పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో కూడా బిజెపి పాదంమోపుతోందని సర్వే సంస్థలు తమతమ విశ్లేషణల్లో తెలిపాయి. మోడీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయంఅన్న రీతిలో అంచనాలు వచ్చాయి. బిజెపి ఈసారి కూడా గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, దేశరాజధానిల్లో తన సత్తా చూపిస్తుందన్న అంచనాలు సర్వేలో తేలింది. అరవింద్‌కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీపార్టీ మిత్రపక్షం కాంగ్రెస్ పార్టీలు ఈసారికూడా ఢిల్లీపరిదిలోని ఏడు స్థానాల్లో ఒక్కసీటు కూడా గెలుచుకోవడం కష్టమే నని సర్వేలు చెపుతున్నాయి. బీహార్‌లోని 40 స్థానాల్లో ఆర్జేడి ఏడుసీట్లుసాధిస్తుందని, హర్యానాలో పదిసీట్లలో మూడు స్థానాలు విపక్షానికి వస్తాయని, రాజస్థాన్‌లో కూడా గతం కంటే కొంత మెరుగుపడుతుందని సర్వేల్లో తేలింది. దక్షిణాదిలో కేరళలో ఒకస్థానం, తమిళనాడులో రెండు స్థానాలు గెలుచుకోవడం ద్వారా ఈరెండురాష్ట్రాల్లో కాలుమోపినట్లవుతుంది. ఇక పోటాపోటీగా హింసాత్మక వాతావరణంలో జరిగిన బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాల్లో ఈసారి మమతా బెనర్జీ టీఎంసీకి 19 స్థానాలకు మించి రాకపోవచ్చన్న అంచనాలు సర్వేల్లో తేలింది. అదేవిధంగా కాంగ్రెస్ పాలనలో ఉన్న కర్ణాటకలో కూడా బిజెపి ఆధిక్యంతో వస్తుందని అంచనా. మొత్తం 28 స్థానాల్లో 50శాతానికిపైగా విజయం సాధిస్తుందని అంచనా. ప్రస్తుతం తెలంగాణలో కూడా అదేపరిస్థితి 17 సీట్లలో 50శాతానికిపైగా గెలుస్తుందన్న ధీమాతో బిజెపి ఉంది.

| సర్వేసంస్థపేరు | ఎన్డీయే | ఇండియా కూటమి | ఇతరులు |
|---|---|---|---|
| దైనిక్‌భాస్కర్ | 281-350 | 145-201 | 33-49 |
| ఇండియా న్యూస్ డి డైనమిక్స్ | 371 | 125 | 47 |
| జన్‌కీబాత్ | 362-392 | 141-161 | 10-20 |
| న్యూస్ నేషన్ | 342-378 | 153-169 | 21-23 |
| రిపబ్లిక్‌టివి పిమార్క్ | 359 | 154 | 30 |
| రిపబ్లిక్ భారత్‌మాట్రిజ్ | 353-368 | 118-133 | 43-48 |
| ఎన్డీటీవీపోల్ ఆఫ్ పోల్స్ | 358 | 148 | 37 |

# మళ్లీ విజయం మనదే

>>దేళ్లలో రాష్ట్రంలో విద్యా,ఉపాధి అవకాశాలు పెంచామన్నారు.భారీ పారిశ్రామిక పెట్టుబడులు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెచ్చామన్నారు. ఇప్పటికే మూడు లక్షలకుపైగా ఉద్యోగాలు కల్పించామన్నారు.గ్రామ సచివాలయ వ్యవస్థలోనే రెండు లక్షల ఉద్యోగాలు,వైద్య రంగంలో 53వేల ఉద్యోగాలు, అధ్యాపకరంగంలో ,గ్రూప్ సర్వీస్సులో ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఏ విషయంలోనైనా మనం ఇచ్చిన వాగ్దానం తప్పలేదన్నారు. ఎన్నికల ప్రణాళికలో లేకుండా ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చామన్నారు.మనం రూపొందించిన నవరత్నాలు ప్లస్ ఎన్నికల ప్రణాళికలను ప్రజలు దగ్గరకు తీసుకుని వెళ్లామన్నారు. ప్రజలు మన ఎన్నికల ప్రణాళికను నమ్మారు కాబట్టే ఓట్లు వేసారన్నారు. నవరత్నాలు ప్లస్‌లో మనం అమలులోఉన్న సంక్షేమపథకాలను అమలు చేస్తూ, వాటి లబ్ధి మొత్తాన్ని పెంచుతామన్నారు.

**విదేశ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి చేరుకున్న సిఎం జగన్**

సిఎం రోజుల విదేశీపర్యటను ముగించుకుని శనివారం ఉదయం రాష్ట్రానికి చేరుకున్నారు. లండన్‌నుంచి ప్రత్యేక విమానం(గన్నవరం) ఎయిర్ పోర్టుకు చేరుకున్న సిఎం జగన్ ఆయన సతీమణ భారతీకి రాష్ట్రమంత్రులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు,పార్టీనేతలు ఘన స్వాగతం పలికారు. ఎంపీలు విజయసాయిరెడ్డి.,నందిగం సురేష్, మంత్రులు జోగి రమేష్. చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, మెరుగ నాగార్జున.కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, వెల్లంపల్లి శ్రీనివాస్,కైలే అనిల్‌కుమార్, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, టీజె సుధాకర్‌బాబు, కోన రఘుపతి.,ముదునూరి ప్రసాదరాజు, శిల్పా చక్రపాణిరెడ్డి,ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్,రుహుల్లా, మొండితోక అరుణ్‌కుమార్, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్ధి సర్నాల తిరుపతిరావు.విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్ధి షేక్ అసిఫ్, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే అభ్యర్ధి నూర్ ఫాతిమా, ఏలూరు పార్లమెంటు అభ్యర్ధి కారుమూరు సునీల్‌లు ఘన స్వాగతం పలికారు.

# వివేకా హత్యకేసుపై వ్యాఖ్య తగదు

>>ఏ కేసు విషయంలోనైనా తమ కింద సిబ్బందికి విచారణలో సూచనలు చేయడం సాధారణమన్నారు.తనపై కొన్ని రాజకీయ అపోహలున్నాయన్నారు.తాను బాధ్యత కలిగిన పోలీసు అధికారిగానే వ్యవహరించానన్నారు.టీడీపీ హయంలో 23 మంది ఎంఎల్ఏలు టీడీపీలోకి రావడానికి తాను కారణమనడం సరికాదనానఓనరు.ఇది రాజకీయ కోణంలో జరిగిందన్నారు.అది రాజకీయాంశం అన్నారు.2019లో పరిపాలనా విధానంలో స్పష్టమైన మార్పు కన్పించిందన్నారు. తప విషయంలో అనుహ్య మార్పులు చోటు చేసుకున్నాయన్నారు.చేయని తప్పుకు సస్పెండ్ అయ్యానన్నారు.దీనిలో తన తప్పు లేదు కాబట్టే సుదీర్ఘ పోరాటం చేసానన్నారు.తాను ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ రిటైర్ అయ్యానన్నారు. తనపై కేసులు న్యాయస్థానంలో ఉన్నాయన్నారు. అధికారులు ఎన్నో చెబుతారు.నాయకులు వాటిని విశ్లేషణ చేసుకునే దిశలో ఉండాలన్నారు.తాను ఏం తప్పు చేసానో తెలియకుండా నాయకులు వ్యవహరించారు.అందరి జీవితాలు ఒకే విధంగా ఉండవు.అయిదేళ్ళు నేను న్యాయం కోసం పోరాటం చేసానన్నారు.ఇది తన ఉద్యోగం అనుకున్నానన్నారు.నేను సమాజ హితం కోసం నా పనినేను చేసుకుని పోతాను.శేషజీవితం ప్రశాంతంగా గడుపుతానన్నారు.నేను ప్రజల మంచిని కోరుకుంటునే ఉంటానన్నారు.

# ఏడోవిడత పోలింగ్ 59.45%

## 57 నియోజకవర్గాల్లో 904 మంది పోటీ

**న్యూఢిల్లీ, జూన్ 1:** సార్వత్రిక ఎన్నికల్లో చిట్టచివరి అంకం ఏడో విడత పోలింగ్‌లో రాత్రి 8.45 గంటలకు 59.45శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల సంఘంప్రకటించింది. సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని అసెంబ్లీలకు కూడా ఎన్నికలు పూర్తిఅయ్యాయి. ఓటర్లు ఎంతో సంయమనం పాటించి పెద్ద ఎత్తున పోలింగ్‌కేంద్రాలకు తరలివచ్చి స్వేచ్ఛగా నిర్భయంగా ఓటువేసారని సిఇసి రాజీవ్‌కుమార్ అభినందనలు తెలిపారు. ఏడో విడతలో ఎనిమిది రాష్ట్రాలు కేంద్ర పాలితప్రాంతాల్లో 57 నియోజకవర్గాలకు పోలింగ్ పూర్తి అయింది. మొత్తం 904 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ఏడో విడతతో మొత్తం పార్లమెంటు ఎన్నికలకు పోలింగ్‌ప్రక్రియ పూర్తి అయిందని, ఓట్లలెక్కింపు జూన్ నాల్గవ తేదీ జరుగుతుందనిఎ న్నికల సంఘంప్రకటించింది.

SINGAM KUIL WHITE SATURDAY
DrawDate on:01/06/24

DAY - SINGAM SERIES Dr No:241
1st Prize Rs.100000/- 521168
2nd Prize Rs.7000/- 93373
3rd Prize Rs.3500/-
00270 03028 23005 31524 39768
51905 65221 77495 90875 98155
4th Prize Rs.200/-
0666 1574 2673 4548 4761 5087 5726
6127 6459 6925
5th Prize Rs.100/-
0500 2657 2974 3193 3365 4182 5227
7065 8344 9580
6th Prize Rs.50/-
0073 1240 2346 4303 5575 6878 9047
0090 1366 2361 4588 5638 7147 9294
0132 1371 2396 4728 5700 7177 9328
0200 1431 2580 4785 5798 7397 9426
0303 1466 2780 4854 5844 7475 9454
0542 1489 2818 4985 5908 7671 9561
0574 1693 3383 5052 5953 7865 9582
0578 1794 3689 5079 6011 7869 9639
0579 1851 3708 5086 6073 7994 9840
0782 1870 3792 5144 6164 8091 9986
0925 1930 4000 5162 6497 8326
0983 1989 4017 5222 6502 8633
0995 2057 4044 5255 6574 8912
1116 2131 4108 5260 6590 8998
1201 2283 4196 5267 6688 9031

DAY - KUIL SERIES Dr No:241
1st Prize Rs.100000/- 346699
2nd Prize Rs.7000/- 81171
3rd Prize Rs.3500/-
03426 10020 17299 24239 32751
51442 73604 75214 78268 91425
4th Prize Rs.200/-
0592 2997 3621 5486 6214 7379 8574
8838 9495 9718
5th Prize Rs.100/-
1654 2662 3155 4300 5003 5197 7275
8184 9443 9841
6th Prize Rs.50/-
0005 1775 2970 4433 5839 7301 8616
0323 1809 3066 4477 5856 7409 8932
0388 1820 3098 4670 5872 7467 9077
0389 1905 3233 4689 5943 7962 9220
0662 1977 3568 5119 6005 8045 9505
0848 1987 3650 5167 6253 8183 9539
0865 2024 3693 5198 6358 8240 9559
0879 2088 3738 5229 6417 8352 9594
1011 2251 3750 5339 6460 8369 9868
1334 2253 3814 5395 6701 8389 9959
1417 2272 3836 5396 6872 8400
1440 2284 3997 5498 6929 8474
1527 2351 4190 5631 6972 8519
1547 2593 4397 5728 6997 8542
1721 2739 4399 5752 7248 8565

ROSA DEAR DIAMOND SATURDAY
DrawDate on:01/06/24

DAY - ROSA SERIES Dr No:241
1st Prize Rs.100000/- 151220
2nd Prize Rs.7000/- 23756
3rd Prize Rs.3500/-
04229 09236 21337 27641 32148
72389 89043 90106 96244 99649
4th Prize Rs.200/-
0334 0383 0422 2125 2301 5026 5352
6117 6297 7791
5th Prize Rs.100/-
0167 1603 2110 2675 2835 3273 5217
7144 8063 8990
6th Prize Rs.50/-
0151 1249 2508 4129 5422 7672 9058
0180 1289 2517 4157 5511 7711 9095
0367 1536 2607 4251 5518 7771 9249
0386 1789 2745 4350 5689 7808 9339
0483 1797 2966 4379 5959 7994 9535
0487 1981 3012 4470 6477 8082 9536
0503 2026 3022 4481 6505 8153 9643
0518 2105 3037 4670 6878 8177 9818
0537 2127 3081 4770 6926 8339 9837
0691 2142 3468 4782 6962 8455 9843
0695 2157 3494 5019 6991 8465
0886 2167 3566 5099 7025 8701
1107 2302 3924 5222 7251 8770
1141 2477 3983 5256 7322 8808
1206 2478 4127 5343 7418 8869

DAY - DEAR SERIES Dr No:241
1st Prize Rs.100000/- 678493
2nd Prize Rs.7000/- 78851
3rd Prize Rs.3500/-
01445 01680 24913 45757 59079
63536 70172 76505 77938 95569
4th Prize Rs.200/-
1190 1630 1823 2874 3431 3464 5804
6821 9336 9465
5th Prize Rs.100/-
1378 2631 3583 4457 4478 4823 4908
6640 8321 8799
6th Prize Rs.50/-
0528 1849 3203 5311 6658 7958 9091
0757 1936 3336 5327 6710 7959 9245
0776 1973 3524 5350 6819 8062 9344
0799 2063 3555 5441 7198 8102 9353
0826 2280 3882 5494 7205 8138 9401
0849 2338 3951 5603 7210 8195 9428
1109 2411 3953 5619 7225 8280 9489
1159 2423 4315 5647 7353 8301 9775
1175 2470 4403 5777 7382 8312 9832
1276 2509 4646 5914 7487 8350 9944
1377 2569 4683 5973 7535 8390
1411 2576 4690 6116 7565 8720
1504 2731 4902 6207 7705 8746
1609 2991 5217 6373 7863 8784
1663 3067 5253 6375 7897 9017

THANGAM VAIRAM SKILL SATURDAY
DrawDate on:01/06/24

DAY - THANGAM SERIES Dr No:241
1st Prize Rs.100000/- 375137
2nd Prize Rs.7000/- 66972
3rd Prize Rs.3500/-
21218 23897 28323 29131 31827
38981 41440 55738 84740 93368
4th Prize Rs.200/-
0393 1810 2863 3182 3473 3880 4451
4475 6730 7598
5th Prize Rs.100/-
0690 0878 2950 4042 4082 5903 6029
6254 6288 8978
6th Prize Rs.50/-
0124 2066 3682 4700 6173 7437 9452
0538 2177 3705 4877 6205 7683 9638
0611 2222 3848 4986 6463 7809 9662
0925 2249 3949 5131 6521 8149 9666
1084 2411 4006 5371 6659 8235 9751
1117 2678 4007 5376 6715 8590 9771
1199 2951 4119 5437 6881 8753 9887
1482 3091 4162 5551 6958 9047 9907
1522 3198 4206 5616 7134 9050 9927
1542 3397 4290 5651 7223 9094 9932
1632 3484 4293 5719 7261 9121
1750 3489 4462 5737 7338 9126
1784 3543 4607 5797 7373 9169
1878 3578 4631 5838 7419 9302
2059 3656 4634 6056 7435 9402

DAY - VAIRAM SERIES Dr No:100
1st Prize Rs.50000/- 719396
2nd Prize Rs.7000/- 19141
3rd Prize Rs.3500/-
06269 29556 49352 55038 63927
67366 80191 81868 96636 99816
4th Prize Rs.200/-
0721 0826 0961 2247 2934 5829 6430
6605 6935 8345
5th Prize Rs.100/-
1011 1567 1821 2554 3017 3841 3847
5062 7993 8272
6th Prize Rs.50/-
0044 1570 2754 4446 6109 7149 8526
0049 1754 2799 4523 6191 7204 8752
0056 1794 3167 4563 6326 7293 9148
0236 1834 3285 4565 6333 7302 9165
0391 1909 3457 4608 6440 7330 9185
0444 1910 3525 4719 6451 7464 9302
0445 2029 3561 4988 6486 7546 9672
0512 2036 3700 5321 6523 7628 9708
0539 2164 3757 5472 6654 7789 9885
0588 2416 3827 5473 6798 7877 9927
0675 2429 3971 5581 6868 7938
1031 2430 4036 5670 6917 8078
1123 2448 4275 5918 6946 8290
1339 2485 4392 5961 6988 8417
1372 2516 4430 5985 7032 8446

NALLANERAM MANI SKILL SATURDAY
DrawDate on:01/06/24

DAY - NALLANERAM SERIES Dr No:241
1st Prize Rs.50000/- 195943
2nd Prize Rs.7000/- 34515
3rd Prize Rs.3500/-
00098 08743 13755 35600 40594
82092 89259 93934 96109 96400
4th Prize Rs.200/-
0356 1655 2245 2434 3091 7791 8124
8417 9404 9700
5th Prize Rs.100/-
0957 1053 1281 1401 4172 4186 4732
6064 7401 9919
6th Prize Rs.50/-
0230 1796 3348 5358 6550 7484 9088
0337 1886 3468 5417 6601 7536 9115
0388 1939 3581 5430 6641 7757 9310
0547 2003 3877 5467 6814 7845 9571
0551 2049 3922 5985 6936 7867 9590
0557 2106 4434 6022 6977 7996 9650
0689 2126 4763 6036 7141 8094 9778
1015 2146 4808 6046 7147 8112 9863
1023 2800 4868 6098 7262 8273 9916
1055 2860 4987 6158 7309 8552 9943
1268 2877 5105 6218 7351 8844
1310 2986 5114 6290 7363 8849
1393 3126 5155 6392 7370 8955
1456 3164 5236 6495 7384 9023
1772 3343 5318 6543 7418 9046

DAY - MANI SERIES Dr No:100
1st Prize Rs.50000/- 657873
2nd Prize Rs.7000/- 45902
3rd Prize Rs.3500/-
02426 02970 25714 28340 43399
51266 70207 70365 75018 80965
4th Prize Rs.200/-
2108 2282 3180 4955 6004 6723 6939
8407 8431 9026
5th Prize Rs.100/-
0796 1842 5485 6070 6871 7127 8555
9261 9353 9956
6th Prize Rs.50/-
0014 1306 2646 3982 5925 6985 8675
0054 1374 2757 4196 5948 6995 8913
0265 1410 2882 4247 6181 7033 8948
0388 1443 3050 4604 6240 7310 9168
0451 1525 3074 4740 6400 7459 9235
0462 1532 3114 4766 6470 7568 9247
0482 1902 3323 4775 6539 7787 9258
0490 2040 3361 5131 6563 7831 9428
0541 2071 3481 5271 6582 7874 9518
0615 2170 3519 5442 6592 8216 9649
0752 2185 3573 5488 6739 8470
1031 2353 3625 5607 6907 8553
1120 2354 3825 5661 6919 8568
1127 2603 3903 5884 6938 8618
1279 2645 3926 5924 6944 8658

KUMARAN VISHNU WAVE SATURDAY
DrawDate on:01/06/24

DAY - KUMARAN SERIES Dr No:241
1st Prize Rs.50000/- 957761
2nd Prize Rs.7000/- 43494
3rd Prize Rs.3500/-
01084 06871 13481 25905 31354
41930 45432 49983 86120 91793
4th Prize Rs.200/-
0404 2589 3510 4618 4865 5093 5997
6492 7195 8545
5th Prize Rs.100/-
0136 1753 2923 4485 4574 4627 6066
6325 6465 8727
6th Prize Rs.50/-
0157 1416 2709 4199 6306 7869 9282
0255 1448 2789 4312 6535 7999 9293
0556 1460 2989 4316 6790 8025 9333
0578 1468 3141 4708 7129 8121 9534
0583 1635 3313 4731 7136 8217 9546
0615 1669 3317 4756 7192 8243 9560
0630 1717 3399 4849 7357 8362 9660
0660 1819 3560 5174 7414 8388 9736
0719 1886 3611 5201 7524 8504 9856
0843 1901 3633 5544 7628 8521 9947
0926 2049 3779 5691 7731 8572
0989 2089 3787 5744 7751 8789
1072 2108 3820 6032 7759 9003
1275 2182 3836 6176 7818 9065
1299 2519 4187 6206 7851 9202

DAY - VISHNU SERIES Dr No:241
1st Prize Rs.50000/- 285243
2nd Prize Rs.7000/- 63941
3rd Prize Rs.3500/-
19591 32611 50925 52582 58345
61647 86843 90858 91864 95981
4th Prize Rs.200/-
3176 5454 5931 6654 6781 7772 8255
8456 9088 9778
5th Prize Rs.100/-
1913 2007 2851 4757 5806 6768 7258
7298 8356 9000
6th Prize Rs.50/-
0242 1097 1935 3609 5441 7059 9265
0332 1139 2121 3864 5675 7174 9330
0358 1193 2124 3879 5721 7315 9377
0367 1262 2201 3933 5855 7408 9379
0380 1387 2230 4079 5873 7496 9592
0496 1401 2246 4148 5970 7505 9631
0517 1476 2388 4364 6111 7571 9794
0521 1623 2483 4505 6177 7723 9804
0529 1624 2619 4550 6257 7737 9828
0714 1724 2862 4799 6400 7831 9874
0735 1730 2980 4868 6445 8250
0783 1766 3158 4891 6477 8546
0790 1790 3217 4973 6509 8727
0930 1849 3257 5075 6579 8893
1080 1914 3397 5370 6722 8930

SWARNALAXMI LION GOLD SATURDAY
DrawDate on:01/06/24

SWARNALAXMI SERIES Dr No:241
1st Prize Rs.50000/- 546434
2nd Prize Rs.7000/- 79828
3rd Prize Rs.3500/-
13549 24216 24678 35405 46777
57855 68847 79278 81591 92578
4th Prize Rs.200/-
0950 1685 2732 3559 4372 5958 6109
6826 8587 9798
5th Prize Rs.100/-
0348 1417 2997 4908 5080 5293 5985
6623 7096 7277
6th Prize Rs.50/-
0004 1306 2858 4345 6361 8156 9125
0038 1388 2967 4888 6397 8169 9301
0060 1584 3140 4938 6415 8171 9434
0333 1585 3424 5022 6461 8238 9519
0385 1921 3457 5122 6616 8388 9662
0396 2079 3599 5408 6700 8452 9688
0446 2100 3630 5427 6741 8632 9769
0482 2183 3807 5526 6860 8689 9801
0503 2240 3914 5609 7182 8741 9802
0850 2395 4001 5617 7438 8853 9982
0934 2459 4106 5675 7452 8906
1108 2568 4201 5971 7490 8908
1192 2642 4218 6172 7748 9055
1266 2682 4227 6209 7944 9071
1302 2725 4270 6347 7997 9080

DAY - LION SERIES Dr No:100
1st Prize Rs.50000/- 612929
2nd Prize Rs.7000/- 45973
3rd Prize Rs.3500/-
12170 23830 34143 34818 45560
56359 67796 78531 89286 91339
4th Prize Rs.200/-
2587 2866 3478 4423 5990 6511 7181
7469 7485 7882
5th Prize Rs.100/-
0320 1025 1289 2983 3192 6531 7263
7394 7487 9020
6th Prize Rs.50/-
0146 1673 3212 5202 6423 7216 9291
0180 1764 3238 5223 6495 7251 9375
0378 2011 3295 5456 6544 7433 9428
0408 2038 3471 5486 6591 7569 9434
0436 2076 3592 5684 6601 7575 9494
0548 2092 3647 5822 6674 7597 9546
0572 2142 3816 5849 6684 7856 9631
0577 2342 3925 5884 6706 7978 9775
0794 2459 4045 5887 6718 8179 9927
0815 2472 4140 5951 6810 8201 9942
1049 2602 4216 6148 6958 8482
1089 2645 5057 6186 6974 8543
1183 2975 5089 6237 7165 8630
1368 3072 5155 6395 7169 8685
1661 3199 5196 6421 7205 8789



శనివారం కోల్‌కతాలో ఓటు వేసిన అనంతరం విక్టరీ మార్కును చూపుతున్న సిఎం మమతా బెనర్జీ

# సమ ఉజ్జీ పోటీ!

>> మహిళా ఓటర్లు అధికార వైకాంగ్రెస్‌కు ఓటు వేసినట్లు వెల్లడించాయి.50 నుంచి 51.5శాతం వరకు పురుషులు టిడిపికి మద్దతుగా నిలిపినట్లు తెలిపాయి.ఇదే సందర్భంలో లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి,వైకాంగ్రెస్ పార్టీ పోటాపోటీగా ఎంపి స్థానాలు సాధిస్తాయని స్పష్టం చేసాయి.సంక్షేమాభివృద్ధి పథకాలు,సుపరిపాలనతో విప్తవాత్మక మార్పులు తెచ్చిన సిఎం జగన్ ప్రభుత్వానికి జైకొట్టారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుంటే, ల్యాండ్ టైలింగ్ యాక్ట్, ఉద్యోగులు నిరసనగా,ప్రధాని నరేంద్రమోడీ ఇమేజ్ టిడిపి (ఎన్డీఏ కూటమి)కి లాభించే దిశలో ఉన్నాయని కొందరంటున్నారు.కౌంటింగ్ రోజు మాత్రమే ఈ అంచనాలు ఎంత వరకు ఫలిస్తాయో వెల్లడవుతుంది. ఇక ఎగ్జిట్ పోల్స్‌కు సంబంధించి ప్రజలు ఎక్కువ ఆసక్తి కన్పరిచిన ఆరా మస్తాన్ సంస్థ మాత్రం ఎపిలో తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పింది.ఈ సంస్థ వైకాంగ్రెస్ మరో సారి అధికారంలోకి వస్తుందని అసెంబ్లీ స్థానాల్లో 94 నుంచి 104 స్థానాల్లో గెలవబోతుందని తెలిపింది.13-15 నుంచి లోక్‌సభ స్దానాల్లో వైకాంగ్రెస్ గెలుస్తుందని తెలిపింది.లోక్‌సభ ఎన్నికల్లో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు డిపాజిట్లు రావనే విషయాన్ని స్పష్టం చేసింది. ఎపి అసెంబ్లీ ఎన్నికల్లో వైకాంగ్రెస్‌పార్టీ 98 నుంచి 116 వరకు,. టీడీపీ 59-77 వరకు సీట్లు వస్తాయని ఆత్మసాక్షి సంస్థ అంచనా వేసింది.వైకాంగ్రెస్‌కు 117 నుంచి 120,టిడిపికి 46 నుంచి 50 సీట్లు దక్కవచ్చని రెస్ సంస్థ తెలిపింది.ఏపీలో 175 అసెంబ్లీ స్దానాలకు,25 పార్లమెంటు స్దానాలకు ఎన్నికలు జరిగాయి.ఈ ఎన్నికలో అధికార వైకాంగ్రెస్ పార్టీ ఒంటరిగా, టిడిపి, జనసేన.బిజెపి కూటమిగా.కాంగ్రెస్. సిపిఐ, సిపిఎం కూటమిగా పోటీ చేసాయి.కుప్పం నుంచి టిడిపి అధినేత చంద్రబాబు,పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్,పులివెందుల నుంచి సిఎం జగన్ పోటీ చేసారు.

# గ్యాస్ లీక్

>> పారు. కర్మాగారం ట్రైలర్ దశలోనే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏదైనా ప్రాణాపాయం సంభవించినట్లు ఐతే కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో 25మంది అమ్మాయిలు ఉన్నారు. ఏకో అల్యూమినియం కర్మాగారంలో గ్యాస్‌లీక్ అయిన ప్రమాదంలో సుమారు 30మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి హుటాహుటిన రేణిగుంట బాలాజీ హాస్పిటల్‌కి వెళ్లి బాధితులను పరామర్శించారు. అస్వస్థతకు గురైన వారందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని కోరారు. అనంతరం సిఎంఆర్ కర్మాగారం ప్రతినిధులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పొల్యూషన్ బోర్డు వారు నిర్లక్ష్యంగా అనుమతులు ఇవ్వడం వల్లనే ఇలాంటి ప్రమాదాలకు చవిచూడాల్సి వస్తోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 'ధ్యానయోగం'

>> ఉన్న తమిళకవి తిరువళ్ళువార్‌కు నివాళులర్పించారు.వివేకానంద శిలాస్మారకం పక్కనే చిన్న దీవిపై ఏర్పాటుచేసిన 133 అడుగుల ఎత్తయిన ఈభారీ విగ్రహం వద్దకు ఆయన పడవలో చేరుకున్నారు. మళ్లీ తిరిగి కన్యాకుమారి తీరానికి వచ్చేసారు. ప్రధాన ధ్యానసమయంలో కేవలం ద్రాక్షరసం,నారికేళ జలం మాత్రమే సేవించారు. గురువారం సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభించిన ధ్యానం శనివారం సాయంత్రం విరమించారు. శనివారం ఉదయం కూడా సూర్యునికి అర్ఘ్యం వదిలారు. సుమారు 131 ఏళ్లక్రితం స్వామి వివేకాంద ఇక్కడ ధ్యానం చేసారు.

# బెంగాల్ ఉద్రిక్తం

>> కేంద్రంలో ఒక సియు, ఒక బియు, రెండు వివిపాట్‌మెషిన్లను తీసుకెళ్లి చెరువులో వేసారు. అయితే అన్ని కేంద్రాల్లోను పోలింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగింది. కొత్తగా ఇవిఎంలు, పత్రాలను సెక్టార్ అధికారికి క్షణాల్లో అందచేసినట్లు బెంగాల్ సిఇఒ చెప్పారు. ఈ సంఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్లు తెలిపారు. ఇక బసీర్హట్ నియోజకవర్గంపై అన్ని పార్టీలు ఫోకస్ పెంచాయి. సందేశ్‌ఖలి బాధితురాలిని ఇక్కడ బిజెపి అభ్యర్ధిగా పోటీకి దించారు. దీనితో టిఎంసికి కూడా ఈ నియోజకవర్గం ప్రతిష్టాత్మకంగా మారింది. స్థానిక మహిళలు కర్రలు చేతపట్టుకుని టిఎంసి కార్యకర్తలు, రాష్ట్రపోలీసులను ఎదిరించారు. టిఎంసి సస్పెండ్ చేసిన షాజహాన్ మద్దతుదారులు తమను భయపెడుతున్నారని వారు చెపుతున్నారు. అయితే రాష్ట్రపోలీసులు మాత్రం స్థానిక బిజెపి మద్దతుదారులు ఓటర్లపై దాడిచేయడంతోనే ఘర్షణ మొదలయిందన్నారు. టిఎంసి జాతీయ కార్యదర్శి అభిషేక్ బెనర్జీ పోటీచేస్తున్న డైమండ్ హార్బర్‌లో టిఎంసి, బిజెపి మద్దతుదారులమధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగాయి. బిజెపి అభ్యర్థి అభిజిత్‌దాస్ టిఎంసి అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపిస్తే టిఎంసివాటిని తిప్పికొట్టింది. చాదవ్‌పూర్‌లోని గంగూలీ బగాన్ వద్ద సిపిఎం కార్యకర్తలపై టిఎంసి కార్యకర్తలు దాడికి దిగారని, వారి క్యాంపు కార్యాలయాలను దగ్ధంచేసారని పరస్పరం అరోపణలుచేసుకున్నారు. సిపిఎం ఓటర్లను భయపెడుతోందని టిఎంసి ఆరోపించింది. ఇక దక్షిణ 24 పరగణాల జిల్లాలోకూడా టిఎంసి బిజెపి కార్యకర్తలమధ్య తీవ్రస్థాయి ఘర్షణలు జరిగాయి. ఇట్‌కోలా పంచాయితీపరిధిలో రాళ్లురువ్విన సంఘటనలు నమోదయ్యాయి. బెంగాల్ అసెంబ్లీ విపక్షనేత సువేందు అధికారి, బిజెపి ఐటిసెల్ చీఫ్ అమిత్‌మాలవీయ నిరసనల విడియోలను సోషల్‌మీడియాలోపోస్టుచేసారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన పార్టీ గూండాలను రాష్ట్రపోలీసులతో ఓటర్లను భయపెడుతోందన్నారు. ఇక భంగార్‌లో టిఎంసి, ఎఐఎస్ఎఫ్ కార్యకర్తల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఎఐఎస్ఎఫ్ మహిలా కార్యకర్తపై దాడులు జరిగాయని ఇరుపార్టీలు రాళ్లురువ్వుకున్నాయి. అభ్యర్థి నూర్ ఆలమ్‌ఖాన్ వాహనాన్ని ధ్వంసంచేసారు. బెంగాల్‌లోని తొమ్మిది స్థానాల్లో అంటే దందమ్, బరసాత్, బసీర్హట్; జయ్‌నగర్; మథురాపూర్, డైమండ్ హార్బర్; జాదవ్‌పూర్, కోల్‌కత్తా దక్షిణ్, కోల్‌కత్తా ఉత్తర్‌లలో పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభం అయి సాయంత్రం ఆరుగంటలవరకూ కొనసాగింది. ఈసారి పోటీలోప్రముఖులు అభిషేక్ బెనర్జీ డైమండ్ హార్బర్, బిజెపి రేఖాపాత్ర బసీర్హట్, సిపిఎం సుజన్‌చక్రవర్తి దమ్‌దమ్ నియోజకవర్గాల నుంచి పోటీలో ఉన్నారు. మొత్తం 1020 కంపెనీల సిఎపిఎఫ్ బలగాలు వచ్చాయి. 978 బృందాలు పోలింగ్ డ్యూటీలో ఉన్నాయి. 1960 క్యూఆర్‌టి టీమ్‌లు కూడా రాష్ట్ర వ్యాప్తంగా నియమించారు.

# డయేరియాతో విలవిల

>> తీవ్రతకు తగినట్లు ఆయా ప్రాంతాల్లో శానిటేషన్,ఇతర చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో డయేరియా వ్యాధితో ఇద్దరు మహిళలు, బాలుడు మృతి చెందినట్లు సమాచారం. ఇక మొగల్రాజపురం ఆయుర్వేద క్లినిక్, సిపిఎం భవనాల్లో ఆరోగ్యశాఖ ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఇతర ప్రాంతాల్లో అర్బన్ క్లినిక్‌లో సేవలు అందిస్తున్నామని వెల్లడించింది. డయేరియా ప్రబలివుందని చెబుతున్న ప్రతి ప్రాంతంలో ఆరోగ్యకార్యకర్తలు ఇంటింటికి తిరుగుతున్నారని తెలిపారు. మరో పక్క డయేరియా బాధితులకు సిపిఎం సెంట్రల్ అభ్యర్ధి సిహెచ్‌బాబురావు నేతృత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు ప్రత్యేక వైద్యశిబిరాలకు తరలించి చికిత్స ఇపిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో డయేరియా బారిన పడిన వారి నుంచి రక్త పరీక్షలకు శాంపిల్స్‌ను వైద్య ఆరోగ్య శాఖ సేకరించింది.ఈ ఫలితాలు వెల్లడించాల్సి వుంది. మెగల్రాజపురం, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో మంచి నీటి పైపు లైన్లు డ్రైనేజీలు మీదుగా వెళ్లడం,ట్యాంకులు కడిగిన తరువాత ఆ నీటిని వేరే మార్గంలో బయటకు విడుదల చేయకుండా కుళాయిలకు వదలడం వంటి నిర్లక్షపు పనులు కారణంగా నీరు కలుషితమై ఉండవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

**అధికారులు స్పందించాలి: విపక్షనేత చంద్రబాబు**

విజయవాడలో విజృంభిస్తున్న డయేరియా అంశాన్ని అధికారులు దృష్టిపెట్టి నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని విపక్షనేత నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేసారు.వారం రోజులు వివిధ ప్రాంతాల్లో డయేరియా రోగులు రోజుకు పెరుగుతుండటం.తొమ్మిది మంది ఈ వ్యాధి లక్షణాలతో మరణించడం ఆందోళకరం అన్నారు.కలుషిత నీరు సరఫరా కారణంగానే ప్రజలు ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు.దీనిపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.డయేరియాతో కాకుండా ఇతర అనారోగ్య కారణాలతో వీరంతా చనిపోయారనడం సరికాదన్నారు.

కలుషిత నీటిపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని డిమాండ్ చేసారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. సిపిఎం నాయకుడు చిగురుపాటి బాబురావు విజయవాడలో డయేరియా పెరుగుతున్న పూర్తి అలసత్వంతో అధికార యంత్రాంగం వ్యవహరి స్తోందని ఆరోపించారు.

## వారం - వర్జ్యం

తేది : 02-06-2024, ఆదివారం,
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయనం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
ఏకాదశి రా.2.42,
రేవతి రా.1.40,
వర్జ్యం ప,2,27-3.57,
దు.సా.4.58-5.50,
శుభసమయం ఉ.7.45-8.30,
రా.11.20-12.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం :** వివాదాలకు, కోపతాపాలకు, దూరంగా వుండండి. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాలనుండి విలువైన సమాచారం అందుతుంది.

**కర్కాటకం :** ఆరోగ్య సమస్యలు, కొంత వరకు తీరుతాయి. సంతానం నుండి శుభవార్తలు వింటారు.

**సింహం :** ఆర్థిక లావాదేవీలు సంతృప్తి కరంగా ఉంటాయి. అనుకున్న పనులు విజయవంతంగా సాగుతాయి.

**కన్య :** ఇంటర్వ్యూలు,పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు. కార్యజయం కలుగుతుంది.

**తుల :** ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా జీవిత భాగస్వామి సలహాలు తీసు కుంటారు. సన్నిహితుల నుండి ఆహ్వానాలు.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**ధనుస్సు:** వివాహ, యత్నాలకు అనుకూలమైన కాలం ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.

**మకరం:**పనుల్లో విజయం సాధిస్తారు. ఆర్థిక వ్యవహారాలున ఆశాజనకంగా సాగుతాయి.

**కుంభం :** ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యం, వాహనాలు విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మీనం :** పనుల్లో ఆటంకాలు ఎదురైనా సన్నిహితుల సహాయం అందుతుంది. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

2-6Pg3exHMNWJQE.qxd:2-6Pg3exHMNWJQE.qxd 1/1/02 5:49 AM Page 1



# బిసిలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న రాజకీయపార్టీలు



హనుమంతుని ఆలయంలో పూజల్లో పాల్గొన్న కేసన శంకరరావు తదితరులు

**అమరావతి, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి:** అణగారిన వర్గాలకు చెందిన బిసి,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలకు తమ జనాభా దామాషా ప్రకారం వాటాల, కోటాలను కేటాయించి ఉన్నత వర్గాలతో సమానస్థాయిలో అభివృద్ధి చెందేలా అన్నివర్గాల సాధికారతకు కృషిచేయటమే సామాజిక న్యాయం అని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏవో కొన్ని పదవులు కొద్దిమంది అట్టడుగువర్గ నాయకులకు ఇచ్చి, కొద్దిపాటి సంక్షేమ పథకాలను అమలు జరిపినంతమాత్రానే అణగారిన వర్గాలకు సామాజిక న్యాయాన్ని అందించించినట్టుగా భావించరాదన్నారు. పలు ప్రాజెక్టులు, పరిశ్రమలు, పెద్దపెద్ద భవంతులతో మహానగరాలను నిర్మించినంత మాత్రాన పేదలు, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి జరిగినట్టు కాదన్నారు. దేశ జనాభాలో 85శాతంగా ఉన్న బలహీనవర్గాల అందరికీ విద్య, వైద్యం, వర్తక, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు, వ్యవసాయం ఇతర సమాజిక వనరులన్నింటిలోనూ, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలన్నింటిలనూ తమ జనాభా దామాషా మేరకు వాటా

> - సామాజిక న్యాయసాధనే లక్ష్యంగా ఉద్యమం
> - రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు 'కేసన'

కోటాలను కేటాయించి సమగ్ర అభివృద్ధి జరిగినపుడే, సామాజిక న్యాయం అందించినట్ల వుతుందని, అదే నిజమైన మానవాభివృద్ధిగా భావించాలని అన్నారు. కానీ నేడు దేశంలోని అణగారిన వర్గాల ప్రజలను ఓటుబ్యాంకుగానే రాజకీయపార్టీలు చూస్తు న్నాయి తప్ప, సామాజిక న్యాయానిన మాత్రం అందించటం లేదన్నారు. అధికారంలోఉన్నపుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నపుడు మరోమాటగా అధికార, ప్రతిపక్ష పార్టీలు, అట్టడుగువర్గాలకు సామాజిక న్యాయాన్ని అందించే విషయంలో మాట మార్చుతున్నారే తప్ప, చిత్తశుద్ధితో అమలుకు పూనుకోవటం లేదని తెలిపారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టంలో, అణగారిన వర్గాలకు చెందిన బిసి మహిళలకు సబ్ కోటా ఇచ్చేలా సవరణ ప్రతిపాదనకు గానీ, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుకుగానీ, బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటుకుగానీ, చట్టసభల్ల బిసి రిజర్వేసన్ల గురించిగానీ, ఏ రాజకీయపార్టీ పార్లమెంట్‌లో నిలదీయకపోవటం శోచనీయమన్నారు. అణగారిన వర్గాలకు జనాభా దామాషా ప్రకారం వానికి సముచిత స్థానాన్ని కల్పించినపుడే రాజకీయంగా, సామాజికంగా న్యాయం జరినట్టు అవుతుందన్నారు. అందుకే మహాత్మా పూలే, డాక్టర్ అంబేద్కర్‌ల ఆలోచనలకు మేరకు 'సామాజిక న్యాయ సాధనే లక్ష్యం'గా బిసిలు, మిగతా ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమిద్దామని కేసన పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే పిన్నెల్లి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ టిడిపి ఎన్నికల ఏజెంట్ సుప్రీంకోర్టులో పిటిషన్

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** మాచర్ల ఎంఎల్ఏ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరించిన శేషగిరిరావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పిన్నెల్లికి హైకోర్టు ఇచ్చిన అరెస్ట్ మినహాయింపు ఆదేశాలను రద్దు చేయాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో తనపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ రోజు కుడా హింసకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు, ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ కుడా దాఖలు చేసాడు, ఆధారాలు ఉన్నప్పటికి ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టినట్లు పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూల రీతిలో వ్యవహరించారన్నాడు, ఈ అంశాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు తెలిపాడు. అంత తీవ్ర ఘటనలు జరిగినప్పటికి బెయిల్ రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

ఈ రెండు పిటిషన్లపై సుప్రీం కోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది.

# తిరుమల సమాచారం

## కలియుగవైకుంఠంలో 'జైశ్రీరామ్ నినాదం'

### - హనుమజ్జయంతిన వేడుకగా అభిషేకాలు




**తిరుమల,జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం ఏడుకొండల్లో శనివారం ఉదయం నుండి రాత్రి వరకు "జైశ్రీరామ్" నినాదాలు ప్రతిధ్వనించాయి. హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా శనివారం ఉదయం తిరుమలలో మరో ప్రసిద్ధ క్షేత్రం అంజనాద్రి పర్వతాల్లో జన్మించిన "బాలాంజనేయస్వామి ఆలయంలో బాలాంజనేయునికి, అంజనా దేవికి" విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామి జన్మస్థలంగా ఆకాశగంగ ప్రాంతంలోని అంజనాద్రి పర్వతంపై వందల సంవత్సరాల క్రిందట అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామి వెలిసినట్లు చారిత్రక ఆధారాలు, పురాణాల కథనంతో నాలుగేళ్ళ క్రిందట టిటిడిఅధికారులు పునరుద్ధాటించారు. శనివారం ఎంతో విశిష్టమైన రోజు కావడం, హనుమజ్జయంతి పర్వదినం రావడంతో బాలాంజనేయస్వామికి **ఉపచారాలు, పంచామృత :** స్నపన తిరుమంజనం నిర్వహించారు. లోకక్షేమం కోసం స్వామికి ఎంతో ప్రీతిపాత్రమైన మల్లెలతో సహస్ర నామార్చన జరిపించారు. అంతకుముందు ఉదయం టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, వైఖానస ఆగమ సలహాదారుడు మోహనరంగాచార్యులు, ఆలయ పార్‌పత్తేదార్ తులసీప్రసాద్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ సెల్వం, వేదవిజ్ఞానపీఠం పండితులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బాలాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**జపాలి తీర్థంలో...:** తిరుమలగిరుల్లోని పాపవినాశనం మార్గంలో జపాలి తీర్థంలో కొలువైన ఆంజనేయస్వామికి హనుమజ్జయంతి పర్వదినాన టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. జపాలి మహర్షి త్రేతాయుగంలో ఆకాశగంగలో స్నానం చేయడంతో హనుమంతుడు ప్రత్యక్షమై వరాలిచ్చారని,అనంతరం ఇక్కడ జాపాలి తీర్థంలో హనుమంతుని విగ్రహాన్ని ప్రతిష్టించారని తెలిపారు. ఇక్కడి స్వామివారిని, స్వామి జన్మస్థలం అంజనాద్రిని భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. అలాగే ఏడుకొండల వెంకన్న ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయాస్వామి ఆలయంలో స్వామివారికి వేదమంత్రోచ్చరణలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

**తొలిసారిగా మాల్‌పూరి ప్రసాదం:** తిరుమల జపాలిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో రాష్ట్రదేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తొలిసారిగా మాల్‌పూరి ప్రసాదాన్ని విక్రయిస్తున్నట్లు హథీరాంజీమఠం పరిపాలన అధికారి రమేష్ తెలిపారు. హనుమంతుని జయంతి సందర్భంగా శనివారం నుండి ప్రతిరోజూ భక్తులకు విక్రయిస్తారు. 20రూపాయలు ఈ మాల్‌పూరి ప్రసాదం ఎంతో రుచికరంగా ఉందని, భక్తుల నుండి విశేష స్పందన లభించింది.

## అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు నిరంతరాయంగా....లేదనే మాట వినిపించ కుండా అక్షయపాత్రలా అందిస్తున్న అన్న ప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళా లిస్తున్నారు. శనివారం ఉదయం తమిళనాడు చెన్నైకి చెందిన కిరోరిమల్ కాశీరామ్ మార్కెటింగ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10లక్షల రూపాయలు చెక్కును అందించింది. ఈ విరాళాలను తిరుపతిలో ప్రతినిధి రాఘవేంద్ర తిరుమలలో ఆలయం ముందు టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డికి అందజేశారు.

## తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో వినిపించని గోవిందనామం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగ వైకుంఠం...ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో గోవింద నామం వినిపించడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తిరుమల-తిరుపతి మధ్య ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా టిటిడి ఉన్నతాశయంతో పలురకాల ప్రణాళికలు అమలుచేస్తున్నా ఇవేమీ ఆర్టీసి అధికారులకు పట్టడం లేదు. తిరుమల నుండి తిరుపతికి,తిరుపతి నుండి తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో ,విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సుల్లోనూ కనీసం భక్తిపారవశ్యం "గోవింద"నామం వినిపించడంలేదు. ఎంతో భక్తిభావంతో ..ప్రశాంత మనస్సుతో తిరుమలకు వచ్చే భక్తులకు తిరుపతి ఆర్టీసి బస్టాండు,రైల్వే స్టేషన్,విష్ణునివాసం తదితర ప్రాంతాల నుండి ఆర్టీసిబస్సులు గమ్యస్థానం చేరుస్తాయి. భక్తులు వెళ్ళే బస్సుల్లో గోవింద నామం వినిపించడంలేదు. ఘాట్‌లో ప్రయాణం ఎంతో ప్రమాదభరితం. అడుగడుగునా ఆపదమొక్కులవాడు రక్షగా వుండాలని.... తమతో రావాలని భక్తులు ప్రార్థిస్తుంటారు. ప్రయాణం సురక్షితంగా సాగి... నీ దర్శనం చేసుకోవాలని భక్తులు కోరుతుంటారు. ఇప్పటికీ కొంతమంది ఉత్తరాంధ్ర భక్తులు, మహారాష్ట్ర, తమిళనాడు భక్తులు బస్సుల్లో గోవింద నామాలు చేస్తుంటారు.అయితే పూర్తిస్థాయిలో ఇవి ఆచరణకు నోచుకోవడంలేదు. తిరుమల తిరుపతి మధ్య రోజూ 480వరకు బస్సులు నడుస్తున్నాయి. 2వేలవరకు ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతిరోజూ 60వేలమంది భక్తులను చేరవేస్తున్నాయి. ఈ బస్సుల్లో గోవిందనామం వినిపింపజేయాలని పలువురు భక్తులు కోరుతున్నా అటు టిటిడి అధికారులు ఇటు ఆర్టీసి అధికారులు పట్టించుకోవడంలేదు.

## ఇప్పుడు రాను.. రాలేను..

## మండలి ఛైర్మన్‌కి వైఎస్సార్సీ ఎమ్మెల్సీ ఇందుకూరి రివర్స్ గేర్‌లో ఆన్సర్



**విజయనగరం, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి** మండలి ఛైర్మన్‌కి వైసీపీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు రివర్స్ గేర్‌లో ఆన్సర్ ఇచ్చారు.ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రఘురాజు స్వంత పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఆయన సతీమణిని కూడా సాక్షాత్తూ లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్టు ఆధారాలు కూడా ఉన్నాయి.వీటన్నింటినీ కలగలిపి ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా పార్టీ నేతలు మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తన వద్దకు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా రఘురాజుకి మండలి ఛైర్మన్ తాఖీదు పంపారు. కానీ రఘురాజు ఈ తాఖీదును సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో మండలి ఛైర్మన్ మరోసారి రఘురాజుకి నోటీసు పంపారు. దీనికి రఘురాజు రెస్పాండ్ అయ్యారు. తనకు అనారోగ్యంగా ఉందని, ఇప్పుడు రానని, రాలేనని ఆయన ఛైర్మన్‌కి సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో రఘురాజు ఎపిసోడ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆయనపై వేటు తప్పకపోవచ్చని సర్వత్రా చర్చ జరుగుతోంది.మరి మండలి ఛైర్మన్ రఘురాజు వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో, దానిపై రఘురాజు ఎలా రియాక్ట్ అవుతారో వేచి చూడాలి.

# దక్షిణ కైలాసంలో హనుమజ్జయంతి వేడుకలు

## 16కాళ్ల మండపంలో ప్రత్యేక పూజలు

**శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16 కాళ్ళ మండపం వద్ద శనివారం హనుమజ్జయంతి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ధార్మిక కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ఇఒ ఎస్ వి నాగేశ్వరరావు ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఏర్పాట్లును ఆయనే ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆలయంలోని 16 కాళ్ళ మండపంలో వెలసిన హనుమజ్జయంతి వేడుకలను స్థానిక సంప్రదాయం మేరకు శాస్త్రోక్తంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున ఏర్పాటు చేసారు. శనివారం కావటంతో ఆలయానికి రద్దీ అధికంగా ఉండటంతో జయంతి పూజలు, అభిషేకాలకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఇక్కడి స్థంభంపై ఉన్న మారుతి విగ్రహానికి ప్రతి మంగళవారం పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ హనుమజ్జయంతి సందర్భంగా కలశం ఏర్పాటు చేసారు.వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన చందనాలంకారం భక్తుల్ని ఇట్టే ఆకట్టుకుంది. తరువాత ధూప దీప నైవేద్యాలను అందించారు. పూర్ణ హారతులందించారు. ఈ సందర్భంగా భక్తులు జైహనుమాన్ అంటూ నినాదాలు చేసారు. అభిషేకాలు, హోమాలు, కలశస్థాపన పూజలను అర్చకులు తులసీ నిర్వహించగా వేదపండితులు మారుతీశర్మ, అర్చకులు తులసీ శర్మ, వారి సహచరులు వేద మంత్రాలను పఠించారు. పూజలకు సంబంధించిన ఏర్పాట్లును టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్ పర్యవేక్షించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని ముత్యాలమ్మగుడి వీధిలో వెలసిన అభయ అంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వెలసిన హనుమంతుని విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఉదయం 11 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కాగా మధ్యాహ్నం భక్తులకు నిత్యాన్న ప్రసాదం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ



సందర్భంగా ముత్యాలమ్మగుడి వీధి అంతా కాషాయ జెండాలతో ముస్తాబు చేసారు.ఆలయం వద్ద భక్తులు భారీ ఎత్తున రావటంతో నిర్వాహకులుచక్కటి ఏర్పాట్లు చేసారు. అభిషేకం తిలకించుటకు వీలుగా ఏర్పాట్లు చేసారు.

# 'సజ్జల'పై ఎఫ్ఐఆర్‌తో వైఎస్సార్సీ నేతలకు షాక్

## టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు

**అమరావతి, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు అవ్వటం, వైఎస్సార్సీ నేతలు షాక్‌లో ఉండటంతో ఎక్కడ కార్యకర్తలు దూరం అవుతారేమోనని, వైఎస్సార్సీ సొంత మీడియాలో చంద్రబాబుపై తప్పుడు రాతలకు పూనుకున్నారని టిడిపి ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మండిపడ్డారు. శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలోఆయన మీడియాతో మాట్లాడారు. నీలి మీడియాలో కథనాలుచూస్తుంటే పూర్తిగా దిగజారిపోయారని అన్పిస్తోందని అన్నారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాత్రిని పగలు. పగలుని రాత్రి అని రాయటం ఎంత అబద్ధమో అలానే రాస్తున్నారని అన్నారు. చీఫ్ ఏజెంట్ల సమావేశానికి చంద్రబాబు రాకుండానే వచ్చినట్టు తప్పుడు రాతలు రాయటం సిగ్గుచేటని అన్నారు. చంద్రబాబు హైదరాబాద్‌లో ఉన్నారని అన్నారు. అచ్చెన్నాయుడు రావాల్సి ఉండగా, అనారోగ్యంతో ఆయన రాలేదన్నారు. మాజీ మంత్రి యనమల, పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఐపిఎస్ అధికారి లక్ష్మయ్య, మాజీ సెర్ఫ్ సిఇఒ కృష్ణమోహన్, శ్రావణ్‌కుమార్, తాను ఆ కార్యక్రమంలో పాల్గొని కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశామని అన్నారు. వారి అనుమానాలను నివృత్తి చేశామని తెలిపారు. అవసరమైతే, తిరగబడమని చెప్పటం సజ్జల అహంకార పూరిత చర్యలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. సజ్జల మీద ఎఫ్ఐఆర్ రిజిస్టర్అవ్వటం వైఎస్సార్సీ నేతలకు షాకింగ్ న్యూస్ అని అన్నారు. అది ఓర్వలేక వారి మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంతకంటే దిగజారుడుతనం లేదన్నారు. సజ్జలకు దమ్ముంటే చంద్రబాబు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడారని పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చని అన్నారు. సజ్జల పతనం స్టార్ట్ అయ్యిందని అన్నారు. వైఎస్సార్సీ ఇక ఉండదన్నారు.

# వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నా

## - మధ్యప్రదేశ్ సిఎం మోహన్‌యాదవ్



**తిరుమల, జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని, స్వామివారి దీవెనలు అందరిపై ఉండాలని కోరినట్లు మధ్యప్రదేశ్‌సిఎం మోహన్‌యాదవ్ తెలిపారు. శనివారం వేకువజామున ఆయన కుటుంబంతో కలిసి సాంప్రదాయదుస్తుల్లో సుప్రభాతసేవలో శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గ్రాండ్ ట్రంక్ రైలు మార్గంలో సాంకేతిక పనులు- రైళ్లకు అంతరాయం

**గుంతకల్లు రైల్వే, జూన్ 1 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో కొత్తగా నిర్మించిన మూడవ రైలు మార్గం అనుసంధాన పనులు కారణంగా తెలుగు రాష్ట్రాల మీదుగా వివిధ ప్రాంతాల మధ్య తిరిగే రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే జోన్ పరిధిలోని గ్రాండ్ ట్రంక్ రైలు మార్గంలో సికింద్రాబాద్ డివిజన్, ఖాజీ పేట-బల్హార్షా సెక్షన్ ఆసిఫాబాద్-రెచ్ని రోడ్ స్టేషన్‌ల మధ్య తాజాగా పూర్తి చేసిన మూడవ రైలు మార్గాన్ని రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసే సాంకేతిక పనులను ఇరవై రోజులపాటు యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్న కారణంగా ఈ మార్గంలో తిరిగే రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**రద్దు చేసిన రెగ్యులర్ రైళ్లు :** ఖాజీపేట- షోలాపూర్-బల్హార్షాల-ఖాజీపేట్‌ల మధ్య తిరిగే నెంబర్ 17003/04 డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను ఈ నెల 17 నుంచి జులై 06 వరకు రద్దు చేశారు. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్ నగర్-సికింద్రాబాద్‌ల మధ్య తిరిగే నెంబర్ 12757/58 డైలీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఈ నెల 23 నుంచి జులై 06 వరకు రద్దు చేశారు. ఈ నెల 23, 25, 30 జులై 02, 07 తేదీల్లో మంగళ, ఆది వారాల్లో చెన్నై నుంచి జైపూర్‌కు బయల్దేరే నెంబర్ 12967 బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 21, 23, 28, 30, జులై 05 తేదీల్లో ప్రతి శుక్ర, ఆదివారాల్లో జైపూర్ నుంచి చెన్నైకు బయల్దేరే నెంబర్ 12968 బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 27, 29, జులై 04, 06, తేదీల్లో గురు, శనివారాల్లో మైసూర్ నుంచి జైపూర్‌కు బయల్దేరే నెంబర్ 12975 బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 24, 26, జులై 01, 03 తేదీల్లో సోమ, బుధశారాల్లో జైపూర్ నుంచి మైసూర్‌కు బయల్దేరకే నెంబర్ 12976 బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 26 జులై 03 తేదీల్లో బుధవారాల్లో యశ్వంత్‌పూర్ నుంచి లక్నోకు బయల్దేరే నెంబర్ 12539 వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 28, జులై 05 తేదీల్లో శుక్రవారాల్లో లక్నో నుంచి యశ్వత్‌పూర్‌కు బయల్దేరే నెంబర్ 12540 వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. ఈ నెల 25, జులై 02 తేదీల్లో మంగళవారాల్లో దర్భాంగ్ నుంచి మైసూర్‌కు బయల్దేరే నెంబర్ 12577 వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 28, జులై 05 తేదీల్లో శుక్రవారాల్లో మైసూర్ నుంచి దర్భాంగకు బయల్దేరే నెంబర్ 12578 వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను, ఈనెల 20, 27, జులై 04 తేదీల్లో గురువారాల్లో రాజేంద్ర నగర్ టెర్మినల్ నుంచి బెంగుళూరుకు బయల్దేరే నెంబర్ 22353 ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 23, 30 జులై 07 తేదీల్లో ఆదివారాల్లో బెంగుళూరు నుంచి పాట్నా జంక్షన్‌కు బయల్దేరే నెంబర్ 22354 ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 23, 30, తేదీల్లో ఆదివారాల్లో యశ్వంత్‌పూర్ నుంచి జాబల్‌పూర్‌కు బయల్దేరే నెంబర్ 12193 ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 22, 29 తేదీల్లో శనివారాల్లో జాబల్‌పూర్ నుంచి యశ్వంతపూర్‌కు బయల్దేరే నెంబర్ 12194 ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 25 జులై 02 తేదీల్లో మంగళవారాల్లో బిలాస్‌పూర్ నుంచి తిరుణవేళికు బయల్దేరే నెంబర్ 22619 ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 23, 30 తేదీల్లో ఆదివారాల్లో తిరుణవేళి నుంచి బిలాస్‌పూర్‌కు బయల్దేరే నెంబర్ 22620 ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 27 జులై 04వ తేదీల్లో గురువారాల్లో భగత్‌కీ కోఠి జోధ్‌పూర్ నుంచి మన్నార్ కోడికు బయల్దేరే నెంబర్ 22673 ఎక్స్‌ప్రెస్‌ను,

ఈ నెల 24 జులై 01 తేదీల్లో సోమవారాల్లో మన్నార్ కోడి నుంచి భగత్ కీ కోఠి జోద్‌పూర్‌కు బయల్దేరే నెంబర్ 22674 ఎక్స్‌ప్రెస్‌ను, ఈ నెల 30, జులై 07 తేదీల్లో ఆదివారాల్లో ఖాజీపేట నుంచి పూణేకు బయల్దేరే నెంబర్ 23152 ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

# జగన్‌రెడ్డి అరాచక పాలనకు సమయం దగ్గరపడింది

## టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండి రాకేష్



**అమరావతి, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి:** అధికారం నుంచి వైదొగలపోగే సమయంలోనే జగన్‌రెడ్డి కరెంట్ బిల్లులు పెంచి జనం నడి విరిచారని టిడిపి వాణిజ్యవిభాగం అధ్యక్షుడు డూండి రాకేష్ దుయ్యబట్టారు. శనివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెటి ప్రజలసొమ్ముతో విమానాలు, హెలికాప్టర్లలో జగన్ తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. పోతూపోతూ మరోసారి కరెంట్ బిల్లులు పెంచి జనం నడిని విరిచారని అన్నారు. వ్యాపారులను కూడ ఇబ్బంది పెట్టారన్నారు. ప్రజల సొమ్ముతో హెలికాప్టర్లు, విమానాల్లో తిరుగుతూ ప్రజలను అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని జగన్‌రెరడ్డి అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. జగన్‌రెడ్డి అరాచక పాలనకు ముగింపు పడిందన్నారు. వైఎస్సార్సీ నేతలుచేసిన తప్పులు వారి కళ్ల ముందు కన్పిస్తున్నాయని అన్నారు. వైఎస్సార్సీ నేతల గుండెలు లబ్‌డబ్ అని కొట్టుకుంటున్నాయని అన్నారు. భవిష్యత్ ఏంటో తెలియక దేవాదాయ శాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి గుళ్ల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన జగన్ మొట్టికాయలు వేయటంతో బూడిద రమేష్ మీడియా సమావేశం పెట్టారన్నారు. చంద్రబాబు నాయుడు పర్యటన వివరాలు బయట పెట్టాలంటా? లోకేష్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలంటా? నీవెవరు జోగి రమేష్? నీకేంటి సంబందం అని ప్రశ్నించారు.. టిడిపి అధినేత చంద్రబాబు, లోకేష్ గురించి మాట్లాడే ముందు మీ నాయకుడు పాస్‌పోర్టులుఎక్కడ ఉన్నాయో చూసుకోండి అని అన్నారు.

# భక్తజనసంద్రంగా తిరుమల

## - సర్వదర్శనానికి 30గంటలుపైగానే

**తిరుమల,జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగింపుకు వస్తుండటం... వారాంతం ,వరుససెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. శనివారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టు మెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడు కిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలా తోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 30గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఈ రద్దీ ఇలాగే జూన్ 15వరకు కొనసాగుతుందని టిటిడి వర్గాల అంచనా శనివారం సాయంత్రానికి 52వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా మరో 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రివరకు 67,873వందిమంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు.


OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT1)
3nd Floor, Triveni Complex Abids, Hyderabad 500001

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/9/2021 24-05-2024

IDBI BANK LIMITED
Versus
SMT ANANTHA LAKSHMI SATYAVATHI

To
(CD 1) SMT ANANTHA LAKSHMI SATYAVATHI, W Om Venu Aged About 34 Year Ro H No 4 272 2, Kamanagaruvu, Amalapuram East Godavari District 533213, Hyderabad,-
(CD 2) SRI MUPPIDI VENU, Som Veeraswamy Aged About 30 years r oh no 4 272 Kamanagaruvu, Amalapuram East Godavari District 533213
(CD 3) SRI MOGALAPU VENKATA RAMANNA CHOWDARY, So M Venkata Rao, Chowdary Aged Aobut 45 Years Ro H No 29 22 18 Ward No 27 Bank Colony Tanuku, West Godavari District

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 1) in OA/921/2015 an amount of Rs 18525236.00 ( Rupees One Crore Eighty Five Lakhs Twenty Five Thousands Two Hundred Thirty Six Only) along with pendentellite and future interest @ 13.75 % Simple Interest Yearly w.e.f. 11/08/2015 till realization and costs of Rs 200000 (Rupees Two Lakh Only) has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 28-06-2024 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid, you will also be liable to pay:
(a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.
Given under my hand and the seal of the Tribunal, on this date 24-05-2024
Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT1)

# రైతన్నకు విత్తన కష్టాలు

విత్తనాల కొరత రైతును కలవర పెడుతోంది. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రాష్ట్రంలో విత్తన కొరత మొదలైంది. జీలుగ, జనుము, పిల్లపెసర తదితర పచ్చి రొట్టతో పాటు, పత్తి విత్తనాల కొరత కూడాఉంది. వివిధ ప్రాంతాల్లో వ్యాపారులు విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. సాధారణ ధరలకు పత్తివిత్తనాలు లభించేపరిస్థితి లేకుండాపోయింది. విత్తనాలకోసం షాపులకు వెళితే తాము కోరుకున్న కంపెనీలవి కావాలంటే అధిక ధరలు పెట్టాల్సి వస్తోంది. రైతులు గతంలో తాము సాగుచేసిన కంపెనీల విత్తనాలే అడుగుతున్నారు. ఇతర కంపెనీలవి కొనేందుకు మొగ్గు చూపడం లేదు. ప్రయోగాలు చేసే ఓపికలేక కొన్ని కంపెనీలకు చెందిన విత్తనాల కోసమే ప్రయత్నిస్తుంటే పలువురు వ్యాపారులు వాటినే సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొన్ని జిల్లాల్లో తమకు కావాల్సిన విత్తనాలు అందుబాటులోలేకపోవడంతో సరిహద్దు జిల్లాలు, రాష్ట్రాలకువెళ్లి అవసరమైనవాటిని అధిక ధరలకు తెచ్చుకుంటున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్లా, జగిత్యాల తదితర జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రైతుల నమ్మకాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. 860 రూపాయలకు లభించే విత్తనాల ప్యాకెట్‌ను 1,600 రూపాయలకు అమ్ముతున్నారు. కొన్నిచోట్ల ఈ ధర వివిధ కంపెనీలవి అయితే 2వేల రూపాయల వరకూ పలుకుతోంది. రైతులు ఎక్కువ కోరే కంపెనీల విత్తనాలు తమవద్ద లేవని నోస్టాక్ బోర్డులు పెడుతున్నారు. అవే కావాలని ఒత్తిడి తెస్తే అధిక ధర అవుతుందని, వాటిని తెప్పించి ఇస్తామని పలువురు కృత్రిమ కొరతను సృష్టిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. అమాయకులైన రైతులకు ఎరవేసి నకిలీ, నాసిరకం విత్తనాలు అంటగడుతున్నాయి. రైతులను లక్కీడ్రాల పేరుతో మోసం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బుకింగ్ చేయడంతోపాటు, బహుమతులు అంటూ బురిడీ కొట్టిస్తున్నారు.

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణలో వానాకాలం సీజనుకు సంబంధించి విత్తన సమస్యలు రైతులను కలవర పెడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంటలూ కలిపి 1.34 లక్షల ఎకరాల్లో సాగవుతాయని లెక్కవేసింది. ఇందుకు అనుగుణంగా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం స్పష్టం చేసినా క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. రైతులకు అవసరమైన జీలుగ, జనుము,పత్తి తదితర విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ఆందోళనలకు దిగుతున్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట్‌లో రైతులు జీలుగ విత్తనాల కోసం క్యూలో పట్టాదారు పాస్‌పుస్తకాలు పెట్టడంతో పాటు ధర్నాకు దిగారు. పుల్కల్, చౌటకూరు మండల కేంద్రాల్లో రైతులు జీలుగ విత్తనా కోసం బారులు తీరారు. మెదక్ జిల్లా తుప్రాన్, వెల్లుదర్తి తదితర మండలాల్లోనూ రైతులు చెప్పులు క్యూలో పెట్టి నిరీక్షించారు. విత్తనాలు అందించాలని రాస్తారోకోలు చేశారు. సిద్ధిపేట్ జిల్లా మిరుదొడ్డి, దుబ్బాకలో కూడా రైతులు జీలుగ విత్తనాల కోసం క్యూ కడుతున్నారు. వ్యవసాయ అధికారులు టోకెన్లు జారీ చేయడం,విత్తనాలు అందచేయడంలో తీవ్రజాప్యం చేస్తుండడంతో రైతులు వరుసలో నిలబడలేక పట్టాదారు పాసుపుస్తకాలు, చెప్పులు క్యూలో పెట్టి గంటల తరబడి పెడుతున్నారు. సంగారెడ్డి జిల్లాకు 1981 క్వింటాళ్లు జనుము విత్తనాలు అవసరం కాగా, ఇప్పటివరకూ 1,300 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేశారు. జీలుగ విత్తనాలు 3,900క్వింటాళ్లు కావాల్సి ఉండగా, 1,800 క్వింటాళ్లను సరఫరా చేసింది. ఇంకా 2,100 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు రాలేదు. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పత్తి, పచ్చిరొట్ట విత్తనాలు సరిపడా లభ్యం కావడం లేదు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, పిల్లిపెసర, జనుము అందుబాటులో లేకపోవడంతో విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరి తమవంతు వచ్చేసరికి అవి అందుతాయో లేదా అనే రైతులు ఆందోళన చెందుతున్నారు. జగిత్యాల, మల్యాల, నూకపల్లిలో పచ్చి రొట్ట విత్తనాల కోసం రైతులు పడరాన్ని పాట్లు పడుతున్నారు. అవసరానికి సరిపడా వచ్చి రొట్ట విత్తనాలు లేకపోవడంతో అధికారులు ఒక్కో రైతుకు30 కేజీల బ్యాగ్ ఒక్కటి మాత్రమే ఇస్తున్నారు. మెదక్, కరీంనగర్, సూర్యాపేట్, కామారెడ్డి,జగిత్యాల, వరంగల్,నిర్మల్, ఖమ్మం తదితర జిల్లాల్లో మండల కేంద్రాల్లో జీలుగ, జనుము విత్తనాల కోసం రైతులు కాపలా కాస్తున్నారు. తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ సీడ్ కార్పొరేషన్ జీలుగ, జనుము విత్తనాలను సరఫరా చేస్తామని టెండర్లు తీసుకున్నారని, అయితే వాటిని సరఫరా చేయడంలో జాప్యం అవుతోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. కరీంనగర్ జిల్లాలో జీలుగ విత్తనాలు ఒక్క బ్యాగు మాత్రమే ఇస్తున్నా, ఇవి కూడా మధ్యలోనే అయిపోయి క్యూలో గండల





కొద్దీ ఉన్న రైతులు వెనక్కివెళ్లిపోవాల్సి వస్తోంది. ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం రైతులు అధిక సంఖ్యలో వస్తున్నారు.ఒక్కో రైతుకు రెండు ప్యాకెట్లు మాత్రమే ఇస్తుండటంతో గందరగోళం నెలకొంది. ఒకరినొకరు తోసుకునే పరిస్థితి వరకూ వచ్చింది. తమపై లాఠీ చార్జి చేశారని రైతులు, అవన్నీ తప్పుడు వార్తలని అధికారులు ప్రకటించారు. ఇదే జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పత్తి విత్తనాలు లేవని చెప్పడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. ఆర్‌సీహెచ్ 659రకానికి చెందిన పత్తి విత్తనాలు కావాలంటున్నా అవి లేవని నోస్టాక్ బోర్డులు పెడుతున్నారు. కొన్నిచోట్ల విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. విత్తనాలను బ్లాక్‌లో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారంటూ ఆగ్రహించిన రైతులు ఆందోళన చేశారు. మరికొన్ని జిల్లాల్లో 475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్‌ను రూ.864కుగాను వెయ్యి నుండి రూ.1,300 లకు పైబడి అవసరం, అవకాశాన్ని బట్టి అమ్ముతున్నారు. ఇదే అదనుగా కొందరు అక్రమార్జన పరులు మంచి విత్తనాల్లో నాసిరకం కలుపుతూ రైతులకు అంటగడుతున్నారు.ఇక పలు జిల్లాల్లో విత్తన ప్యాకెట్లు మూడు కొంటే చాలు ఎద్దులు జత లేదంటే నగదు, ఇంకా రకరకాల గిఫ్టు ప్యాక్‌లంటూ మభ్యపెడుతున్నారు. గతంలో కూడా కొన్ని కంపెనీలు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడం, గిఫ్టుల పేరుతో దాదాపు 5 వేల మంది రైతుల వద్ద నుండి ఒక్కొక్కరి వద్ద రూ.200 నుండి రూ.400 వరకూ లక్కీ డ్రా పేరిట వసూలు చేశారు. గిఫ్ట్ మాత్రం ఎవరికి రాలేదు సరికదా, ఇచ్చిన మిరప, పత్తి తదితర విత్తనాలు సైతం కాత, పూత లేక పెట్టుబడి సైతం నష్టపోవాల్సి వచ్చింది.ఇప్పుడు కూడా అదే విధంగా వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు విత్తనాలు, గిఫ్టల పేరుతో మళ్లీవసూలు చేస్తున్నారు. తక్కువ ధరలకు కొనుగోలు చేసి, వాటిలో నకిలీ, నాసిరకం విత్తనాలను కలిపి, బ్యాగ్‌లను మార్చి హైబ్రీడ్‌సీడ్ పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా వరికి సంబంధించి కిలో విత్తనాలు రూ.100కు కొనుగోలు చేసి నాసిరకం విత్తనాలను కలిపి వాటిని రూ.450కు అమ్ముతున్నారు. ఈ విధంగా బీపీటీ, ఆర్‌ఎస్‌ఆర్, 1001, 1010 రకాలతో పాటు, నోటిఫైడ్ వరి విత్తనాలను అమ్ముతున్నారు. అలాగే నిషేధిత బిటి 3పత్తి విత్తనాలను అంటగడుతున్నారు. మార్కెట్లో దొరక ఇబ్బందులు పడుతున్న పలువురు రైతులు ఈ కల్తీ,నాసిరకం పత్తి విత్తనాల బారిన పడుతున్నారు. కాగా సన్నరకం ధాన్యానికి రూ.500ల చొప్పున బోనస్‌ను రాష్ట్ర సర్కార్ ప్రకటించడంతో రైతాంగం దృష్టి వీటిపై పడింది. అయితే సన్నరకం వరి విత్తనాలకు ఎటువంటి ప్రోత్సాహాన్ని ఇవ్వడం లేదు. గతంలో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు క్వింటాకు రూ.1,000 మేర సబ్సిడీగా భరించగా, గత బిఆర్‌ఎస్ ప్రభుత్వందాన్ని పూర్తిగారద్దు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దీన్ని పట్టించుకోలేదు. దీంతో సన్నరకాల విత్తనాలను ప్రైవేటు సంస్థలు ఇష్టా రాజ్యాంగా ధరలను వసూలు చేస్తున్నాయి. మరోపక్క రాష్ట్రంలో ఎక్కడా పత్తి విత్తనాలకు కొరత లేదని వ్యవసాయ శాఖ స్పష్టతనిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 1.26కోట్ల పత్తివిత్తన ప్యాకెట్లకుగాను, 49.71 లక్షల ప్యాకెట్లు సరఫరా చేస్తే ఇప్పటివరకూ 9.20 లక్షల ప్యాకెట్లు విక్రయించినట్లు తెలిపింది. అలాగే 109.15 కోట్ల రూపాయల సబ్సిడీతో 1.95 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీకి ప్రతిపాదించగా, 66.81 కోట్ల రూపాయల సబ్సిడీతో 1.27 లక్షల క్వింటాళ్లు సరఫరా చేసినట్లు స్వయంగా సంబంధి మంత్రి ప్రకటించారు. ఇక స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లు అక్కడక్కడా దాడులు చేస్తూ నకిలీ, అక్రమ విత్తనాలను పట్టుకుంటున్నారు.కరీంనగర్ జిల్లా రామగుండం ప్రాంతంలో నిషేధిత నకిలీ బిటి3పత్తి విత్తనాలు 5.5 క్వింటాళ్లు పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో 260కిలోల నకిలీ పత్తి విత్తనాలు, శాలిగౌరారంలో ఒక వ్యక్తి నుండి 20కిలోలు, ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లో నకిలీవిత్తనాల తయారీ కేంద్రంపై దాడి చేసి వివిధ కంపెనీలకు చెందిన 945 పత్తి విత్తన ప్యాకెట్లతో పాటు, 50 కిలోల విడి విత్తనాలు, 330 బ్యాగుల జొన్న విత్తనాలు, వీటి తయారీకి ఉపయోగించే కలర్,కెమికల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఒక ఇంట్లో నిల్వఉంచిన 2.21 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు, మంచిర్యాల జిల్లా తాండూరు మండంలో ఒకఇంట్లో 25కిలోలు, ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో మరో గ్రామంలో 1.50లక్షల రూపాయల విలువైన 70కిలోల నకిలీపత్తి విత్తనాలు సీజ్ చేశారు. ●


# 'పల్లకీ' ఎవరిదో?

ఢిల్లీ

సుదీర్ఘంగా సాగిన ఎన్నికల ప్రచారం, ఏడు విడతలుగా సాగిన పోలింగ్ ప్రక్రియ గతవారం ముగియడంతో 18వ లోక్‌సభ ఎన్నికల తతంగం దాదాపు పూర్తయినట్లే. ఇక ఫలితాలు రావడమే తరువాయి.మరో రెండు రోజుల్లో ఆ తతంగం కూడా పూర్తయి పల్లకీ ఎక్కేదెవరో,దిగేదెవరో తేలిపోతుంది.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 17సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగినా అవన్నీ ఒక ఎత్తయితే, ఈ 18వ ఎన్నిక ఒక్కటీ మరో ఎత్తు అనేచెప్పాలి. ఎందుకంటే వరుసగా రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీయె మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకొంటుండగా, కాంగ్రెస్ నాయకత్వంలో దాదాపు 18రాజకీయ పార్టీలు ఒక్కవేదికపైకి వచ్చి ప్రత్యర్థిని బలంగా ఢీకొంటున్నాయి. గతంలో కూడా ప్రతిపక్షాలుకూటమిగా ఏర్పడి పోటీచేయడంకొన్ని సందర్భాలలో జరిగినా,ఇంతపెద్ద విపక్ష కూటమి ఏర్పాటు కాలేదు. ఈ పరిస్థితిలో మళ్లీ ఎన్డీయె ప్రభుత్వమే ఏర్పడి మోడీయే ప్రధాన మంత్రి అయితే నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని అయిన రికార్డు ఆయన సొంతమవుతుంది. ఇండియా కూటమి గట్టెక్కితే ప్రధాని ఎవరవుతారన్నది ఇంకా తేలవలసి ఉంది. ప్రజాదరణ తగినంత ఉన్నది రాహుల్‌గాంధీకే గనుక బహుశా ఆయనకే ప్రధానికాగల అవకాశాలు కూడా ఉంటాయి.అయితే ఇండియా కూటమికి విజయావకాశాలున్నాయా అన్నది సందేహమే. మొత్తం లోక్‌సభ సీట్లు 543 అయినందున సాధారణ మెజారిటీకి 272 సీట్లు రావలసి ఉంటుంది.గత రెండుఎన్నికలను చూస్తే,బిజెపి వరుసగా 282, 303స్థానాలను సాధించి కొత్త రికార్డు సృష్టించింది. అసలు బిజెపి ఏ ఎన్నికల్లోనైనా సొంతంగా మెజారిటీ స్థానాలు సాధించగలదా? అనే సందేహం అందరిలో ఉండగానే, తన సామర్థ్యాన్ని ఆపార్టీ నిరూపించుకొంది.దానికి రెండు ఎన్నికల ముందు అంటే 2004,09 ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ అధికారంలో ఉన్నా ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు 145,206 మాత్రమే.అంటే సాధారణ మెజారిటీ కూడా కాంగ్రెస్ సాధించలేకపోయింది. మిత్రపక్షాల సీట్లతో కలిసి బొటాబొటి మెజారిటీతో యుపిఎ అధికారంలోకి వచ్చింది. కానీ తరువాత

**ఎ.వి.వి ప్రసాద్**

రెండు ఎన్నికల్లోను బిజెపిస్వయంగా పూర్తిమెజారిటీతో అధికారంలోకి వచ్చింది. దానికి ఇంకా ముందు జరిగిన ఎన్నికలను ఒక్కసారి సింహావలోకనం చేస్తే ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన సాధారణ ఎన్నికల్లో అంటే 1984 పార్లమెంటు ఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ అత్యధికంగా 415స్థానాలు సాధించి అధికారంలోకి వచ్చింది. ఆ ఎన్నికల్లో వీచిన సానుభూతిపవనాలు కాంగ్రెస్‌ను శిఖరాగ్రానికి తీసుకువెళ్లాయి. అయితే



పార్లమెంటు భవనం

ఆ తరువాత జరిగిన ఎన్నికలు మళ్లీ కాంగ్రెస్‌ను అధఃపాతాళానికి నెట్టివేశాయి. ఆ తర్వాత వరుసగా 1989, 91, 96, 99, 2004, 09 ఎన్నికల్లో ఏ జాతీయపార్టీకి కూడామేజిక్‌ఫిగర్ నంబర్లు రాలేకపోయాయి.సంకీర్ణాలకు మించిన ప్రత్యామ్నాయం లేకపోయింది. ఈసారి బిజెపి కూటమికి 400సీట్లు దాటుతాయని ఆ కూటమి నేతలు అంటుండగా, అంతకాకపోయినా కనీసం 340దాకా అయినా వస్తాయనిప్రత్యర్థులేఅంచనా వేస్తున్నారు. ఆ లెక్క ప్రకారం చూసినా ఎన్డీయె కూటమికే ప్రభుత్వాకాశాలున్నాయనే విషయం స్పష్టమవుతుంది. అతిపెద్ద కూటమిగా ఏర్పడ్డారు గనుక ఇండియా కూటమికి అదనంగా మరికొన్ని సీట్లువచ్చినా, అవి 100 దాటకపోవచ్చని కూడా వారు పేర్కొంటున్నారు. విపక్షం స్కోరు ఇంతకు మించదనేవారు ఎక్కువగా ఉండడంతో, ప్రత్యామ్నాయంగా బిజెపి కూటమే మళ్లీ కనిపిస్తుంది. ఇక్కడ గమనించవలసిన మరో ముఖ్యవిషయం ఉంది.యుపిఎ పదేళ్ల పాలనలో కొన్నిలక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు వెలుగులోకివచ్చాయి. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కుంభకోణాలకు పాల్పడిన వారిని ఏమీ చేయలేని నిస్సహాయక స్థితిలోకి వెళ్లిపోయింది. దానిని బిజెపి తనకు అనుకూలంగా ఉపయోగించుకొని సొంతంగా అధిక మెజారిటీని సాధించగలిగింది.2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అనేకానేక అవినీతిఆలోచనలలో చిక్కుకొనడంతో,వాటినే తన బాణాలుగా ఉపయోగించుకొని బిజెపి గట్టెక్కింది. బిజెపికి ప్రధాన ప్రత్యర్థి అయిన కాంగ్రెస్‌కు ఇప్పుడు ఆ అవకాశం లేదు. గత పదేళ్లలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా,బిజెపి ప్రతిష్టను దిగజార్చేఎటువంటి కుంభకోణం వెలుగులోకి రాలేదు. మోడీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసే అవకాశం కాంగ్రెస్‌కు లేకపోయింది.దానితో కాంగ్రెస్‌కూటమి తన ప్రచార పంథాను మార్చుకొని 'గ్యారంటీ'లపై దృష్టిసారించింది ఇలా డబ్బు ఆశజూపి పార్టీలు ఎన్నాళ్లు అధికారంలోకి వస్తాయనేది పక్కన పెడితే, అసలు ప్రచారసరళే పూర్తిగా మారిపోయే విధంగా పార్టీలు వ్యవహరించాయనిపిస్తుంది. కాంగ్రెస్ అన్నిగ్యారంటీలు ఇస్తున్నప్పుడు తాము ఇవ్వకపోతే ఏం బాగుంటుందని బిజెపి కూడా తనకుతోచిన 'గ్యారంటీ'లను ప్రకటించేసింది.ఇలా అవినీతిపై బాణాలువేసే ప్రచారం నుంచి 'గ్యారంటీ'లు ప్రకటించే ప్రచారంగా 18వ లోక్‌సభ ప్రచారం కనిపిస్తుంది.ఈఎన్నికలలో ఇదొక ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఈ ఎన్నికలకు పోటీచేసిన అభ్యర్థులలో నేరచరితుల సంఖ్య బాగాపెరిగిపోవడం కూడా గమనించవలసిన మరోఅంశం. బరిలో నిలిచిన అభ్యర్థులలో 20 శాతం (1,643) మంది నేరచరితులే అన్నదివింటే రేపుచట్టసభల్లోకి ఎలాంటి వ్యక్తులు ప్రవేశించబోతున్నారో అర్థమవుతుంది. చట్టసభలకు లోపల,వెలుపల నేరచరితులే కనిపిస్తుంటే విలువలగురించి మాట్లాడే వారు ఇక ఎక్కడ ఉంటారనే సందేహం తలెత్తుతుంది.2019లో క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు 1500 ఉంటే అది ఇప్పుడు 1643కు పెరిగింది. ఈ ఎన్నికల్లో చెప్పుకోవలసిన మరో ముఖ్య విషయం పోలింగ్ వివిధదశల్లో హింసాత్మకఘటనలు తగ్గడం. నాలుగో విడత, ఆరోవిడతలో ఎపి, బెంగాల్, మరికొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు నమోదైనా, ఎన్నిక రద్దు లేదా వాయిదా వరకు ఏది వెళ్లకపోవడం హర్షించవలసిన అంశం. ●

# ట్రంప్ మెడకు హష్‌మనీ ఉచ్చు!

అమెరికా

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కేసులు వెంటాడుతున్నాయి. శృంగార తార స్టార్మీ డేనియల్‌తో తాను గడిపిన వైనాన్ని తాను బయటికి చెప్పకుండా ఉండేందుకుగాను తనకు 1.30 లక్షల డాలర్లు తన లాయర్ ద్వారా ముట్టచెప్పారని చెప్పిన ఉదంతం ఇప్పుడు ట్రంప్ మెడకు చుట్టుకుంది. ఈ చెల్లింపులు ప్రైవేటు వ్యక్తిగతమే అయినా ఈ మొత్తాన్ని లాయర్‌కు ఇచ్చిన ఫీజు మొత్తంగా ఆయన రికార్డుల్లో చూపించారని ప్రాసిక్యూటర్లు చేసిన ఆరోపణలను రుజువు చేయడంతో ఇప్పుడు ట్రంప్‌కు జులై 11వ తేదీ శిక్ష ఖరారు చేస్తామని న్యాయస్థానం ప్రకటించింది. రిపబ్లికన్ అభ్యర్థిగా తాను మళ్లీ బరిలో నిలుచుంటానని ప్రకటించినప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్‌ను కేసులు చుట్టుముడుతున్నాయి. గత ఎన్నికల్లో ఓటమి సమయంలో అమెరికా పార్లమెంటు భవనం క్యాపిటల్ హిల్స్‌పై దాడిని ప్రోత్సహించారన్న అభియోగాలు ఆయనపై నమోదయ్యాయి. దీనికితోడు వ్యాపార లెక్కలు తప్పుగా చూపించి పన్నులు ఎగవేతకు పాల్పడ్డారన్న కేసు మరోటి ఉంది. ఇప్పుడు ప్రత్యేకించి స్టార్మీ డేనియల్ ఆరోపణలతోపాటు వ్యాపార రికార్డులు తారుమారు చేసారన్న 34 నేరారోపణలు ఆయనపై నమోదయ్యాయి. కేవలం స్టార్మీయే కాదు మాజీ ప్లేబాయ్ మోడల్ కరేన్ మెక్‌డౌగల్‌కు కూడా ఆయన ఇలాగే సొమ్ములు చెల్లించి తన పేరు బయటపెట్టవద్దని హెచ్చరించినట్లు కూడా ప్రాసిక్యూటర్లు ఆధారాలు చూపించారు. మన హట్టన్‌లోని క్రిమినల్ కోర్టు ఆయనను 34 ఆరోపణల కింద దోషిగా గుర్తించినట్లు ప్రకటించింది అమెరికా చరిత్రలో ఒక క్రిమినల్ కేసులో దోషిగా నిలిచిన మొట్టమొదటి మాజీ అధ్యక్షుడుగా ఇప్పుడు రికార్డులకెక్కుతున్న ట్రంప్‌ను ఈ ఒక్క కేసే కాదు మరిన్ని కేసులు వెంటాడుతున్నాయి. అంతేకాకుండా దోషిగా ఒక ప్రధాన పార్టీకి చెందిన మొదటి నేతగా కూడా ట్రంప్ ఇప్పుడు నిలుస్తుండటంతో రిపబ్లికన్లకు కూడా ఈ ట్రంప్ వ్యవహారం శిరోభారంగా మారింది. ఈ ఒక్క కేసే కాకుండా రహస్య పత్రాలను వాష్‌రూమ్‌లో చించారన్న ఆరోపణలు, అఫ్ఘనిస్థాన్ నుంచి సేనల విరమణ, కాప్ ఒప్పందం నుంచి బయటికి రావడం, ఇరాన్

**గన్ని మోహన్**

అణు ఒప్పందం తప్పుకోవడం వంటి తప్పులు చేసారని ప్రత్యర్థులు ఆయనపై దారికాచి మరీ ఎన్నికల సమయంలో విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇప్పుడు ఈ స్టార్మీ కేసులో జడ్జిమెర్చాన్ నాయకత్వంలోని 12 మంది న్యాయమూర్తుల బృందం తీర్పును వెలువరించింది. శిక్షను కూడా ఖరారు చేస్తామని చెప్పడంతో ఇప్పుడు ట్రంప్ రాజకీయ భవిష్యత్తు మరోసారి అంధకారంలోకి వెళుతున్నట్లుగా ఉంది.



డొనాల్డ్‌ట్రంప్

ఈ కేసులో స్టార్మీ డేనియల్ కేవలం సాక్షిగా మాత్రమే వచ్చారు. మొత్తం 22 మంది సాక్షుల్లో హష్‌మనీ అందుకున్నట్లు చెప్పిన సాక్షి ఈ శృంగార తార. డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది మొదట్లోనే రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ అయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్‌కు ట్రంప్ గట్టిపోటీ ఇస్తారని కూడా ఆయనపై విశ్లేషణలు జోరుగా వచ్చాయి. కానీ ఈ కేసులో ట్రంప్ దోషిగా తేలిపోవడంతో పరిస్థితులు ఇప్పుడు తారుమారయ్యే ప్రమాదం ఉంది. ట్రంప్‌పై నేరం రుజువయితే ఆయనకు ఓటు వేసేదే లేదని ఎగ్జిట్‌పోల్ సర్వేలో పలువురు స్పష్టం చేసారు. ట్రంప్ మద్దతుదారుల్లో కనీసం 16 శాతం మంది ఇప్పుడు ఆయనకు వ్యతిరేకులుగా మారారు. అంతేకాకుండా ట్రంప్ అధ్యక్షుడుగా మళ్లీ ఎన్నికయ్యేందుకు యువ ఓటర్లు విముఖంగా ఉన్నారు. విస్కాన్సిన్, పెన్సిల్వేనియా వంటి ప్రధాన రాష్ట్రాల్లో ట్రంప్‌కు మద్దతిచ్చే వారిలో కొన్ని వేలమంది ఓటర్లు ఇళ్లకే పరిమితం అయ్యే ఛాన్స్ కూడా ఎక్కువగా ఉంది. కాగా ట్రంప్ వ్యవహారశైలి, పాలనా విధానంపై యువ ఓటర్లు ఆయన అధ్యక్షుడుగా ఉన్న కాలం నుంచే గుర్రుగా ఉన్నారు. శివార్లలో నివసించే విద్యార్థుల్లో మరింత ఆందోళన వ్యక్తం అవుతోంది. రిపబ్లికన్ పార్టీవైపు చూసేందుకే ఈ యువ ఓటర్లు ఆసక్తి చూపించడంలేదు. గడచిన ఎనిమిదేళ్లుగా ట్రంప్‌పై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. 2016 ఆయన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో కూడా ఆయనపై అనేక కుంభకోణాలకు సంబంధించి ఆరోపణలు వచ్చాయి.ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు జీవితాన్ని తారుమారు చేసే తీవ్రస్థాయి ఆరోపణలు వచ్చినా ట్రంప్ చెక్కు చెదరలేదనే చెప్పాలి. అధ్యక్షుడుగా రెండుసార్లు అభిశంసనలు ఎదుర్కొన్నారు. పదవి చివరి కాలంలో యుఎస్ క్యాపిటల్ భవనంపై గుంపు దాడిచేసినా కూడా రిపబ్లికన్ పార్టీ ఆయన వెన్నంటే నిలిచింది.ఈ కేసులేవీ కూడా ఆయన్ను మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించలేకపోయాయి. కేవలం హష్‌మనీ కేసులోనే దోషిగా తేలడం ఇప్పుడు ఆయన అధ్యక్ష ఎన్నికపై ప్రభావం చూపిస్తుందని చెపుతున్నారు. ఈ కేసులో ట్రంప్ అప్పీలులో విజయవంతం అయితే అధ్యక్షుడుగా ఎన్నికవడం ఖాయం. అలా కాకుండా దోషిగా తేలి జైలుకు వెళ్లాల్సి వస్తే ఆయన రాజకీయ జీవితంలో ఒక ప్రధాన మచ్చగా మిగిలిపోతుంది. కానీ ఈ కేసు అమెరికా రాజకీయ చరిత్రలో ఒక అపూర్వసంఘటనగా నమోదవుతుంది. ట్రంప్ దోషిగా తేలడం అన్న అంశంపై నిజమైన తీర్పు నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ఓటర్లు వెలువరిస్తారని, ఆయన ఓటమి పాలయితే హష్‌మనీ కేసులో దోషి అన్న అంశమే రిపబ్లికన్లు ప్రధానంగా తెరమీదికి తెస్తారు. పార్టీకి ఈ అప్రతిష్ట అంటకుండా జాగ్రత్తలు తీసుకుంటారని రిపబ్లికన్లు చెపుతున్నారు. అయితే ఒక్క 1.30 లక్షల డాలర్ల హష్‌మనీ చెల్లింపుతో ట్రంప్ రాజకీయ జీవితం హఠాత్తుగా మలుపులు తిరుగుతున్నదనే చెప్పాలి. ఈ కేసు నుంచి బయటపడి ట్రంప్ తన నిర్దోషిత్వం నిరూపించుకోలేకపోతే భవిష్యత్తులో ఇక ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసే అవకాశామే కోల్పోతారని నిస్సందేహంగా చెప్పగలం. ●

# దేశాభివృద్ధిలో ప్రజారోగ్యం కీలకపాత్ర



డి.జె.మోహనరావు

ఆరోగ్యవంతులైన ప్రజలున్న దేశాలలో అభివృద్ధి ఎక్కువగా ఉంటుంది. దేశాభివృద్ధిలో ప్రజారోగ్యం కీలక పాత్ర పోషిస్తుంది. ఆదాయ అసమానతలు, పేదరికం, విద్య, సామాజిక చైతన్యం, వైద్యుల అందుబాటు, నివసించే ప్రదేశం, భౌతిక వాతావరణం, పర్యావరణం, కాలుష్యం, సామాజిక పరిస్థితులు, ప్రకృతి విపత్తులు మొదలగు అనేకఅంశాలు ప్రజలఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం ఆరోగ్యం అంటే ఏ వ్యాధులు లేకపోవడమే కాదు. ఆరోగ్యం అనేది పూర్తి శారీరక మానసిక సామాజిక శ్రేయస్సు స్థితిని కలిగి ఉండటం. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ఆరోగ్య హక్కుకు ముప్పు పెరుగుతోంది.శిలాజఇంధనాల దహనం, వాతావరణ సంక్షోభానికి స్వచ్ఛమైన గాలిని పీల్చుకునే హక్కును దూరం చేస్తోంది. ఇండోర్, అవుట్‌డోర్ వాయు కాలుష్యం ప్రతి ఐదు సెకన్లకు ఒక ప్రాణాన్ని తీస్తోంది. ప్రపంచంలో 140 దేశాలు తమ రాజ్యాంగంలో ఆరోగ్యాన్ని మానవ హక్కుగా గుర్తించాయి. అయినా కూడా చాలా దేశాలు తమ ప్రజలు ఆరోగ్యసేవలను పొందేందుకు అర్హులని నిర్ధారించడానికి చట్టాలను ఆమోదించడం ఆచరణలో పెట్టడం లేదు. 2021లో కనీసం 4.5 బిలియన్ల మంది ప్రజలు ఆరోగ్య హక్కుకు నోచుకోవడం లేదు. నాణ్యమైన ఆరోగ్యసేవలు, సురక్షితమైన తాగునీరు, స్వచ్ఛమైన గాలి, మంచి పోషకాహారం, నాణ్యమైన నివాసం, మంచి పని పర్యావరణ పరిస్థితులు స్వేచ్ఛను పొందేహక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. మన దేశంలో రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్యహక్కు బిల్లును ఆమోదించిన తొలి రాష్ట్రంగా నిలిచింది. ఇది రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఒక్కరికీ అన్ని ప్రజారోగ్య సౌకర్యాలలో ఉచిత సేవలను పొందే హక్కును కల్పించింది. పశ్చిమబంగా ఖేత్ మజ్దూర్ సమితీ కేసులో సుప్రీంకోర్టు సంక్షేమ రాజ్యంలో ప్రజల సంక్షేమాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని ప్రజలకు తగిన వైద్యసదుపాయాలను అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంది. పర్మానంద్ కటారా వెర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ప్రతీ వైద్యుడు ప్రభుత్వ ఆస్పత్రిలో లేదా మరేదైనా ఆస్పత్రిలోనైనా బాధితుడు అమాయకుడైనా లేదా నేరస్థుడైనా ప్రాణాలను రక్షించడానికి తగిన నైపుణ్యంతో తన సేవలను విస్తరించాల్సిన వృత్తిపరమైన బాధ్యతను కలిగి ఉంటాడని తెలిపింది. మెడికల్ ప్రాక్టీషనర్‌గా తమ విధిని నిర్వహించడం బాధ్యత గల వారి విధి అని తెలిపింది. మన రాజ్యాంగంలో ఆర్టికల్ 21 జీవించే హక్కును కల్పించింది. అలాగే ఆర్టికల్స్ 38, 39, 42, 43, 47లలో రాష్ట్రాలుప్రజలకు కల్పించవలసిన ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యతలను తెలుపుతున్నాయి. భారత్‌లో దాదాపుగా 10కోట్ల మంది అంటే దేశ జనాభాలో 11.4శాతంమంది మధుమేహంతో జీవిస్తున్నారని 'లాన్సెట్'లో పబ్లిష్ చేసిన ఒక అధ్యయనం తెలిపింది. కేంద్రఆరోగ్య శాఖ నిర్వహించిన అధ్యయనం ప్రకారం దాదాపు 13.6 (15.3శాతం)కోట్ల మందికి ప్రీడయాబెటిస్ ఉంది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో మధుమేహం ఎక్కువగా ఉంది. మారుతున్న జీవనశైలి, మెరుగైన జీవన ప్రమాణాలు, నగరాలకు వలసలు, అస్తవ్యస్తమైన పనిగంటలు, కూర్చునే అలవాట్లు, ఒత్తిడి, కాలుష్యం, ఆహారపు అలవాట్లలో మార్పు, ఫాస్ట్‌ఫుడ్ సులభంగా అందుబాటులో ఉండటం వంటివి భారతదేశంలో మధుమేహం పెరగడానికి కొన్ని కారణాలు. క్షయవ్యాధి రోగుల సంఖ్య 2022లో 2.42 మిలియన్ల నుండి 2023లో 2.23 మిలియన్లకు స్వల్పంగా తగ్గింది. దేశంలో కేన్సర్ కేసులు 2023లో 1,496,972గా అంచనా వేయగా,2022లో 1,461,427 కేసులు నమోదయ్యాయి. అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం పొగాకు, మద్యం వినియోగం భారతదేశంలో కేన్సర్ రోగులు పెరగడానికి కారణం. పౌష్టికాహార లోపం మరో సవాలు. ఈ సమస్య దేశంలోని సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వ్యత్యాసాలను కలిగిస్తుంది. జాతీయ



కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఐదు సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లల్లో 35.5 శాతం మంది వయసుకు తగ్గ ఎత్తులేరు. 19.3 శాతం మంది ఎత్తుకు తగిన బరువు లేరు.32.1 శాతంమంది వారి వయసుకు తగ్గ బరువులేరు. మూడు శాతం మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. 15 నుండి 49 మధ్య వయస్సుగల వారిలో 18.7 శాతం మందిలో పోషకాహారలోపం ఉంది.రక్తహీనత కూడా ఎక్కువ మందిలో ఉంది. ప్రపంచంలో తలసరి పడకల సంఖ్య తక్కువగా ఉన్న దేశాల్లో భారతదేశం ఒకటి. ప్రతీ పదివేల జనాభాకు 15 పడకలు అందుబాటులో ఉన్నాయి. జాతీయ ఆరోగ్య విధానం 2017అనేది అన్ని రంగాల్లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వానికి మార్గదర్శకత్వం, మద్దతునిచ్చే ప్రణాళిక. ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టడం, వ్యాధులను నివారించడం, మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, సాంకేతికతను మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రజల నైపుణ్యాలను మెరుగుపరచడం వంటి అనేక పనులను చేయడం ద్వారా ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచాలని పాలసీతెలిపింది. ఇది నాణ్యతతో పాటు సరసమైన ఆరోగ్య సంరక్షణను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 2025 నాటికి కేన్సర్, హృదయ సంబంధ వ్యాధులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం, అకాల మరణాలను 25శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇండియా ఏజింగ్ రిపోర్టు 2023 ప్రకారం భారతదేశం వృద్ధాప్యజనాభా 2050నాటికి మొత్తంజనాభాలో 20.8 శాతానికి రెట్టింపు అవుతుందని అంచనా. ఈ పెరుగుతున్న వృద్ధాప్య జనాభా వయస్సు సంబంధిత ఆరోగ్య సవాళ్లలో పెరుగుదలతో కూడి ఉంటుంది. 2022 ఆర్థిక సర్వేలో ఆరోగ్య సంరక్షణపై భారతదేశం ప్రభుత్వ వ్యయం2021-22లో జిడిపిలో 2.1శాతంగా ఉంది. ఇంతకుముందు 2019-20లో 1.3శాతంగా, 2020-21లో 1.8శాతంగా ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రకారం ప్రతి వెయ్యిమంది జనాభాకు ఒక డాక్టర్ అవసరమని తెలుపగా మనదేశంలో 834 మంది జనాభాకు ఒక డాక్టర్ ఉన్నారు. జాతీయ వైద్య కమిషన్ ప్రకారం 5.65 లక్షల ఆయూష్ వైద్యులు 13.809 లక్షల అల్లోపతి వైద్యులు ఉన్నారు. అంతేకాక 34 లక్షల నర్సింగ్ సిబ్బంది, 13 లక్షల అనుబంధ ఆరోగ్యసంరక్షణ నిపుణులు ఉన్నారని తెలిపింది.ప్రపంచంలో అనారోగ్యాలతో బాధపడుతున్న వారిలో అత్యధిక సంఖ్యలో మనదేశంలోనే ఉన్నారు. ఇందులో 2019, 2021 మధ్య నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఐదవ రౌండ్ ప్రకారం 15-49 సంవత్సరాల వయస్సు గల స్త్రీలలో 6.4 శాతం, పురుషులు 4.0శాతం ఊబకాయంతో ఉన్నారు. దేశంలో కేన్సర్ కేసుల సంఖ్య 2022లో 14.6లక్షల నుంచి 2025 నాటికి 15.7లక్షలకు పెరుగుతుందని అంచనా. భారతదేశంలో ప్రస్తుతం దాదాపు 80 మిలియన్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. 2045నాటికి ఈ సంఖ్య 135 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. హృదయ సంబంధ వ్యాధులు మనదేశంలో ప్రధాన ఆరోగ్య సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గుండెపోటు కారణంగా సంభవించే 17.9మిలియన్ల మరణాలలో ఐదవ వంతు భారతదేశంలోనే సంభవిస్తున్నాయి. అదనంగా రక్తపోటు, అవయవాల జబ్బులు మొదలైనవి అదనం. ఒత్తిడితో కూడిన జీవనశైలి పెద్ద కారణం. క్రమరహిత ఆహారపు అలవాట్లతో మాంసాహారం, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకుంటున్నారు. రాత్రులు ఆలస్యంగా నిద్రపోతున్నారు.కనీసం వ్యాయామం చేయడం లేదు. ఒకే దగ్గర కూర్చొని పనిచేసే ఉద్యోగాలు చేస్తున్నారు. యువతలో నిత్యం పొగాకు, మద్యం సేవించే వారి సంఖ్య పెరుగుతూ ఉంది. వీటి వినియోగం వలన ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు పాడైపోతున్నాయి.వివిధ కేన్సర్లు రావడానికి ఎక్కువ అవకాశంఉంది. నిర్మాణ కార్యకలాపాలు పెరుగుదల, ఎక్కువవుతున్న కర్మాగారాలు, వాహనాల సంఖ్య పెరగడం వలన గాలి కాలుష్యం అవుతుంది. దీనివలన ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ వ్యాధులు పెరుగుతన్నాయి. నీటి కాలుష్యం వలన పొట్టకు సంబంధించిన వ్యాధులు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు వాటి పరిధిలో ఆరోగ్య సమస్యలు తగ్గించడానికి బాగానే కృషి చేస్తున్నాయి.మారుమూల ప్రాంతాలకు ప్రత్యేక సేవలను అందించడానికి భారతీయ అంతరిక్ష పరిశోధాన సంస్థ (ఇస్రో) టెలిమెడిసిన్ ప్రాజెక్టును ప్రారంభించింది. ●

# ఎగ్జిట్ పోల్స్ చర్చల్లో పాల్గొంటాం

## భేటీ అనంతరం ఇండియా కూటమి నేతల నిర్ణయం, కౌంటింగ్ కేంద్రాల్లో జాగ్రత్తలపై చర్చలు



**న్యూఢిల్లీ, జూన్ 1:** ఎన్నికలనంతరం పోలింగ్ సరళిని సమీక్షించుకునేందుకు ఇండియా కూటమి నేతలందరూ సమావేశం అయ్యారు. ఇద్దరు ముగ్గురుమినహా కూటమి నేతలందరూ ఈ సమావేశంలో పాల్గొని కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎక్కువ చర్చించారు. ఓట్లలెక్కింపులో పార్టీపరంగా ఏర్పాట్లు ఫారమ్ 17సి, ఈవిఎంల పరంగా కూటమి పార్టీలనాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, శక్తివంచలేకుండా మనం పోరాడామనిప్రజలు మద్దతిచ్చారనే ధీమాతో ఉన్నట్లు నేతలు పలువురు పేర్కొన్నారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే నివాసంలోజ రిగిన ఈ భేటీలో అస్వస్థతకు గురయినప్పటికీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ హాజరయ్యారు. రాహుల్, ప్రియాంకలు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో కూటమి నేతలు ఒకరిద్దరుమినహా అందరూ హాజరయ్యారు. శక్తివంచనలేకుండా పోరాటం చేసామని, ప్రజలు మాకు మద్దతిచ్చారనే భావిస్తున్నట్లుఖర్గే పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో తమ కూటమికి 295కిపైగా సీట్లు వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తచేస్తూ సమావేశం తర్వాత సోషల్‌మీడియాలో ట్వీట్‌చేసారు. అలాగే కూటమిపై అనవసర ఊహాగానాలకు తావు లేకుండా ఎగ్జిట్‌పోల్స్‌పై జరిగే చర్చల్లోకూడా పాల్గొనాలని కూటమి భేటీలో నిర్ణయించారు. తమ ప్రత్యర్థులు అనవసరంగా కించపరిచే వ్యాఖ్యలకు తావీయకూడదన్న లక్ష్యంతోనే కూటమి నేతలు భాగస్వామ్య పార్టీలు కూడి ఎగ్జిట్‌పోల్ చర్చల్లో పాల్గొనాలని నిర్ణయించారు. సమావేశానికి కాంగ్రెస్ కార్యదర్శి కెసివేణు గోపాల్, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్; ఎస్పీ అధినేత అఖిలేష్‌యాదవ్, ఆర్జేడి అధినేత తేజస్వియాదవ్, అనిల్‌దేశాయ్, సిపిఎంనుంచి సీతారామ్ ఏచూరి, ఆప్ ఢిల్లీ సిఎం అరవింద్‌కేజ్రీవాల్,పంజాబ్‌సీఎం భగవంత్‌మాన్, సంజయ్‌సింగ్; రాఘవ్‌చడ్డా, కల్పానాసోరెన్; చంపై సోరెన్, టిఆర్‌బాలు, ఫరూక్ అబ్దుల్లా, డి.రాజా, ముకేష్ సహాని తదితరులు పాల్గొన్నారు. చివరిదశ ఎన్నికలు ఉన్నందున తాను హాజరుకావడంలేదని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సమాచారం ఇచ్చారు. అలాగే తమిళనాడు సీఎం డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్‌కూడా ముందుగా ఏర్పాటయిన కార్యక్రమాల కారణంగా రాలేకపోతున్నట్లు తెలిపారు. పార్టీనాయకులు టిఆర్‌బాలు వచ్చారు. వ్యక్తిగత కారణాలపై పిడిపి చీఫ్ మెహబూబా ముఫ్తీకూడా ఈ భేటీలో పాల్గొనలేదు.



## భారీగా డ్రగ్స్ పట్టివేత

**గాంధీనగర్, జూన్ 1:** గుజరాత్ రాష్ట్రంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. అహ్మదాబాద్‌లో విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి సుమారు రూ.కోటికి పైగా విలువైన డ్రగ్స్ కస్టమ్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ తోపాటు కస్టమ్స్,ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో అమెరికా, కెనడా, థాయ్‌లాండ్ నుంచి వచ్చిన వారివద్ద నుంచి 1.15కోట్ల విలువైన హైబ్రిడ్, సింథటిక్ గంజాయి పొట్లాలను అధికారులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని చిన్నారుల ఆట బొమ్మలు, చాక్లెట్లు, లంచ్‌బాక్స్‌లు, క్యాండీ విటమిన్‌లలో దాచి అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన ఓ విదేశీయుడిని అదుపులోకి తీసున్నట్లు అధికారులు వెల్లడించారు.

## రెండు బస్సులు ఢీ: ముగ్గురు మృతి, 40 మందికి గాయాలు



**మోదాసా(గుజరాత్), జూన్ 1:** ప్రభుత్వ రవాణా సర్వీసుల్లోని బస్సు ఒకటి మోటారుబైక్‌ను ఢీకొని తర్వాత వెంటనే మరో ప్రైవేటు బస్సుకు ఢీకొనడంతో కనీసంముగ్గురుచనిపోగా మరో 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గుజరాత్‌లోని ఆర్వాల్లి జిల్లాలో శనివారం ఈప్రమాదం జరిగింది. శనివారం ఉదయం 11 గంటలకు సకారియా గ్రామం వద్ద రాష్ట్ర హైవేపై ఈప్రమాదం జరిగింది. ట్రాన్స్‌పోర్టుబస్సు ముందుగా ఒక మోటార్ బైక్‌ను ఢీకొట్టింది. బస్సు డ్రైవర్‌కు స్టీరింగ్ కంట్రోలు తప్పిందని అందుకే ఈప్రమాదం జరిగిందని చెపుతున్నారు. దీనితో బస్సు రోడ్డుమీద ఉన్న డివైడర్‌ను ఢీకొని అటుగా వస్తున్న లగ్జరీ బస్సును ఢీకొట్టింది. వదోదర నుంచి సాల్వీకి ప్రయాణీకులతో వెళుతున్న బస్సు ఒడిశాలోని పూరి జగన్నాథుని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో శాల్వీకి వెళుతోంది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులుచనిపోగా 40 మందికిపైగాప్రయాణీకులు గాయాలపాలయ్యారని ఎస్‌ఐ అజయ్‌సింగ్ రాథోడ్ చెప్పారు. మోటారు బైక్‌పైవస్తున్న ఇద్దరు బస్సులో ఒక ప్రయాణీకుడు చనిపోయారు. రెండు బస్సులనుంచి గాయాలపాలయిన వారిని సమీపంలో ఉన్న హిమత్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. సబర్‌కాంతజిల్లాలోని ఇతర ఆసుపత్రులకు కూడా క్షతగాత్రులను తరలించారు. ప్రస్తుతం మోదాసాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మరికొంత మందికి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాథోడ్ తెలిపారు.

## నేడు మళ్లీ జైలుకు కేజ్రీవాల్, బెయిల్‌పై 5న కోర్టు నిర్ణయం



**న్యూఢిల్లీ, జూన్1:** మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో బెయిల్ విషయంలో ఆప్ అధినేత, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట దక్కలేదు. ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు జూన్ 5న నిర్ణయం తీసుకోనుంది. ఆ రోజు తీర్పు వెలువరించనుంది. దీంతో కేజ్రీవాల్ రేపు జైలు అధికారుల ముందు లొంగిపోవాల్సి ఉంది. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించింది. నేటితో ఆ బెయిల్ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలోనే బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్‌ను మరో ఏడు రోజులపాటు పొడిగించాలని కేజ్రీవాల్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. దానిపై ఈ రోజు విచారణ జరిగింది. విచారణ సమయంలో కేజ్రీవాల్‌కు ఇడి బెయిల్ వ్యతిరేకించింది. ఆయన వాస్తవాలను తొక్కిపెట్టి, తన ఆరోగ్యంతో సహా పలు విషయాల్లో తప్పుడు ప్రకటనలు చేశారని దర్యాప్తు సంస్థలు తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఆరోగ్య కారణాలతో బెయిల్ ఇవ్వాలని సిఎం తరఫు న్యాయవాది కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును జూన్ 5కు వాయిదా వేసింది.

## సల్మాన్‌పై లారెన్స్ బిష్ణోయ్ ట్రిగ్గర్.. పాక్ నుంచి ఎకె 47 తుపాకులు!



**ముంబయి, జూన్1:** ఈ యేడాది ఏప్రిల్‌లో బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్‌ఖాన్ ఇంటి వద్ద కాల్పుల ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇది ట్రైలర్ మాత్రమే. ముందుంది అసలు సినిమా అంటూ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌సోదరుడు అన్మోల్ పోస్టు పెట్టాడు. తాజా పరిణామాలు చూస్తుంటే ఆ వార్నింగ్ నిజమేననిపిస్తోంది. గత కొంతకాలంగా సల్మాన్‌ను టార్గెట్ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్ పక్కా ప్లాన్‌తో నటుడి హత్యకు కుట్రలు పన్నుతున్నట్లు తెలిసింది. ఇందుకోసం పాక్ నుంచి ఆయుధాలను తెప్పిందించింది కూడా. మరోవైపు అతడి కదలికలను ఎప్పటికప్పుడు చేరవేసేందుకు 15, 20 మంది నిత్యం రెక్కీ నిర్వహిస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. బాంద్రాలో నటుడి ఇంటి వద్ద కాల్పుల కేసులో దర్యాప్తు చేపట్టిన ముంబయి పోలీసులకు మరో హత్య కుట్ర గురించి తెలిసింది. సల్మాన్ కారుపై ఎకె47 తుపాకులతో దాడి చేసేందుకు బిష్ణోయ్‌గ్యాంగ్ ప్లాన్ చేసినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఇందుకోసం ఈ గ్యాంగ్ పాకిస్తాన్‌కు చెందిన ఓ ఆయుధాల సప్లయిర్ నుంచి తుపాకులు కొనుగోలు చేసినట్లు పోలీస్ వర్గాల సమాచారం. ఎకె 47, ఎం16,ఎకె 92 తుపాకులు, హై కాలిబర్ ఆయుధాలను తెప్పించినట్లు తెలుస్తోంది. వీటితో సల్మాన్‌ఖాన్ కారును చుట్టుముట్టి కాల్పులు జరపడం లేదా పన్వేల్‌లోని ఆయన ఫామ్‌హౌస్‌లోకి దూసుకెళ్లి భీభత్సం సృష్టించాలని నిందితులు పథకం రచించినట్లు సదరు వర్గాలు పేర్కొన్నారు. ఈ కుట్రకు సంబంధించి తాజాగా బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన నలుగురు వ్యక్తులను నవీ ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అతడి సోదరుడు అన్మోల్, మరో గ్యాంగ్‌స్టర్ గోల్డీబ్రార్ సహా 17 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి పన్వేల్‌లోని నటుడి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన 15,20 మంది రెక్కీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాజస్థాన్‌లో కృష్ణజింకలను వేటాడి చంపిన కేసులో సల్మాన్‌ఖాన్ పేరు బయటకు వచ్చిన నాటి నుంచి బిష్ణోయ్ గ్యాంగ్ నటుడిని టార్గెట్ చేసింది. ఇటీవలి కాలంలో తమ ప్రణాళికలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. కెనడా కేంద్రంగా ఈ కుట్రలు జరుగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## పరువునష్టం కేసులో కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డికె శివకుమార్‌లకు బెయిల్




**బెంగళూరు, జూన్1:** ప్రజాప్రతినిధుల కోర్టులో కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం శివకుమార్‌లకు ఊరట లభించింది. బిజెపి ప్రధాన కార్యదర్శి కేశవప్రసాద్ దాఖలు చేసిన పరువు నష్టం కేసుకు సంబంధించి వీళ్లిద్దరికి ప్రత్యేక ఎంపి, ఎమ్మెల్యే కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. కాగా గత బిజెపి ప్రభుత్వం అన్ని పనుల్లో 40 శాతం కమిషన్ వసూలు చేసిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేపర్లలో ప్రకటనలు ఇచ్చింది. 40 శాతం కమిషన్ ప్రభుత్వం పేర్కొంటూ పూర్తి పేజీ ప్రకటన ప్రచురించింది. వివిధపనుల కోసం గత సర్కార్ అవినీతిరేటు కార్డులు నిర్ణయించిందంటూ ఆరోపిస్తూ పోస్టర్లను కూడా ముద్రించింది. అయితే అప్పటి ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై సహా తమ పార్టీ నేతలపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని బిజెపి ఆరోపించింది. ఈ మేరకు సిద్ధరామయ్య, శివకుమార్‌తోపాటు రాహుల్‌గాంధీలపై బిజెపి ఎమ్మెల్సీ, ప్రధాన కార్యదర్శి కేశవ్‌ప్రసాద్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. ఈ కేసుపై నేడు విచారణ సందర్భంగా సిద్ధరామయ్య, శివకుమార్ 42వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యారు. అనంతరం సిద్ధరామయ్య, శివకుమార్‌లకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

## లైంగిక దౌర్జన్యం కేసు.. పరారీలో ప్రజ్వల్ రేవణ్ణ తల్లి!



**బెంగళూరు, జూన్1:** దేశవ్యాప్తంగా కలకలం రేపిన హాసన అశ్లీల వీడియో, కిడ్నాప్ కేసుల్లో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. మహిళలపై లైంగిక దౌర్జన్యం, బ్లాక్‌మెయిల్ ఆరోపణలతో హాసన ఎంపి ప్రజ్వల్ రేవన్నను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో ప్రజ్వల్ తల్లి భవానీ రేవన్న పైనా ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించేందుకు పోలీసులు ఇంటికి వెళ్లగా ఆమె అందుబాటులో లేరు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. రేవన్న ఇంటి పనిమనిషి కిడ్నాప్ ఘటనలో భర్త రేవన్నతో పాటు భవానీకి కూడా సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించేందుకు సిట్ అధికారులు ఆమెకు నోటీసులు పంపారు. శనివారం ఇంటికి వచ్చి ప్రశ్నిస్తామని అందులో పేర్కొన్నారు. నేడు ఆమెను అరెస్టు చేసే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపించాయి. ఈ క్రమంలోనే నేటి ఉదయం సిట్ అధికారులు హొళెనరసి పురలోని ఆమె నివాసానికి వెళ్లగా భవానీ అక్కడ కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో ఆమె ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం తిరస్కరించింది. కర్ణాటక హాసనలో లోక్‌సభ ఎన్నికలు జరిగిన మరుసటి రోజే ఈ అశ్లీల వీడియోల వ్యవహారం బయటికొచ్చింది. అప్పటికే ప్రజ్వల్ రేవన్న విదేశాలకు వెళ్లిపోయారు. ఆయన తండ్రి రేవన్నపైనా ఆరోపణలు రావడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ వివాదం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపడంతో ప్రజ్వల్ లొంగిపోవాలని ఆయన తాత, మాజీ ప్రధాని దేవెగౌడ సహా కుటుంబసభ్యులు హెచ్చరించారు. ఈ క్రమంలోనే బెంగుళూరు చేరిన హాసన ఎంపిని అధికారులు ఎయిర్‌పోర్టులోనే అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా ఈ నెల 6 వరకు సిట్ కస్టడీకి అప్పగించారు.

## పిఒకె విదేశీ భూభాగం.. హైకోర్టులో అంగీకరించిన పాకిస్థాన్ ప్రభుత్వం




**న్యూఢిల్లీ /ఇస్లామాబాద్, జూన్ 1:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) విదేశీ భూభాగమని పాకిస్థాన్ అంగీకరించింది. ఆ దేశంలోని హైకోర్టుకు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. పిఒకెకు చెందిన కవి, జర్నలిస్ట్ అహ్మద్ ఫర్హాద్ షా కిడ్నాప్ కేసులో కోర్టుకు ఈ మేరకు తెలిపింది. అహ్మద్ ఫర్హాద్ షా పలు నిరసనల్లో పాల్గొన్నారు. పిఒకెపై పాకిస్థాన్ ప్రభుత్వం పెత్తనం, ఆ దేశ ఆర్మీ మోహరింపునకు వ్యతిరేకంగా పలు ఉద్యమాల్లో ఆయన గళమెత్తారు. ఈ నేపథ్యంలో ఆయనపై కేసులు కావడంతో మే 15న ఇంటి ధీర్కోట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ తన భర్తను కిడ్నాప్ చేసిందని అహ్మద్ హర్హాద్ షా భార్య ఆరోపించారు. ఇస్లామాబాద్ హైకోర్టును ఆమె ఆశ్రయించారు. దీంతో ఫర్హాద్‌షాను కోర్టులో ప్రవేశపెట్టాలని న్యాయమూర్తి మోహ్సిన్ అక్తర్ కయానీ ఆదేశించారు. మరోవైపు పాకిస్థాన్ అదనపు అటార్నీ జనరల్ శుక్రవారం ప్రభుత్వం తరఫున కోర్టులో వాదించారు. పిఒకెలోని పోలీసు కస్టడీలో ఫర్హాద్ ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. సొంత రాజ్యాంగం, సొంత కోర్టులున్న పిఒకె విదేశీ భూభాగమని చెప్పారు. దీనిపై పాకిస్థాన్‌కు ఎలాంటి అధికార పరిధి లేదని ఆయన అన్నారు. పిఒకెలో పాకిస్థాన్ కోర్టుల తీర్పులను విదేశీ కోర్టుల తీర్పులుగా పరిగణిస్తారని అన్నారు. ఈ నేపథ్యంలో అహ్మద్ ఫర్హాద్ షాను ఇస్లామాబాద్ హైకోర్టు ముందు హాజరుపరచలేమని కోర్టుకు వెల్లడించారు. కాగా, పాకిస్థాన్ అదనపు అటార్నీ జనరల్ వాదనలపై ఇస్లామాబాద్ హైకోర్టు న్యాయమూర్తి మోహ్సిన్ అక్తర్ కయానీ మండిపడ్డారు. పిఒకె విదేశీ భూభాగమైతే పాకిస్థాన్ సైన్యం, పాకిస్థానీ రేంజర్లు ఆ భూమిలోకి ఎలా ప్రవేశించారని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్ గూఢచార సంస్థలు పిఒకె ప్రజలను బలవంతంగా అపహరించే పద్ధతిని కొనసాగిస్తున్నాయని న్యాయమూర్తి కయానీ విమర్శించినట్లు పాక్ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. అయితే పిఒకె తమ అంతర్భాగమని ఎప్పటి నుంచో భారత్ చెబుతోంది.

# ‘పోల్’ పదనిసలు



పశ్చిమబెంగాల్‌లోని చివరి విడత పోలింగ్ సందర్భంగా సందేశ్‌ఖాళీ నార్త్ 24పరగణాస్ జిల్లాలో జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం, సౌత్ 24 పరగణాస్‌జిల్లాలోని కుల్‌తాళి వద్ద పోలింగ్ సామాగ్రిని చెరువులో వేసిన దృశ్యం

## ఓటేసిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ!



**కొల్‌కత్తా,జూన్1:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లోక్‌సభ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోల్‌కత్తాలోని ఓపోలింగ్ బూత్‌లో ఆమె ఓటు వేశారు. ఓటు వేయడానికి ముందు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్న జవానుతో మమత ముచ్చటించారు. అనంతరం పోలింగ్ బూత్‌కు వెళ్లి ఆమె ఓటువేశారు. ఆ తర్వాత బయటికి వచ్చి ప్రజలకు విక్టరీ సింబల్ చూపించారు. లోక్‌సభ ఏడవ, చివరి విడత పోలింగ్‌లో భాగంగా ఇవాళ పశ్చిమ బెంగాల్‌లోని 9లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల పలితాలు వెల్లడి కానున్నాయి.

## బిజెపికి 200 సీట్లు కూడా రావు!



**కొల్‌కతా, జూన్ 1:** ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 150 -200 సీట్లు కూడా రావని అలనాటి బాలీవుడ్ నటుడు, అసన్‌సోల్ నియోజకవర్గం తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి శత్రుఘ్నసిన్హా జోష్యం చెప్పారు. ఈసారి గెలుపు ఇండియా కూటమిదేనని ధీమా వ్యక్తం చేశారు. ఈలోక్‌సభ ఎన్నికల్లో మోడీకి న్యాయానికి మధ్యపోరు జరుగుతోందన్నారు. ప్రధాని మోడీ గడిచిన రెండు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని, కానీ వాటిలో ఏ ఒక్క హామీని కూడా నేరవేర్చలేదని శత్రుఘ్నసిన్హా విమర్శించారు. దాంతో మోడీ క్రెడిబిలిటీని కోల్పోయారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 200 కంటే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశమే లేదని వ్యాఖ్యానించారు.

## ఝార్ఖండ్‌లో 92 ఏళ్లలో తొలిసారి ఓటు వేసిన వృద్ధుడు!



**రాంచీ, జూన్1:** ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. కానీ తనకు 92 ఏళ్లు వచ్చే వరకు అసలు పోలింగ్ కేంద్రం వైపు చూడని ఓ వ్యక్తి ఎట్టకేలకు జీవితంలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనే ఝార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌కు చెందిన ఖలీల్ అన్సారీ. దృష్టిలోపంతో బాధపడుతున్న ఆయన రాజ్‌మహల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి మండ్రోలోని పదో నెంబరు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఈ యేడాది ఏప్రిల్‌లో మండ్రో పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్ర ఎన్నికల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఖలీల్ అన్సారీ తనకు ఓటు లేదని, ఇప్పటివరకు అసలు ఓటే వేయలేదని తెలిపారు. దీంతో వెంటనే ఆయన పేరును ఓటరు జాబితాలో చేర్చాలని జార్ఖండ్ ఎన్నికల ముఖ్య అధికారి రవికుమార్ ఆదేశించారు. ఈ క్రమంలోనే జిల్లా అధికారులు అన్సారీ వివరాలు నమోదు చేసుకున్నారు. మొట్టమొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది అని ఓటేసిన అనంతరం అన్సారీ తెలిపారు. ఇదిలా ఉండగా జార్ఖండ్‌లో మొత్తం 14 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. చివరిదశలో భాగంగా శనివారం మూడు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోలింగ్ కొసాగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు మూడుచోట్ల కలిపి 46.80 శాతం ఓటింగ్ నమోదైంది.

## ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్




**సిమ్లా, జూన్1:** ప్రజాస్వామ్య పండుగగా అభివర్ణించే సార్వత్రిక ఎన్నికలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరును భాగస్వామిని చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కృషి చేస్తోంది. అందుకోసం మారుమూల గ్రామాల నుంచి అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో కూడా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచుతోంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పోలింగ్ స్టేషన్ లోనూ నేడు ఓటింగ్ జరుగుతోంది. ఈ పోలింగ్ బూత్ హిమాచల్‌ప్రదేశ్‌లో ఉంది. హిమాలయ కొండల్లో సుమారు 15,256 అడుగుల ఎత్తులో ఉన్న చిన్న గ్రామం తాషిగంగ్. ఇది భారత్, చైనా వాస్తవాధీనరేఖ సమీపంలో ఉంది. ఇక్కడి పోలింగ్ స్టేషన్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైనదిగా గుర్తింపు పొందింది. మండి నియోజకవర్గం, స్పితి లోయ ప్రాంతం ప్రజలు ఇక్కడ ఓటు వేస్తున్నారు. నేటి ఉదయం హిమాలయాల్లోని ఒడిదొడుకులను దాటుకుని పోలింగ్ సిబ్బంది ఈ ప్రాంతానికి చేరుకున్నారు. పోలింగ్ బూత్‌ను అందంగా ముస్తాబుచేసి ఓటర్లకు స్వాగతం అని రాసి ఉన్న ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో నాలుగోసారి ఎన్నికలు జరుగుతున్నాయి. మండి నియోజకవర్గం నుంచి బిజెపి తరఫున బాలీవుడ్ నటి కంగనా రనౌత్, కాంగ్రెస్ నుంచి విక్రమాదిత్య సింగ్ బరిలోకి దిగిన విషయం తెలిసిందే.

## పుట్టెడు దుఃఖంలోనూ.. ‘ఓటు’ బాధ్యత మరవలేదు!



**పాట్నా, జూన్ 1:** ఇంటికి పెద్దదిక్కు కన్నుమూసినా.. ఓటు హక్కును మరువలేదు. బీహార్‌లోని ఓ కుటుంబం ఓటు బాధ్యతను నిర్వర్తించాకే అంత్యక్రియలు నిర్వహించింది. ఓటు అంటే బాధ్యత. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వర్తించాలని పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ కుటుంబం నిరూపించింది. ఇంటి పెద్ద కన్నుమూసినా.. ఓటు వేశాకే అంత్యక్రియలకు సిద్ధమైంది. బాధ్యతను మరవని ఆ కుటుంబం ఎంతోమంది ఆదర్శంగా నిలిచింది. అసలేం జరిగిందంటే. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బీహార్‌లో నేడు పోలింగ్ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే జెహనాబాద్ నియోజకవర్గంలోని దేవ్‌కురి గ్రామంలో ఓ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఒకవైపు ఎన్నికల పండగ జరుగుతుండగా మరోవైపు మిథిలేశ్ యాదవ్ తల్లి (80ఏళ్లు) ప్రాణాలు కోల్పోయింది. ఇంటి పెద్దను కోల్పోయి దుఃఖంలోఉన్న ఆ కుటుంబ తమ బాధ్యతను మరవలేదు. దీంతో కుటుంబసభ్యులంతా ఒక నిర్ణయానికి వచ్చారు. ఓటు హక్కును వినియోగించు కున్నాకే ఆమె అంత్యక్రియుల నిర్వహించాలనుకున్నారు. వారు తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో మందికి ప్రజాస్వామ్య ప్రాధాన్యాన్ని తెలియజేసిందనటంలో అతిశయోక్తి లేదు. కాగా..చివరి విడతలో భాగంగా 57లోక్‌సభ స్థానాలకు పోలింగ్ కొనసాగింది. బీహార్‌లోని ఎనిమిది స్థానాలకు శనివారం ఓటింగ్ పూర్తయింది.

2-6p6exHMNWJQE.qxd:2-6p6exHMNWJQE.qxd 1/1/02 6:09 AM Page 1




# రాష్ట్రంలో 160కిపైగా అసెంబ్లీ, 22కిపైగా పార్లమెంటు స్థానాలు గెలుచుకుంటాం

## - మాజీ మంత్రి, వైఎస్సార్సీ నేత పేర్ని నాని



**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో తమ అంచనాలకు అనుగుణంగా 160కిపైగా అసెంబ్లీ, 22కిపైగా పార్లమెంటు స్థానాలు లభిస్తాయని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) స్పష్టం చేసారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ మేజార్టీ ఎగ్జిట్ పోల్స్ తమ విజయాన్ని స్పష్టం చేసాయన్నారు. కొన్ని సంస్థల అంచనాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. తమ పార్టీ అధికారాన్ని కంపర్ట బుల్ మేజార్టీతో గెలుస్తుందన్నారు. ప్రజలు సీఎం జగన్‌ను విశ్వసించారన్నారు. అందుకే ఆయనకు తిరిగి అధికారాన్ని అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ అయిదేళ్ళ ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలు చేసారన్నారు. అందుకే జనం ఆయనకు అండగా ఉన్నారన్నారు. ఆయన కుడా పనితీరు నచ్చితేనే ఓటు వేయమని అడిగారన్నారు. ఆయన ఎక్కడా ఏ విషయంలో రాజీ పడలేదన్నారు. కచ్చితంగా సీఎం జగన్ ఈ నెల 9న రెండవ సారి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ప్రజలు కులాలు, మతాలు రెచ్చగొట్టినా తమకు అండగా నిలిచారన్నారు. చంద్రబాబు ఆరు పాయింట్లు అంటూ మేనిఫెస్టోలో ప్రకటించినా, అవన్నీ వదిలేసి చివరికి ల్యాండ్ టైటిల్ యాక్ట్ అంటూ, జగన్ అధికారంలోకి వస్తే మీ భూములు తీసుకుంటాడంటూ విప్రచారాన్ని చేసి భంగపడ్డారన్నారు. ల్యాండ్ టైటిలింగ్‌కు ఆ పార్టీ నేత పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో జై కొట్టారన్నారు. భూములు రిజిస్ట్రేషన్లు జరగని పరిస్థితి ఉంటే నందమూరు బాలకృష్ణ, పవన్ కల్యాణ్ భూములు కొన్నారన్నారు.



స్టార్టప్‌ల కోసం రూపొందించిన ఫ్లైట్ టెర్మినేషన్ సిస్టం

# 'అగ్నిబాణ్' విజయంతో స్టార్టప్‌లకు ఇస్రో సహకారం

## ఇప్పటికే వీఎస్ఎస్‌సి కేంద్రంగా పలు పరిశోధనలు

## త్వరలోనే శ్రీహరికోట నుంచి వివిధ కంపెనీల స్టార్టప్ రాకెట్ల ప్రయోగాలు

**శ్రీహరికోట (తడ), జూన్ 1 ప్రభాతవార్త:** ఇటీవల అగ్నిబాణ్ ప్రయోగం విజయవంతం కావడంతో భారత అంతరిక్ష రిశోధన సంస్థ మరిన్ని ప్రైవేట్ స్టార్టప్‌లకు సంపూర్ణ సహకారం అందిస్తోంది. అగ్నికుల్ కాస్మోస్ వారి అగ్నిబాణ్ రాకెట్‌కు ముందే స్కైరూట్ వారి విక్రమ్-ఎస్ రాకెట్‌ను కూడా ఇస్రో సహకారంతో ప్రయోగించారు. మరిన్ని స్టార్టప్‌లు ముందుకు రావడంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈ లోఎర్త్ ఆర్బిటల్ ప్రయోగాలకు ఊతమిస్తోంది. భూమికి దగ్గర ఎత్తులో ఉపగ్రహాలను ప్రవేశపెట్టడం కోసం ప్రైవేటు స్టార్టప్‌ల మినీ రాకెట్ల అవసరాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇస్టాక్, ఇస్రో సంయుక్తంగా టెలిమెట్రి అండ్ ట్రాకింగ్ సిస్టంలో కొన్ని పరిశోధనలు చేశారు. త్రివేండ్రంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో 15 నిమిషాల పాటు అగ్నిలెట్ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌కు సంబంధించిన హాట్ టెస్ట్ నిర్వహించారు. విఎస్ఎస్‌సి కేంద్రంగా ఫ్లైట్ టెర్మినేషన్ సిస్టం అభివృద్ధిపరిచే క్రమంలో మరికొన్ని పరిశోధనలు చేశారు. ఇస్రో వారు శ్రీహరికోటలో ప్రైవేటు స్టార్టప్‌కు ఏకంగా రాకెట్ ప్రయోగ వేదిక నిర్మించుకోవడం కోసం మిషన్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసుకోవడానికి సహకరించిన కారణంగా భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు మరిన్ని జరుగుతాయని, రాకెట్లు ఎక్కువ సంఖ్యలో నింగికి ఎగురుతాయని పలువురు ఆశిస్తున్నారు.

# వివాహిత అనుమానాస్పద మృతి!

## పంచనామాకోసం పూడ్చిన శవం వెలికితీత

**వరదయ్యపాలెం(నారాయణవనం), జూన్ 1 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం గోపాలపురం కాలనీకి చెందిన సుమయా(20) అనుమానస్పదంగా మృతి చెందింది. ఆమె మృతదేహానికి దహనక్రియలు చేసినప్పటికి బంధువుల అనుమానంతో పూడ్చి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు. సత్యవేడు సిఐ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్మశాన వాటికలోనే పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. ఈ సందర్భంగా సిఐ మీడియాతో మాట్లాడుతూ సుమయా మృతిపై అనుమానం రావడంతోనే శవపంచనామా చేసినట్టు చెప్పారు. శవ పంచనామాలో నిజం బయట పడుతుందన్నారు. ఆమె భర్త ఫాసిల్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఆమెకు రెండు సంవత్సరాల కుమార్తె, మరో చిన్నారి ఉన్నారు. సుమయా మృతిపై గ్రామస్తులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు. శవ పంచనామాలో వచ్చే రిపోర్టు మేరకు స్పందిస్తామని సిఐ తెలిపారు.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి భక్త జనులు

## సెలవులతో ఆలయం కిట కిట


స్వామి దర్శనం కోసం నిరీక్షిస్తున్న జనం

**శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త** వేసవి సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిట కిట లాడుతోంది. సాధారణంగానే శని, ఆది, సోమవారాల్లో ఆలయంలో రద్దీ అధికంగా ఉంటుంది. ఇక వేసవి సెలవులు కావటంతో మండుటెండలను సైతం లెక్క చేయక భక్తులు సునామిలా కదలి వచ్చారు. శనివారం ఒక్కసారిగా ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయులింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. అయితే వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఇఓ ఎస్వి నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకకుండా సుదర్శనం కోసం సిబ్బంది పరుగులు తీయించారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం అవుతుండటంతో సమీపంలోని ఆలయాల దర్శనానికి రద్దీ ఏర్పడింది. ఒక్కసారిగా జనం తండోపతండాలుగా కదలి తరంగాల్లా కదలి వచ్చారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ అధికమైంది. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం. శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు పరిసర దేవాలయాలు భక్తులతో కిట కిట లాడాయి. ఈ నేపథ్యంలో తమిళణాడు, కర్నాటకల సరిహద్దుల్లో ఉన్న 'దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్త జనంతో కిటకిట లాడింది'.

కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులు సమీపంలోని శాంతి సౌఖ్యాల్ని అందించే ముక్కంటీశుని దర్శనానికి తరలి వస్తున్నారు. తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం కావటంతో సమీపంలోని ముక్కంటీశుని దర్శనానికి విచ్చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ ధనపాల్, సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, వెంకటముని వారి సహాచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# నవగ్రహాలను మించిన శక్తిమంతుడు గురువు

## ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ

### హానుమంతుని అనుగ్రహంతో సాధించలేనిది లేదు

### కన్నుల పండువగా శ్రీహనుమజ్జయంతి ఉత్సవం


హానుమజ్జయంతి వేడుకలో ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ-వసంతలక్ష్మి దంపతులు, ఆనంద శంకర, వెంకట హార్షిత

**జగ్గయ్యపేట, జూన్ 1, ప్రభాతవార్త :** భారతీయతకు నిలువెత్తు నిదర్శనం భక్తి అవుతుందని, నవగ్రహాల ప్రభావాన్ని మంచిన శక్తివంతుడే గురువని, హనుమంతుని ఆరాధన ద్వారా సాధించలేనిది లేదని ప్రముఖ తాత్వికులు, డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత గెంటేల వెంకటరమణ ప్రవచించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామంలోని శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో శనివారం శ్రీహనుమజ్జయంతోత్సవం శోభాయమానం అయ్యింది. వెంకటరమణ-వసంతలక్ష్మి గురు దంపతుల పర్యవేక్షణలో శ్రీశివానందగురు ఎడ్యుకేషనల్-కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీహనుమజ్జయంతోత్సవం కన్నుల పండువగా జరిగింది. శాస్త్రోక్తంగా నిర్వర్తించిన శ్రీసీతారామ పట్టాభిషేక మహోత్సవాన్ని వేలాదిగా పాల్గొన్న భక్తులు తిలకించారు. శ్రీగురుధామ్‌లోని కైలాసగిరిపై ఏర్పాటుచేసిన వేదికపై వేద పండితులు పరివేష్టితులై హనుమత్ సహస్రనామార్చన, మహాపూర్ణాహుతి, మహదాశీర్వాదం, ఋత్విక్ సన్మానం కార్యక్రమాలను నేత్రపపర్వంగా నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరమణ అనుగ్రహభాషణచేస్తూ భగవంతుని దర్శనం కావాలని ప్రతిఒక్క భక్తుడు కోరుకుంటారని, అందుకు దైవం మానవరూపంలో వచ్చి కోరిక తీరుస్తారన్నారు. అయితే భగవంతుడిని గుర్తించే శక్తి సంపాదించుకోవాలని, భగవంతుడు గురువుగా వచ్చి హితబోధ చేస్తారన్నారు.



# గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల!

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 1, ప్రభాతవార్త :** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల డెల్టాల భూముల ఖరీప్ సాగుకు శనివారం నీరు విడుదల చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి మాతకు శాస్రోక్తంగా పూజలు నిర్వహించి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల చేశారు. ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీరు ఆర్. సతీష్‌కుమార్, ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖరీప్-2024 వరి సాగుకు తూర్పు, మధ్యమ, పశ్చిమ డెల్టాల మూడు ప్రధాన పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. తూర్పు డెల్టా కాల్వ ద్వారా సామర్లకోట కెనాల్‌కు అక్కడ నుండి మండపేట ప్రధాన కాల్వకు నీళ్ల విడుదల చేస్తారు. రైతులు సకాలంలో నాట్లు వేసుకుని, ముంపు బారిన పడకుండా పంటలు చేతికి అందేలా చూసుకునేందుకు ఖరీఫ్ సాగుకు సాగునీరు ముందుగానే విడుదల చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు అన్నీ అందుబాటులో ఉంచారు. మండపేట నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు వ్యవసాయ పనులకు సంసిద్ధ మౌతున్నారు. వాతావరణం అనుకూలించి నైరుతి రుతుపవనాలు వస్తే నాట్లు వేయనున్నారు. ఆకుముడిలు ఇప్పటికే కొన్ని చోట్ల సిద్ధం చేశారు. రైతులకు అవసరమైన సూచనలు వ్యవసాయశాఖ అధికారులు చేస్తున్నారు.

# సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్షలో ఆలిండియా ర్యాంక్ సాధించిన అనుమంచిపల్లి విద్యార్థి కార్తికేయ రోహన్



**జగ్గయ్యపేట, జూన్ 1, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని అనుమంచి పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి, బాలమేధావి ఆర్ కార్తికేయ రోహన్ (11) 6వ తరగతిలో ప్రవేశం కోసం జనవరి 28న నిర్వహించిన అఖిల భారత సైనిక్ స్కూలు ప్రవేశ పరీక్షల్లో 300ల మార్కులకు గాను 265 మార్కులు సాధించి ప్రతిష్టాత్మకమైన విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూల్లో సీటు సంపాదించాడు. బాలుడి తలిద ండ్రులు గాయత్రి-అనిల్ బ్యాంక్ ఉద్యోగులు. 12న స్కూలులో విద్యార్థి చేరనున్నట్లు వారు తెలిపారు.

# జయంతిపురం గ్రామంలో తెలంగాణ మద్యం సీసాలు పట్టివేత

**జగ్గయ్యపేట, జూన్ 1, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని జయంతిపురం గ్రామంలో 1572 తెలంగాణా మద్యం సీసాలు సెబ్ యంత్రాంగం సీజ్‌చేసింది. శనివారం తెల్లవారుఝామున గం.3ల సమయంలో తెలంగాణాలోని మేళ్ళచెరువు గ్రామం నుండి నందిగామ మండ లం పెద్దవరం గ్రామానికి మహీంద్ర రెనాల్డ్ వ్యాన్‌లో తరలి స్తున్న 303 లీటర్ల తెలంగాణా మద్యం సీసాలను జగ్గయ్యపేట సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టు కున్నారు. ఈనెల 4వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు నేప థ్యంలో ప్రభుత్వం మద్యం దుకా ణాలకు సెలవు ప్రకటించటంతో లాభాలు గడించాలని పెద్ద ఎత్తున మద్యం సీసాలను తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని మణికంఠరెడ్డి తెలిపారు. నిందితులు పెద్దవరం గ్రామానికి చెందిన

సింగంశెట్టి శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశామని, చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన దూలం నరేంద్రరెడ్డి ఎలియాస్ గోపిరెడ్డి పరారీలో ఉన్నాడని అన్నారు.


వ్యాన్‌లో తరలిస్తున్న మద్యాన్ని సీజ్‌చేసిన సెబ్ సిబ్బంది

# ఇంద్రకీలాద్రిలో ఘనంగా హానుమత్‌జయంతి



**ఇంద్రకీలాద్రి, జూన్ 1, ప్రభాత'వార్త' :** దుర్గమ్మ ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీమద్విరాట్ కోదండ రామాంజనేయ స్వామివార్ల దేవస్థానంలో శనివారం హనుమత్‌జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామివార్కిఇ 1100 మామిడి పండ్లతో చూత ఫల సహస్ర నామార్చన, మన్యుసూక్తాది హోమాలు నిర్వహించి అనంతరం హనుమత్‌జయంతి వేడుకలకు పూర్ణాహుతి జరిపి స్వస్తి పలికారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. అలాగే శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని క్షేత్రపాలక హనుమ ఆలయంలో హనుమత్‌జయంతిని నిర్వహించారు. పూజలనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కొలనుకొండలోని దుర్గమ్మ ఆలయానికి దత్తత దేవాలయమైన రామాలయంలో హనుమజయంతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇక పూర్ణానందంపేట ఏలూరు లాకూలు వద్ద వేంచేసియున్న శ్రీ కోదండ రామస్వామి ఆంజనేయ స్వామివార్ల దేవస్తానంలో వేడుకగా హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అర్చకస్వాములు గోపీకృష్ణమాచార్యులు, నారాయణ, బాబు లు శ్రీ స్వామివార్లకు అభిషేకం, తమలపాకు పూజలు నిర్వహించిన అనంతరం వడమాలలు, తమలపాకు దండలు, దివ్య పుష్పాలంకరణ గావించారు. పూజలు నిర్వహిస్తున్న సమయంలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తజనం హనుమాన్‌చాలీసా పఠిస్తూ శ్రీ స్వామివారి వైభవాన్ని చాటారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు వేముల హాజరత్తయ్య గుప్తా, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

**- 3న హుండీల లెక్కింపు:** దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 3న నిర్వహిస్తున్నట్లు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ కెఎస్ రామారావు తెలిపారు.

**- అలరించిన నృత్యనీరాజనం:** దుర్గమ్మను ఆరాధిస్తూ జరిగే ధర్మపథంలో భాగంగా శనివారం దుర్గమ్మ ఆలయంలో వరంగల్‌కు చెందిన నాట్యాచారిణి సిరిమల్ల చంద్రస్మిత నేతృత్వంలో శిష్యబృందం గణనాయకాయ, కులుకగనడవరే, దేవిస్తుతి, కృష్ణశబ్దం, ఒకపరి ఒకపరి వయ్యారమే, కామాక్షి స్తుతి, అఖిలాండేశ్వరి వంటి కీర్తనలకనుగుణంగా నృత్యాభినయం అందించి ఆహుతుల మన్ననలందుకున్నారు.

# అధికారం అడ్డుపెట్టుకుని పేదల భూములు కొట్టేసేందుకు కుట్ర

## - కీలకపాత్రధారిగా 'పెద్ద' సారే - మీడియా సమావేశంలో టిడిపి నేత వర్ల రామయ్య



**అమరావతి, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో దాదాపుగా రూ.2వేల కోట్లు విలువ చేసే పేదల భూములను పెద్దసారుగా చెప్పబడుతున్న సిఎస్, ఆయన కుమారుడు, వారి బినామీలు కొట్టేసేందుకు యత్నిస్తున్నారని, దాన్ని ప్రశ్నించిన జనసేన నేత మూర్తి యాదవ్‌ను బెదిరిస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు.. భూ దందా ఆరోపణలు ఎదుర్కొంటున్న జవహర్‌రెడ్డి సిఎస్‌గా కొనసాగితే, 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ సక్రమంగా జరిగే అవకాశం లేదని అన్నారు. భూ దందాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఎస్‌పై రాష్ట్రగవర్నర్ వెంటనే విచారణకు ఆదేశించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ సిఎస్ పదవి నుంచి జవహర్‌రెడ్డిని తప్పించాలని, భూ దందాపై వెంటనే సుమోటో కేసు నమోదు చేయాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

**విశాఖలో భూదందాపై ప్రశ్నల వర్షం... త్రిలోక్ అనే వ్యక్తి ఎవరు?** ఈ త్రిలోక్ అనే వ్యక్తి ఎవరు? విశాఖ కలెక్టర్ మల్లికార్జున, విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిలకు ఇతను ఎలా తెలుసు? అని వర్ల రామయ్య ప్రశ్నించారు. తెలిస్తే ఎలా తెలుసో చెప్పాలన్నారు. తెలిస్తే ఎవరు పరిచయం చేశారు? పెద్దసారేనా, వారి తనయుడా? పేదల భూములను కొట్టేయటానికి పంపారా? పేదల భూములను అప్పనంగా అతి తక్కువ ధరకే ఎలా కొట్టేశారు అని అన్నారు. అక్రమంగా పేదల భూములను ఎలా రిజిస్ట్రేషనప్ చేయించుకున్న తీరే వీర భూదందాకు ఉదాహరణ అని అన్నారు.

**సిఎస్‌పై గవర్నర్ విచారణ జరపాలి:** అధికారులపై అరోపణలు వస్తే పాలనా యంత్రాంగం , ఎసిబి ఊరుకుంటుందా? అని నిలదీశారు. వెంటనే విచారణకు ఆదేశించి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోమని చెబుతారని, ఇపుడు చేతులు అన్ని సిఎస్‌వైపు చూపిస్తున్నాయని అన్నారు. వెంటనే గవర్నర్ సిఎస్‌పై విచారణకు ఆదేశించాలని కోరారు. సిఎస్ పదవి నుంచి జవహర్‌రెడ్డిని పక్కనపెట్టాలన్నారు. భూదందాపై ఎసిబి చీఫ్ వెంటనే సుమోటో కేసు నమోదు చేయాలన్నారు. ఏసిబిలో నిజాయితీగల అధికారికి ఆ కేసును అప్పగించాలన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఎస్ అధికారంలో ఉంటే ఎన్నికల కౌంటింగ్ సక్రమంగా జరిగే అవకాశం లేదని, కౌంటింగ్‌కు సంబంధించిన ఏ ఒక్క ప్రకటన సిఎస్ చేయటానికి వీలులేకుండా చూడాలన్నారు. వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుని, సిఎస్‌ను పదవి నుంచి తొలగించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. విశాఖ భూదందాపై సిబిఐతో విచారణ చేపట్టాలి: 8 పట్టాలు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ, బిసీల భూముల దగ్గరకు వెళ్లి సిఎస్ చూసి వస్తారని, తర్వాత త్రిలోక్ ముఠా గద్దలాగా అక్కడ వాలి పేదలను భ్రమ పెట్టి భూములను కొట్టేస్తున్నారని అన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని కోరాల్సిన అధికారి ఇలా చేయటం సరైనదేనా? అని అన్నారు.

# అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లో విజయం మాదే: సజ్జల రామకృష్ణారెడ్డి



**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో అసెంబ్లీ, ఎంపీ ఫలితాలు ఒకే విధంగా ఉంటాయని ప్రభుత్వ సలహదారులు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీలో తిరిగి సీఎం జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్న తమ నమ్మకాన్ని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేసారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ అన్ని తమ పార్టీ విజయాన్ని ఖాయం చేసాయన్నారు. కొన్ని చిన్నచితక సంస్థలు కూటమికి అనుకూల రీతిలో ఇచ్చాయన్నారు. అత్యధిక సంస్థలు తమకు అనుకూలరీతిలో ఇచ్చాయన్నారు. మహిళల్లో 90శాతం వరకు తమ పార్టీకి ఓటు వేసారన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు 80శాతం వరకు వేసారన్నారు. ఇది గ్రాస్‌రూట్ స్థాయి నుంచి తాము చేసిన అంతర్గత సర్వేలో స్పష్టమైందన్నారు. సీఎం జగన్ అన్ని అంశాలను క్రోడీకరించిన తరువాతనే తాము ఎన్ని స్థానాలు గెలుస్తామో పోలింగ్ అనంతరం వెల్లడించారన్నారు. తమ పార్టీ ప్రచారం పాజిటీవ్‌గా జరిగిందన్నారు. సీఎం జగన్ నేను మీకు మంచి చేసాననుకుంటే ఓటు వేయాలని ప్రజలను అభ్యర్దించారన్నారు. ఆయన మంచి చేసారు కాబట్టే ప్రజలు అండగా నిలిచారన్నారు. సీఎం జగన్ ఎన్నికల ప్రచారాన్ని హుందాగా నిర్వహించారన్నారు. రాజకీయ ప్రత్యర్దులపై చేసిన విమర్శల్లోను ఆయన పరిధి దాటలేదన్నారు. అందుకు భిన్నంగా పవన్ కల్యాణ్, చంద్రబాబు వ్యవహరించారన్నారు. ప్రజాబలం, మన స్థయిర్యం సీఎం జగన్‌కు అండగా నిలిచాయన్నారు. ఆయన భారతంలో అర్జునుడి మాదిరిగా విజయం సాధిస్తారన్నారు. కొన్ని జాతీయ సంస్థల్లో అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఘనవిజయాన్ని చూపిస్తూ ఎంపీ స్థానాలకు క్రాస్ ఓటింగ్ జరుగుతుందని అంచనా వేసాయన్నారు. ఎంపీ స్థానాలు తాము గెలుస్తామన్నారు. కూటమికి అనుకూల రీతిలో అంచనాలు చెప్పిన సర్వే సంస్థలు కేవలం కొన్ని మీడియాలపై ఆధారపడ్డాయన్నారు.

# తెలంగాణలో రాయితీ లేని సన్నాలు.. నిలిచిన రూ.1,000 సబ్సిడీ

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** తెలంగాణలో సన్నరకం వరి ధాన్యం కొనుగోళ్లలో రూ.500ల చొప్పున బోనస్ ఇస్తామని రాష్ట్ర సర్కార్ ప్రకటిం చడంతో రైతాంగం రకం సాగుపై దృష్టి సారిం చింది. అయితే సన్న రకాల వరి సాగు భారంగా పరిణమించడంతో పాటు, ఇదే సమయంలో దొడ్డు రకాలకు పెట్టుబడి తక్కువ కావడాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆచితూచి వ్యవహరి స్తున్నారు. మరోపక్క రాష్ట్రంలో సన్న రకం వరి వంగడాల సాగుకు వ్యవసాయ శాఖ ఎటువంటి ప్రోత్సా హాన్ని ఇవ్వడం లేదు. సన్న రకాలకు విత్తన రాయితీని వర్తింప చేయక పోవడం, అధిక ధరలకు ప్రైవేటు సంస్థలు అమ్మడం, చీడ పీడలు, తెగుళ్లు అధికంగా వ్యాపించడం వంటి వాటితో రైతులు సన్నాల పట్ల అంతగా ఆసక్తి కనపరచడం లేదు.

దీనికి తగినట్లుగా గత రెండేళ్ల క్రితం సన్నరకం వరి ధాన్యం కొనుగోలు చేయడంలో పౌరసరఫరాలు, మార్కెటింగ్ అధికారులు ముప్పు తిప్పులు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించడంతో విసుగెత్తిన రైతులు సన్నాలు సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు దొడ్డు రకం వరినే సాగు అధికంగా సాగు చేస్తున్నారు.





శ్రీపవన్ ఆక్వా టెక్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను వైజాగ్ హేచరీస్ అసోసియేషన్ చైర్మన్ దాసరి శ్రీనివాస్, ట్రెజరర్ గొగుల రామారావు శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త డా.సోమనాథరావు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ నిర్మాణ సంస్థ అధినేత లక్ష్మణమూర్తి, రాజు, వ్యాపారవేత్తలు వి. దొరబాబు, బిక్కిన శ్రీనివాస్ , నాయుడుబాబు, సూర్యనారాయణ , రవికుమార్, తిమ్మాపురం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

- విశాఖపట్నం, ప్రభాతవార్త



# నగరంలో గాలివాన బీభత్సం

- సీతమ్మధారలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్.. నేలకొరిగిన చెట్లు
- భయభ్రాంతులకు గురైన జనం
- దద్దరిల్లిన ఉరుములు, మెరుపులు










8లో

# ఎగ్జిట్ పోల్స్‌పై టిడిపిలో జోష్.. వైసిపిలో ధీమా

- ఏర్పాట్లలో నిమగ్నమైన ఆయా పార్టీల నేతలు




8లో

# అట్టహాసంగా హనుమాన్ జయంతి



- నగరంలోని పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ
- స్వామి వారి దర్శనాలకు క్యూకట్టిన భక్తులు
- పలుచోట్ల ఆలయాల్లో అన్నసంతర్పణలు

9లో

# సింహాద్రినాథుని సన్నిధిలో ముత్తంశెట్టి



సింహాచలం , జూన్1 , ప్రభాతవార్త : సింహగిరిపై కొలువుతీరి ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం దర్శించుకున్నారు. తొలుత కప్పస్థంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామివారికి తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. సింహగిరికి పోటెత్తిన భక్తులు దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీవరహాలక్ష్మినృసింహస్వామివారి ఆలయానికి ఇటీవల కాలంలో భక్తుల తాకిడి గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో – మిగతా 9లో

# హనుమజ్జయంతి పూజలో శ్రీభరత్

- అన్నదానంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించిన గీతం విద్యాసంస్థల అధినేత



8లో

# పలుచోట్ల అన్నసమారాధనలు

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు హాజరు



8లో

## కౌంటింగ్ ఏర్పాట్లపై

# సమీక్ష సమావేశం

-కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ , సిపి రవిశంకర్ హాజరు



8లో

# ప్రజలు సంయమనం పాటించాలి

- అనకాపల్లి జిల్లా ఎస్పీ కెవి మురళీకృష్ణ



10లో

# డయల్ యువర్ సిపికి 17 ఫిర్యాదులు




8లో

## ఎన్నికల విధులపై ఏఆర్, ఏపీఎస్పీ

# సిబ్బందికి దిశానిర్దేశం

కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన సిపి రవిశంకర్



10లో

# కౌంటింగ్‌ను సజావుగా నిర్వహించండి

- అధికారుల సమావేశంలో అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత



8లో

# ప్రతిభ ఉన్న వారికి తగిన గుర్తింపు

సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు ముగింపులో ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి



8లో

# పలుచోట్ల అన్నసమారాధనలు

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ఉత్తర నియోజకవర్గం 50వ వార్డు మాధవధార శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన, 26వ వార్డు అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి ఇండియన్ జిమ్ వద్ద కొణతాల రేవతీ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు. కార్పొరేటర్లు వావిలాపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయస్వామిని దర్శించుకున్న శ్రీభరత్

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ఆరో వార్డు పీఎం పాలెం రెండో బస్టాప్ వద్ద గల శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయానికి గీతం విద్యా సంస్థల అధినేత, కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో స్వయంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాసరి ఆలయ ట్రస్ట్ కొప్పాక రామకృష్ణ , గారే గుర్నాథ్ , పోతన రఘు, రామకృష్ణ, సర్వదేవుళ్ల బాబ్జి, జనసేన నాయకులు ఈఎస్ఎస్ చంద్రరావు, సంతోష్‌నాయుడు, పెద్ద సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

జూన్ నాలుగో తేదీన జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో యంత్రాంగం సన్నాహక ఏర్పాట్లు శాంతిభద్రతలు, ఇతర అంశాలపై కలెక్ట్రేట్ మీటింగ్ హాలులో వివిధ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఏ. మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ, పోలీసు కమిషనర్ డాక్టర్ ఏ. రవిశంకర్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, పోలీస్ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ ఉన్న వారికి తగిన గుర్తింపు

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త



ప్రతిభ ఉన్న వారికి గుర్తింపు ఉంటుందని ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా క్రికెట్‌లో క్రమశిక్షణ ఎంతో అవసర మన్నారు. వీడీసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు ముగింపు సమావేశం శనివారం విశాఖలోని డా. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీఏ కార్యదర్శి ఎస్ ఆర్ గోపినాధ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా ప్రతిభ కలిగి గుర్తుంపులేని క్రికెటర్లకు రైజింగ్ స్టార్స్ పేరుతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇటీవల ఒక చక్కటి వేదిక కల్పించాం, దీంతో ఏసీఏ విడుదల చేసిన వేలం అర్హత జాబితాలో లేని ఆటగాళ్లకు ట్రయల్స్ నిర్వహించి ప్రతిభ చూపిన ఏడుగురికి ఏపీఎల్ -3 వేలంలో స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడి గణాంకాలతో కూడిన పూర్తి సమచారాన్ని నిక్షిప్తం చేసేందుకు వీలుగా ఈసారి సరికొత్త సాఫ్ట్ వేర్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికేట్లు కోచ్‌లకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఏసీఏ గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎం ఎస్ కుమార్ వీడీసీఏ అధ్యక్ష కార్యదర్శులు పి విష్ణుకుమార్‌రాజు పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో గాలివాన బీభత్సం

విశాఖపట్నం,జూన్1 , ప్రభాతవార్త:

నగరంలో ఉరుములు మెరుపులతో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కొన్ని ప్రాంతాలలో చెట్లు నేలకొరగగా ,మరికొన్ని ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. సీతమ్మధారలో గల ఒక బహుళ అంతస్తు ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో అక్కడ స్థానికులు పోలీసులకు, ఎలక్ట్రికల్ సిబ్బందికి సమాచారం అందించగా వారు అక్కడకి చేరుకొని ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. మరికొన్ని ప్రాంతాలలో చెట్లు నేలకొరిగాయి. ఇప్పటికే ఎలక్ట్రికల్ వైర్లకు కొమ్మలు తగలకుండా ఏపీఈపీడీసీఎల్ వారు చర్యలు తీసుకున్నారు. దీంతో ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యుత్ సంస్థ ఊపిరి పీల్చుకుంది. అయితే గత కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. తీవ్ర గాలులు, ఉరుములు కారణంగా పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేసారు. దీంతో అర్ధరాత్రి వేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే శనివారం ఉష్ణోగ్రత కొంత మేర తగ్గిందని చెప్పుకోవచ్చు.

# వరమా... శాపమా...

**రాజకీయ రణరంగంలో రాటు దేలిన రణధీరులు వాళ్ళు... పొట్టేళ్ళ మధ్య పోరులా ఎన్నికల యుద్ధంలో తలపడిన ఉద్ధండులు... దర్జాని, దర్పాన్ని పక్కన పెట్టారు... కోట్లాది రూపాయలు కుమ్మరించారు... కనపడిన ప్రతి ఒక్కరిని ప్రాధేయపడ్డారు... ఓటేసి గెలిపించాలని వేడుకున్నారు...ఐదేళ్ళ పాటు అధికార దర్పాన్ని అనుభవించే అవకాశం కోసం అర్రులు చాస్తున్నారు...ప్రస్తుతం మాత్రం గెలుపు ఓటముల పల్లకిలో ఊగిసలాడుతున్నారు... మూడు రోజుల్లో తేలనున్న ఫలితాలు వరంగా పరిణమిస్తాయా... శాపంగా నీరుగారుస్తాయా అన్న మీమాంసలో సతమతమయిపోతున్నారు...**

**కోట్లు కుమ్మరించి... కోటి ఆశల మధ్య అభ్యర్థులు**

గోపాలపట్నం, జూన్ 1, ప్రభాతవార్త




జూన్ నెల రానే వచ్చింది. రాష్ట్రవ్యా ప్తంగానే కాకుండా దేశ వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల పోరు ఫలితాలు మరో రెండు రోజుల్లో వెలువడనున్నాయి. గెలిచేది ఎవరు? ఓడేదెవ రు? ప్రజలను పాలి ంచేదెవరు? పాలకులపై విమర్శలకు పరి మితమయ్యే దెవరు? అన్నది తేలనున్న నేపథ్యంలో అభ్యర్థులు తీవ్ర ఒత్తిడితో ఆశల పల్లకిలో అటు ఇటుగా ఊగుతూ కొట్టుమిట్టాడుతున్నారు. బయటికి ధాంభికంగానే కనపడుతున్నా లోలోపల మాత్రం అంతర్మధనానికి గురవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసామే, ఫలితాలు ఎలా వుండబోతాయోనన్న ఆంధోళన కు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థుల మరింత సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతు న్నారు. రకరకాల అంచనాలు, నమోదయిన పోలింగ్ శాతం, ప్రాంతాల వారీగా పట్టు, సామాజిక వర్గాల బలాలు ఇలా అన్ని రకాలుగా పరిశీలన చేపట్టిన అభ్యర్థులు తమ అంచనాలు సరైనవేనా అని మరోమారు సరిచూసుకుంటున్నారు. రాష్ట్రం విషయానికి వస్తే టిడిపి, జనసేన, బిజెపిల కూటమికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్యే ప్రధాన పోరు నిలిచిన విషయం అందరికి తెలిసిందే. ఇటు తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు తమకు శ్రీరామరక్షగా నిలుస్తాయని వైసిపి అభ్యర్థులు భావిస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు ఉద్యోగులు, యువత ఓట్లు తమను గద్దెనెక్కించడం ఖాయమన్న ధీమాను కూటమి అభ్యర్థులు వ్యక్తపరుస్తున్నారు. ఇది ఇలా వుంటే ఎన్నికల ఫలితాల విడుదల కేవలం రెండు రోజుల వ్యవధిలోనే వుండడంతో అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్టు తెలుస్తుంది. దాదాపుగా అందరి అభ్యర్థుల ఇంటిల్లిపాది వీదిన పడి తమను ఆశీర్వదించాలని వేడుకోవడంతో పాటు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం వంటి కారణాలు ఈ తరహా ఒత్తిడికి దారితీస్తున్నట్టు వినికిడి. గతంలో ఇంటికే పరిమితమయిన ఆడవాళ్ళను సైతం రోడ్డెక్కించి తెలిసిన వారిని తెలియని వారిని కూడా ప్రాధేయపడేలా ప్రచారం చేపట్టించిన కొందరు అభ్యర్థులు మరింత అసహనానికి గురవుతున్నట్టు సమాచారం. నమ్ముకున్న వారు కొమ్ము కాసారా? లేక నట్టింట ముంచారా? అన్న మీమాంసకు గురవుతు, ఎవరిని ప్రశ్నించలేక బయటికి ధాంభికంగా కనిపిస్తున్నారు. హోరా హోరీగా జరిగిన పోరులో గెలుపు వరిస్తుందా? లేదా? అన్న అనుమానం లోలోపల వున్నప్పటికి తమ అనుయాయులతో ముందు ధైర్యాన్ని ఒలకబోస్తున్నారు. కొందరు అభ్యర్థులు యజ్ఞాలు, యాగాలు జరుపుకుంటూ దేవుడు తమను చల్లగా చూస్తాడని, గెలుపు బాట పట్టిస్తాడని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు తమ ఇష్టదైవాల దివ్యక్షేత్రాలకు వెళ్ళి దర్శనం చేసుకుని తమ కోర్కెను తీర్చాలని ఇప్పటికే వేడుకున్నారు. వీళ్ళ పిచ్చి గాని ప్రజలకు సరైన సేవలందిస్తే ఇంతగా టెన్షన్ పడాల్సిన అవసరముం టుందా, యజ్ఞాలు యాగాలు చేస్తే ఇవిఎంలలో పడిన ఓట్లు అటు ఇటుగా మారుతాయా అంటూ కొందరు ప్రజలు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే సొమ్ములు తీసుకుని ఓటును అమ్ముకున్న కొందరు ఓటర్లకు అసలు సేవలడిగే హక్కు ఎక్కడిదని, ఎద్దేవా చేసే అవకాశం లేదన్న వాదనలు కూడా వినవస్తున్నాయి. ఏది ఏమైనప్పటికి ఎన్నికల ఫలితాలు వెలువడనున్న తేదీ సమీపిస్తున్న తరుణంలో వేసవి తాపం కన్నా ఫలితాల సెగే ఎక్కువగా వుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించండి

రాజవొమ్మంగి, జూన్ 1, ప్రభాతవార్త




ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను మండల కేంద్రంలో గల భవిత పాఠశాలలో చేర్పించాలని అల్లూరి జిల్లా సహిత విద్య సమన్వయకర్త కొమ్ము భాస్కరరావు తెలియజేస్తున్నారు. రాజవొమ్మంగి ఎస్సీకాలనీలో 0.18 సం.లోపు వయస్సు ఉండి బుద్ధిమాంద్యం, ఇతర సమస్యలతో ఉన్నవారిని సర్వేలో రిసోర్స్ పర్సన్ జె.శరత్‌కుమార్, ఎస్.హారిత గుర్తించారు. ప్రభుత్వం ప్రత్యేక అవసరాల గల చిన్నారులు కోసం వైద్యంతో బాటు విద్యకు తోడ్పాటును అందిస్తుందని శరత్‌కుమార్ అన్నారు. మండ లంలో ఇప్పటికీ ఏపాఠశాలలో పేరు నమోదుకాని చిన్నారులనుభవితలో చేర్పించాలని హారిత తెలిపారు.

# కౌంటింగ్ సజావుగా సక్రమంగా నిర్వహించండి

## రిటర్నింగ్ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి -ప్రతి అంశాన్ని వీడియో తీయించండి : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత

పాడేరు,జూన్1,ప్రభాతవార్త



ఈ నెల 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, స్ట్రాంగ్ రూముల సీలు తీసిన దగ్గర నుండి ప్రతి అంశం వీడియో చిత్రీకరణ జరగాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. శనివారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ ఆయా నియోజక వర్గాలకు అందిన ఫారం 18 (కౌంటింగ్ ఏజెంట్ల నియామకం) గూర్చి ఆరా తీసారు. వారికి గుర్తింపు కార్డులను జారీ చేయాలని, ప్రతి కేటగిరీలో గుర్తుపట్టే విధంగా ప్రత్యేక డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లు ఎవ్వరికీ మొబైల్స్ గాని, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు గాని తీసుకువేల్లెందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు, అరకు పార్లమెంటుకు సంబంధించి అరకు, పాడేరు సెగ్మెంట్ల కౌంటింగ్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గం, అరకు పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించి రంపచోడవరం జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అరకులో 1,74588 మంది, పాడేరులో 1,58,757 మంది రంపచోడవరంలో 2,08,025 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. అరకులో 304, పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్, పాడేరులో 318 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్, రంపచోడవరంలో 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓట్ల లెక్కింపుకు వరసగా 20 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగినందున అరకులో 22 రౌండ్లు లెక్కింపు ఉంటుందని, పాడేరులో 23రౌండ్లు, రంపచోడవరంలో రౌండుకు 20 రౌండ్లు లెక్కింపు ఉంటుందని వివరించారు. ముందుగా పోస్టల్ బ్యాలేట్ల లెక్కింపు జరుగుతుందని అరకులో 3492, పాడేరులో 2546, రంపచోదవారంలో 4123 కలిపి మొత్తం 10,161 పోస్టల్ బ్యాలేట్లతో పాటు అప్పటివరకు అందిన సర్వీసు ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 113 మంది నుంచి సర్వీస్ ఓట్లు చేరాయన్నారు. కౌంటింగ్‌లో సమస్యలు తలెత్తడానికి గల అవకాశాలను, పరిష్కారాలను కలక్టర్ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. శుక్రవారం స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్స్ తనిఖీ చేసి సూచించిన అంశాల ప్రగతిపై సమీక్షించిన కలెక్టర్ ఆదివారం నాటికి అన్ని పనులు పూర్తీ చేసి కౌంటింగ్‌కు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి శిక్షణలు ఇవ్వడం జరిగిందని, ఆదివారం రెండవ విడత ర్యాండమైజేషణ్ ద్వారా నియోజకవర్గాన్ని కేటాయించడం జరుగుతుందని, నాల్గవ తేదీ ఉదయం ఐదు గంటలకు మూడవ ర్యాండమైజేషణ్ ద్వారా టేబుల్స్ కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ర్యాండమైజేషణ్ ద్వారా ఎంపికైన కౌంటింగ్ సిబ్బందిని అరకు, పాడేరు నుండి రంపచోడవరంకు, రంపచోడవరం నుండి పాడేరు, అరకుకు తరలించడానికి అవసరమైన బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆర్టిసి అధికారులను, కౌంటింగ్ కేంద్రాల వద్ద బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, డిపిఓను, అంబులెన్స్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను, నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ ఏర్పాటు చేయాలని ఇపిడిసిఎల్ అధికారులను, అగ్నిమాపక పరికరాలు, శకటం ఏర్పాటు చేయాలని అగ్నిమాపక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పాడేరు, అరకు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళాల్సిన సిబ్బంది, ఏజంట్లు కలుసుకునే అవకాశం లేదని ఎవరికి కేటాయించిన మార్గంలో వారు మాత్రమె వెళ్లాలని సూచించారు. పాడేరు నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళే పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజంట్లకు జూనియర్ కళాశాల మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడ నుండి వంద మీటర్ల పరిధిలో గల డిగ్రీ కళాశాల ఆర్చ్ వరకు వాహనములలో తరలిస్తామని అక్కడ నుండి సిబ్బంది, ఏజంట్లు వారికీ కేటాయించిన గ్యాంగ్ వే మార్గాల ద్వారా ప్రవేశించాలని తెలిపారు. అదేవిధంగా అరకు కౌంటింగ్ కేంద్రానికి ఎంపిడిఓ కార్యాలయం దగ్గరలో గల టిటిడి కళ్యాణ మండపంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజంట్లకు పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడ నుండి వంద మీటర్ల పరిధిలో కౌంటింగ్ కేంద్రము ఉన్నందున అక్కడ నుండి సిబ్బంది, ఏజంట్లు వారికీ కేటాయించిన గ్యాంగ్ వే మార్గాల ద్వారా ప్రవేశించాలని తెలిపారు. మూడంచెల భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని, వంద మీటర్ల ఫరిధిలో గుర్తింపు కార్డు తనిఖీ చేసి మాత్రమె కౌంటింగ్ కేంద్రానికి పంపించడం జరుగుతుందని, రెండవ దశలో గ్యాంగ్ వేలకు పంపించే ముందు మెటల్ డిటెక్టర్ తనిఖీ ఉంటుందని, ఎటువంటి ఎలక్ట్రానిక్ డివైజ్లు, మొబైల్స్ అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మూడవదశలో సిఆర్పిఎఫ్ భద్రత ఉంటుందని తెలిపారు. పాడేరు, అరకు రిటర్నింగ్ ఆహికారులు జేసి భావన వశిస్ట్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, వి.చైతన్య, డి.ఆర్.ఓ బి.పద్మావతి, అదనపు ఎస్పీ ధీరజ్, జిల్లా అధికారులు, రంపచోడవరం నుండి వర్చువల్ విధానంలో రిటర్నింగ్ అధికారి సబ్ కలక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, ఆయా నియోజక వర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# 83 వాహనాలను సీజ్ చేసిన అనకాపల్లి జిల్లా పోలీసులు

అనకాపల్లి, జూన్ 1, ప్రభాతవార్త



కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా శనివారం అనకాపల్లి జిల్లా పోలీసులు 83 వాహనాలను సీజ్ చేశారు. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు చోడవరం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సైలు శేఖరం, సూర్యనారాయణ మరియు అనకాపల్లి సబ్ డివిజన్ పోలీస్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా చోడవరంలోని ఐటిఐ కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, 1 ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అలాగే యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గఫూర్ ఆధ్వర్యంలో యలమంచిలి రూరల్ ఎస్సై సింహాచలం సర్కిల్ పోలీస్ సిబ్బందితో యలమంచిలి మండలం, పెద్దపల్లి గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సరైన ధృవీకరణ పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు సంబంధిత గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట భద్రత చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు, అనుమానస్పద వ్యక్తుల కదలికలు గుర్తించేందుకు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను పరి శీలించి, పత్రాలు సక్రమంగా ఉన్న వాహనాలను రిలీజ్ చేస్తామని, రికార్డులు సక్రమంగా లేని వాహ నాలను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. అనుమానస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు ఎస్పీ ఆదేశాలతో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టామన్నారు. ప్రజలు ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనరాదని అధికారులు హెచ్చరించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లలో అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ సబ్ డివిజన్ పోలీస్‌అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మనాభం మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం


భీమునిపట్నం, జూన్1,ప్రభాతవార్త

ఈ నెల 3న సోమవరం ఉదయం 8గం. నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11కెవి సబ్‌స్టేషన్ పద్మనాభంకి సంబందించిన 11కేవీ రేవడిఫీడర్ లైన్ వర్క్స్ నిర్వహణ, చెట్ల నరికివేత, లైన్ మరమ్మత్తుల పనిని చేపట్టాలని ప్రతిపాదించుటచే, 33/11కెవి సబ్‌స్టేషన్ రేవిడి మెయింటెనెన్స్ వర్క్ కరణంగా మండలంలో ఉన్న రేవిడి, రౌతలపాలెం, వెంకటపురం, బర్లపాట, పాండ్రంగి, కొండ బర్లపాట, కూరపల్లి, మొదలైన ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం జరుగును. కావున వినియోగదారులు అందరూ గమనించి సహకారం అందించగలరని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు, ఆపరేషన్ జోన్–3 విశాఖ తెలిపారు.

# విజయ పదములో దూసుకు పోతున్న పద్మనాభం మహిళా చేయూత మార్ట్

## ప్రారంభించిన 3 నెలలలోనే ఒక కోటి రూపాయలు దాటిన వ్యాపారం -రాష్ట్రంలో వ్యాపార అభివృద్ధిలో 4వ స్థానం -సొంత భవనమును కలిగి ఉన్న పద్మనాభం మహిళా మార్ట్ -ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతున్న పద్మనాభం మహిళా మార్ట్

భీమునిపట్నం, జూన్1, ప్రభాతవార్త



పద్మనాభం మండలంలో డ్వాక్రా సభ్యులు మంచి ఆశయంతో 14900 మంది సభ్యుల భాగస్వాముతో సొంత భవనంలో 2024 జనవరి 28న మహిళా మార్ట్ ప్రారంభోత్సవం చేయడమైనది గడిచిన మూడు నెలలలో కోటి రూపాయల వ్యాపారం చేసి అన్నింటిలో మేముంటామని నిరూపించారు సుమారుగా 20 లక్షల మూలధన పెట్టుబడితో ప్రారంభించారు. సంఘ సభ్యులు నుండే కమిటీగా ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ సహకారముతో హల్‌పి అండ్ జిఐటిసి మెట్రో వాల్ వంటి సంస్థలతో అనుసంధాన మై వారి వద్ద నుండి నాణ్యమైన బ్రాండెడ్ సరుకులను తీసుకువచ్చి సంఘ సభ్యులకు బయట మార్కెట్ కంటే అతి తక్కువ ధరకు అమ్మకం జరుగుతుంది ఈ మహిళా మార్ట్, ముఖ్య ఉద్దేశ్యము నాణ్యమైన సరుకులను అందజేయుట తక్కువ ధరకు అందజేయుట సభ్యులు తయారు చేసే వస్తువులకు మార్కెట్ కల్పించుట లాభాలను పంచుట ఇందులో పనిచేసే సిబ్బందిని వారే నియమించుకొని ఎప్పటికప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి సభ్యులకు కావలసిన సరుకులను అందుబాటులో ఉంచుట జరుగుతుంది ఎటువంటి లాభా పేక్ష లేకుండా ఇటువంటి మార్టులను నిర్వహించారు. ఒక కోటి రూపాయలు వ్యాపారమును చేరుకున్నందుకు డిఆర్డిఏ పథక సంచాలకులు శోభారాణి మార్ట్ కమిటీని సిబ్బందిని అభినందిస్తు రాష్ట్రంలో పద్మనాభ మార్ట్ నాలుగో స్థానంలో ఉందని సొంత భవనంలో మార్పు నిర్వహణ పద్మనాభం మండలం, ఆనందపురం మండలంలో ఉందని తెలియజేశారు ఏటీఎం ప్రభాకర్ మాట్లాడుతూ మూడు నెలలలో కోటి రూపాయల వ్యాపారాన్ని అంది పుచ్చుకోవడమ నేది గొప్ప విషయమని నాణ్యమైన సరుకులు అతి తక్కువ ధరకే సభ్యులందరికీ అందించుట వలన ఈ మార్కును చేరుకోగలిగామని భవిష్యత్తులో అందరి సలహాలు సూచనలు తీసుకొని మరింత ముందుకు వెళుతుందని తెలిపారు.

# కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు : పోలీస్ కమిషనర్ రవిశంకర్

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

సార్వత్రిక ఎన్నికలలో తుదిఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రకియ ఈ నెల 4వ తేదీన ఆంధ్రా యూనివర్శిటీలో జరగనుందని, ఈ కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు భద్రతా ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎ.మల్లికార్జునతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కౌంటింగ్ కోసం కూడా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేశామన్నారు. ఏ.యులో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేయాలని, బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా బందోబస్తు నిర్వహించాలని అన్నారు. కౌంటింగ్ కోసం భద్రత, బ్యారికేడింగ్ ఏర్పాట్లు ముందుగానే పరిశీలించుకొని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రిటర్నింగ్ అధికారులు డి.హుస్సేన్ సాహెబ్, డి.అఖిల ఎస్.భాస్కర్ రెడ్డి, టి.సీతారామమూర్తి, డి.లక్ష్మారెడ్డి, పి.శేషశైలజ, ఏపీఎస్పి, సిఆర్పిఎఫ్, ఏడీసీపీలు, ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ పోలీస్ కమిషనర్‌కు 17 ఫిర్యాదులు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖ నగర పోలీస్ కమిషనర్ డా.ఏ.రవిశంకర్ ఆదేశాల మేరకు జాయింట్ సీపీ ఫకీరప్ప డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల 1, 15వ తేదీల్లో ఉదయం 11గం.ల నుండి 12గం.ల వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫకీరప్ప 0891-2523408 నంబరులో అందుబాటులో ఉండి 17 మంది కాలర్స్‌తో ఫోన్ మాట్లాడి, తమ సమస్యలను తెలుసుకొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలకు చట్టపరమైన చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాధులలో భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోయిన వారు, నగర ట్రాఫిక్ సమస్యలు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. అనంతరం వృద్ధుల ఫిర్యాదుల కోసం అదనంగా 30నిముషాలు కేటాయించారు. గాజువాకకి చెందిన 60 ఏళ్ళ వృద్ధుడు తన కుమారుడు కోడలు ఆస్తుల కొరకు తనని చంపటానికి ప్రయత్నిస్తున్నారని చాల ఇబ్బంది పెడుతున్నారని న్యాయం చెయ్యమని ఫిర్యాదు చేశారు. ఆరిలోవకి చెందిన 75ఏళ్ళ వృద్ధుడు తన సోదరుడు తను కలిసి ఇళ్లస్థలం కొనుక్కొని సరిసమానంగా తీసుకున్నాక ఇద్దరికి మధ్య గోడ కట్టుకోవటం జరిగింది సోదరుడు వేరొకరికి అమ్మటం జరిగింది. వాళ్ళు ఇప్పుడు నా స్థలం వద్దకు వచ్చి ఇబ్బంది పెడుతున్నారని న్యాయం చెయ్యమని ఫిర్యాదు చేశారు. మురళీనగర్‌కి చెందిన 85 ఏళ్ళ వృద్ధురాలు తన స్థలంలో ఇల్లు కట్టుకుంటున్నారు. వేరొకరు వచ్చి కట్టకుండా చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని న్యాయం చెయ్యమని ఫిర్యాదు చేశారు. పీఎం పాలెంకి చెందిన 69 ఏళ్ళ వృద్ధుడు తనకి ప్రాణహాని ఉందని నేరుగా కలవటానికి అవకాశం కల్పించాలని అడిగారు. దువ్వాడకి చెందిన 72 ఏళ్ళ వృద్ధుడు తన భార్య అనారోగ్యంతో మరణించారు. వాళ్ళ బంధువులు వచ్చి నన్ను ఇబ్బంది పెడుతున్నారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. త్రీ టౌన్‌కి చెందిన 77 ఏళ్ళ వృద్ధుడు తను పెట్టిన కేసులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఎంవీపీకి చెందిన 65 ఏళ్ళ వృద్ధురాలు తన ఇంటిలో అద్దెకు ఉంటున్న వ్యక్తి అద్దె ఇవ్వకుండా ఇల్లు కాళీ చెయ్యకుండా ఇబ్బంది పెడుతున్నారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అన్ని కాల్స్ నూ పూర్తిగా పరిశీలించి వాటిని నిర్ణీత కాలంలో పరిష్కరించే దిశగా తగు ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జి–సెక్షన్ సూపరింటెండెంట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎగ్జిట్ పోల్స్‌తో కూటమిలో జోష్

## వైసీపీలో కూడా ధీమా

**బి.వెంకటేష్ , అనకాపల్లి**

ఎదురు చూస్తున్న ఎగ్జిట్ ఫోల్స్ అంచనాలు వచ్చేసాయి. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు టీవీలకు అతుక్కుపోయారు. ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ ఉన్నపుడు ఎటువంటి ఉత్కంఠ కనిపించిందో అటువంటి వాతావరణం మళ్ళీ శనివారం కనిపించింది. ఏం ఇద్దరు మాట్లాడుకున్నా ఎగ్జిట్ ఫోల్ అంచనాల గురించే మాట్లాడుకోవడం కనిపించింది. ఇక ఎగ్జిట్ ఫోల్స్‌ను పరిశీలిస్తే మెజారిటీ శాతం సర్వే సంస్థలు కూటమి అధికారంలోకి రానుందని తేల్చేసాయి. మంచి పేరున్న జాతీయ సంస్థలు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని అంచనాలు వేయగా లోకల్ సంస్థలు కొన్ని వైసీపీ అధికారంలోకి వస్తుందని తేల్చాయి. వివిధ సర్వే సంస్థలు వెలువరించిన ఫలితాల అంచనా ఈ విధంగా ఉంది.

### లోక్ సభ నియోజకవర్గాలు...

ఎగ్జిట్ ఫోల్స్ అంచనాలు, జాతీయ, లోకల్ సంస్థలు ప్రకటించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సీ మెక్ సంస్థ కూటమికి 21 నుంచి 23, వైసీపీకి 2 నుంచి 4 సీట్లు వస్తాయని అంచనా వేసింది. అలాగే టుడే చాణక్య కూటమికి 22 నుంచి 25, వైసీపీకి 3 స్థానాలు వస్తాయని తెలిపింది. ఏబీపీసీ ఓటర్ టీడీపీకి 22 నుంచి 25, వైసీపీకి 4 స్థానాలు వస్తాయని తెలిపింది. అలాగే కేకే సర్వే అయితే ఏకంగా కూటమికి 25 సీట్లు గెలుచుకుంటుందని ప్రకటించి సంచలనం సృష్టించింది. పీపుల్ సర్వే కూటమికి 17 నుంచి 19, వైసీపీకి 3 నుంచి 5 సీట్లు వస్తాయని తెలిపింది. అలాగే ప్రముఖ చాణక్య సంస్థ అయితే కూటమికి 17 నుంచి 18, వైసీపీకి 6 నుంచి 7 సీట్లు వస్తాయని తెలిపింది. సాన్ సర్వే సంస్థ కూటమికి 19, వైసీపీకి 6, ఎన్ఎఫ్ఓపీఎల్ సంస్థ కూటమికి 15 నుంచి 18, వైసీపీ 7 నుంచి 10 స్థానాలు గెలుచుకుంటుందని తెలిపింది. అలాగే ప్రముఖ జాతీయ సర్వే సంస్థలైన పయనీర్ కూటమికి 20, వైసీపీ 5 సీట్లు గెలుచుకుంటుందని చెప్పగా ఇండియా టీవీ కూటమికి 19 నుంచి 22, వైసీపీ 3 నుంచి 5 గెలుచుకుంటుందని తెలిపింది. అలాగే సీఎన్ఎక్స్ కూటమికి 17 నుంచి 23, వైసీపీ 3 నుంచి 5 సీట్లు గెలుచుకుంటుందని తెలిపాయి. న్యూస్ 18 సంస్థ కూటమికి 19 నుంచి 22, వైసీపీ 5 నుంచి 8 సీట్లు వస్తాయని తెలిపింది. అలాగే ఇండియా న్యూస్ కూటమికి 18, వైసీపీ 7, న్యూస్ ఎక్స్ సంస్థ కూటమికి 22, వైసీపీ 3, ఎన్డీటీవీ కూటమికి 18, వైసీపీ 7 స్థానాలు గెలుచుకుంటాయని అంచనా వేసాయి.

### ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నియోజకవర్గాలు...

రాష్ట్రవ్యాప్తంగా అధిక శాతం సర్వేలు కూటమిదే అధికారం అని తేల్చేసాయి. సీ మెక్ సంస్థ కూటమికి 135 నుంచి 145 సీట్లు, పీపుల్స్ ఫల్స్ కూటమికి 111 నుంచి 135, వైసీపీ 45 నుంచి 60 స్థానాలు గెలుచుకుంటాయని తెలిపింది. కెకె సర్వే సంస్థ కూటమికి 161, వైసీపీ 14 స్థానాలు, ఎస్ జీఈడీ సంస్థ కూటమికి 139, వైసీపీకి 36 స్థానాలు వస్తాయని తెలిపింది. అలాగే జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన చాణక్య మాత్రం కూటమికి 114 నుంచి 125 సీట్లు వస్తాయని తెలిపింది. అలాగే సాన్ సంస్థ కూటమికి 127, వైసీపీకి 48, ఎన్ఎఫ్ఓ. సర్వే కూటమికి 104 నుంచి 110 సీట్లు వస్తాయని తెలిపింది. ప్రముఖ పయనీర్ సంస్థ కూడా కూటమికి 144, వైసీపీ 31 సీట్లకు పరిమితమౌతుందని తెలిపింది. రైజ్ సర్వే కూటమికి 113 నుంచి 122, వైసీపీకి 48 నుంచి 60, ఫల్స్ టుడే సర్వే కూటమికి 120 నుంచి 129, వైసీపీ 45 నుంచి 55, జనగళం సర్వే కూటమికి 104 నుంచి 108, వైసీపీ 44 నుంచి 57 సీట్లు వస్తాయని తెలిపింది. అయితే పార్థ దాస్ సర్వే సంస్థ మాత్రం కూటమికి 55 నుంచి 65, వైసీపీకి 110 నుంచి 120 సీట్లు గెలుచుకుంటుందని ప్రకటించి సంచలనం సృష్టించడం విశేషం.

# ఘనంగా అన్నసమారాధన


గాజువాక, జూన్ 1, ప్రభాతవార్త



హనుమంత్ జయంతి సందర్భంగా పెదగంట్యాడ మండలంలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ట్రస్ట్ చైర్మన్, జనసేన నాయకులు తిప్పల వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ హనుమాన్ భగవాన్‌కి నిర్వహించిన ప్రత్యేక పూజలలో తిప్పల వెంకట రమణారెడ్డి అన్నపూర్ణ దంపతులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితుల సమక్షంలో ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిప్పల రమణా రెడ్డి పాల్గొని ప్రతీ ఏడాది హనుమంత్ జయంతిని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఆంజనేయ స్వామిని ఆరాధిస్తే కోరిన కొర్కెలు తీరుతాయానేది భక్తులకు విశ్వాసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 31ద్విచక్ర వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

యలమంచిలి, జూన్ 1 ప్రభాతవార్త



యలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని పెద్దపల్లిలోని కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సుమారు 31ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి నట్లు పోలీసులు తెలియజేశారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పరవాడ డి.ఎస్.పి యలమంచిలి సిఐ గఫూర్ ఆధ్వర్యంలో ఎస్సైలు పాపి నాయుడు, రూరల్ ఎస్సై సింహాచలం, ట్రాఫిక్ ఎస్సై, సర్కిల్ పరిధిలో గల పోలీస్ సిబ్బందితో సంయుక్తంగా పెద్దపల్లి గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 31ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ అధికారులు సంబంధిత గ్రామాలలో ప్రజలతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెడవరినున్న సందర్భముగా గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులు కదలికలు గుర్తించేందుకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రికార్డుల సక్రమంగా లేని వాహనాలను పరిశీలించి పత్రాలు సక్రమంగా ఉన్న వాహనాలను రిలీజ్ చేస్తామని రికార్డులు సక్రమంగా లేని వాహనాలు సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఉచిత ఆన్లైన్ కోచింగ్ ముగింపు సమావేశం

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త




డాక్టర్ వి ఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో గత నెల మే 1వ తారీఖు నుంచి మే 31వరకు 30రోజు లపాటు ఏ పి పి జి సి ఈ టీ ప్రవేశపరీక్ష కొరకు డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఉచిత ఆన్లైన్ శిక్షణ తరగతులు నిర్వహించారు ఈశిక్షణ ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ విజయబాబు మాట్లాడుతూ ఈ శిక్షన కార్యక్రమంలో శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అనేమంది విద్యార్థులు ఈ శిక్షణా తరగతులలో పాల్గొని లబ్ది పొందారని చెప్పారు. రిజోర్స్ పర్సన్స్‌గా రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించి విద్యార్థులకు అనేక విషయాలపై బోధనా తరగతులు నిర్వహించారని చెప్పారు. కీకార్యక్రమానికి సమన్వయకర్తగా డా. పి పద్మప్రియ వ్యవహరించారు ఐక్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ కె రవిబాబు ఆంగ్ల విభాగ అధిపతి డా. ఆర్ రాణి మాట్లాడుతూ ఈకార్యక్రమం విద్యార్థులకు చాలా ఉపయోగమైందని అన్నారు. ఈకార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఎస్ వి రామారావు, డాక్టర్ సి వి ఎస్ రవీంద్రనాథ్, కటి రామకృష్ణ, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి ఉమామహేశ్వరరావు ఇతర జిల్లాల నుంచి అనేకమంది ఆంగ్ల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాలాది విజయకు మాతృవియోగం



విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

ప్రముఖ తెలుగు రచయిత కీర్తిశేషులు జాలాది రాజారావు సతీమణి, సమాజ్వాద్ పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి జాలాది విజయ తల్లి జాలాది ఆగ్నేశమ్మ శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె విశాఖలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం సుమారు 3గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. జాలాదిగా పేరుగాంచిన జాలాది రాజారావు 275సినిమాల్లో 1500కు పైగా పాటలను రచించారు. సినీ గేయ రచయితగా ఆయన ప్రయాణంలో జాలాది ఆగ్నేశమ్మ ప్రముఖ పాత్ర పోసించారు. ఆమె మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు రాజకీయ నాయకులు అభిమానులు సంతాపం తెలియజేశారు.

## ఘనంగా హనుమజ్జయంతి

సింహాచలం, జూన్ 1, ప్రభాతవార్త :



సింహాచలం మెట్ల మార్గంలో ఉన్న ఆంజనేయ స్వామివారి ఆలయంలో ఆంజనేయ స్వామి గుడిలోను శనివారంతో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. మెట్ల మార్గంలో ఉన్న ఆలయ పరిసరప్రాంతాలలో పుష్పాలతో భక్తులు అలంకరించారు. స్వామివారికి ఆకుపూజ, సింధూరపూజ, ప్రత్యేక అభిషేకములు హోమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. తరువాత ఆలయ అర్చక స్వాములు మాట్లాడుతూ చైత్రశుద్ధ పౌర్ణమి నాడు జరుపుకునే హనుమజ్జయంతి రోజున జిల్లేడు వత్తులు, నువ్వుల నూనెతో ఆంజనేయ స్వామికి దీపమెలిగిస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయి అన్నారు. హనుమజ్జయంతి రోజు సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో హనుమాన్‌ను ఆలయంలో దర్శించుకొని, ఎర్రటి ప్రమిదల్లో జిల్లేడు వత్తులు, నువ్వులనూనెతో దీపమెలిగించే వారికి ఆయుర్దాయం, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పురోహితులు అన్నారు. ఇంకా హనుమంతుని ఆలయాల్లో ఆకుపూజ చేయించడం, హనుమత్కళ్యాణం జరిపే వారికి ఈతిభాదలు తొలగిపోతాయని విశ్వాసం. అలాగే గృహంలో పూజ చేసే భక్తులు, పూజా మందిరమును శుభ్రం చేసుకొని పసుపు, కుంకుమలు, పుష్పాలతో అలంకరించుకోవాలి. ఎర్రటి అంక్షతలు, ఎర్రటి పువ్వులను పూజకు సిద్ధం చేసుకోవాలి. పూజకు పంచముఖాంజనేయ ప్రతిమను లేదా ఫోటోను ఎర్రటి సింధూరం, ఎర్రటి పువ్వులతో అలంకరించుకోవాలి. నైవేద్యానికి బూరెలు, అప్పాలు, దానిమ్మ పండ్లు సమర్పించుకోవచ్చు. పూజా సమయంలో హనుమాన్ చాలీసా ఆంజనేయ సహస్రనామ, హనుమత్పుర్రిత వంటి స్తోత్రాలతో మారుతిని స్తుతించుకోవాలి. లేదా " ఓం ఆంజనేయాయ నమః " అనే మంత్రాన్ని 108 సార్లు జపించి, ఐదు జిల్లేడు వత్తులను నువ్వుల నూనెతో తడిపిన పంచహారతిని స్వామివారికి అర్పించాలి అని అర్చక స్వాములు అన్నారు. పూజ పూర్తయిన తర్వాత ఆంజనేయ ఆలయాలను సందర్శించుకోవడం మంచిది. ఇంకా అరగొండ, పొన్నూరు, కసాపురం, గండిక్షేత్రం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకునే వారికి కోటి జన్మల పుణ్యఫలం సిద్దిస్తుందని విశ్వాసం. ఇదే రోజున హనుమాన్ ధ్యానశ్లోకాలు, హనుమాన్‌చాలీసా పుస్తకాల దానం చేసేవారికి సుఖసంతోషాలు చేకూరుతాయని నమ్మకం అర్చక స్వాములు తెలిపారు.

## క్యాన్సర్ పేషెంట్‌కు ఆర్థిక సహాయం

ఆనందపురం, జూన్ 1, ప్రభాతవార్త




క్యాన్సర్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి జై జవాన్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందిజేసింది. విజయనగరం జిల్లా సవరవల్లి గ్రామానికి చెందిన బాలిక బోయిన సాయిగణేష్ (5) కు ఏడాది క్రితం క్యాన్సర్ సోకిందని దీంతో సాయి గణేష్ కుటుంబం పేదరికంలో ఉండడంతో ఆతనికి చికిత్స చేయించడం కుటుంబానికి తలకి మించిన భారంగా మారింది ఈ మేరకు విషయాన్ని తెలుసుకున్న ఆనందపురంలో ఉన్న జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి స్నేహితులు బంధువులు ఇతరుల వద్ద రూ. 28వేలు విరాళాలుగా సేకరించి సాయి గణేష్ తల్లిదండ్రులు రాంబాబు, సన్యాసమ్మలకు అందజేశారు. అలాగే ఆనందపురం జడ్పీ హైస్కూల్ 2007వ తరగతి బ్యాచ్ తరఫున కోటేశ్వరరావు అనే వ్యక్తి రూ.5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుప్ప రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ముదునల శ్రీను, కార్యదర్శి ముదునల కార్తీక్, కోశాధికారి కుప్ప రాములప్పడు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకలు



విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

నగర మెయిన్ రోడ్డు పూర్ణామార్కెట్ దరి శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీస్వామివారికి విశేష పూజలు ఉదయం 5.30ని నుంచి పంచామృతాభిషేకం, సింధూరార్చన, తమల పాకులతో సహస్రనామార్చన అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఉచిత ప్రసాద మజ్జిగ వితరణ జరిగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం కూడా అత్యంత వైభవంగా జరిగిందని దేవాలయం కార్యనిర్వాహణాధికారి అల్లు జగన్నాధరావు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

ఆనందపురం, జూన్ 1, ప్రభాతవార్త



మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి నీ భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయాలలో భక్తులతో కిట కిటలాయి మండలంలోని పెద్దిపాలెం లోడగలవానిపాలెం కుసులువాడ, సొంత్యాం గుడిలోవ ఆనందపురం, నెర్లెల తదితర గ్రామాలలో ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత అభిషేకాలు, సింధూర కుంకుమార్చనలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. నిమ్మకాయలు, తమల పాకుల దండలతో అలకరించారు. ఈసందర్భంగా భక్తు లకు ప్రసాద వితరణ చేశారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించాలి



జగదాంబ, జూన్ 1, ప్రభాతవార్త

ప్రముఖ ఎముకల వైద్య నిపుణుడు పత్రి శివానంద కెజిహెచ్ సూపరింటెడెంట్‌గా నియమితులైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొ రేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వె స్లీ కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్టర్ పత్రిశివా నందకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. డాక్టర్ శివానంద్ సేవలు కెజిహెచ్ అభివృద్ధికి తోడ్పడాలని, అంతేకాకుండా విశాఖ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

## పలు ఆలయాలు సందర్శించిన ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు

విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త



నగరంలో శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా విశాఖ ఉత్తర నియోజకకవర్గంలో పలు ఆలయాలు సందర్శించి స్వామివారిని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజు దర్శించు కున్నారు. 14వ వార్డు సీతమ్మధార శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయం, 49వ వార్డు ఎన్‌జిజీఓఎస్ కోలని శ్రీ వైభవ వెంకటేశ్వ రస్వామి ఆలయంలో, 49వ వార్డు పిఆర్ గార్డెన్స్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో, 54వ వార్డు మర్రిపాలెం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, 45వ వార్డు తాటిచెట్ల పాలెం శ్రీ ఆభయస్వామి ఆలయంకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శిం చుకున్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పార్టీ మండల అధ్యక్షులు అల్లు శంకరరావు, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, ఆళ్ల నరసింగరావు హరిపట్నాయక్, ఆదిరెడ్డి శ్రీను, సందరం జ్ఞానేశ్ మల్లిక్, చంద్ర మౌళి, కనకరాజు, దుర్గ సన్నీ గణపతి, నాయుడు, వెంకటరావు, శంకర్, ఆలయ కమిటీ పెద్దలు తదితరు లు పాల్గొన్నారు.

## శ్రీరామ నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం

జగదాంబ, జూన్ 1, ప్రభాతవార్త




జాతీయ రహదారి సూర్యనగర్‌లో శ్రీయోగ సిద్దాంజనేయస్వా మివారి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా శ్రీపాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో సాంప్రదాయ రీతిలో నిర్వహించిన హను మజ్జయంతి ఉత్సవాలు శ్రీసీతారామ కళ్యాణంతో ఘనంగా ముగి సాయి. ఆలయ ప్రాంగణంలో వేంచేసిఉన్న శ్రీయోగ సిద్దాంజ నేస్వామి ప్రత్యేక అలంకరణలో తన్మయ మారుతీగా దర్శనమి చ్చారు. శ్రీసీతారామ ఆచార్య స్వామి వారి మంగళసశా సనంతో ఆలయ అర్చకులు భక్తుల సమక్షంలో వేడుకగా శ్రీసీతారాముల కళ్యాణోత్సవం తిలకించిన భక్తులు ఆధ్యాత్మిక అనుభూతికిలోన య్యారు. శేషాచార్య స్వామి వారు శ్రీసీతారామ కళ్యాణోత్సవానికి చేసిన వ్యాఖ్యానం ప్రత్యేకతను సంతరించుకుంది. కళ్యాణోత్సవంలో ఉభయ దేవరుల తరుపున భక్తులందరి తరుపున ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బ రాజు యశోద దం పతులు ఆలయ కమిటీ సభ్యులు ప్రాతినిధ్యం వహించారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసా దాలు అందచేసారు. 12వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు దంపతులు ఆలయ కమిటి సభ్యులు, స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తజనవాహిని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.

## సింహగిరికాలనీలో ఘనంగా హనుమాన్ జయంతి



ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త

స్థానిక 12వ వార్డు పరిధిలోగల పెదగదిలి గ్రామం సింహగిరికాలనీలో శనివారం శ్రీ అభయ అంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మనోహార్‌శర్మ వేదమంత్రాలతో స్వామి వారికి పంచామృత అభిషేకము, అలంకారము, సహస్రనామార్చన, తమలపాకులపూజ, సింధూర అర్చన, అష్టోత్రము ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునుండే భక్తులు, స్థానికులు పరిసర ప్రాంత వాసులు పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు సీరం ఈశ్వరరావు, అధ ్యక్షులు అనుగపల్లి ఎర్రయ్య, కార్యదర్శి అనుగపల్లి ఈశ్వరరావు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆనంద మార్గ ఆశ్రమంలో చిన్నారులకు అల్పాహారం ఏర్పాటు

ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త



స్థానిక 10వ వార్డు పరిధిలోగల ఇందిరాగాంధీనగర్‌లో ఉన్న ఆనంద మార్గ ఆశ్రమంలో అనకాపల్లి పార్లమెంట్ మాజీ సభ్యులు, విశాఖ నగర మాజీ మేయర్ సబ్బంహారి 72వ జయంతి సందర్భంగా శనివారం ఆశ్రమం ఉన్న చిన్నారులకు కాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అల్పాహాం ఏర్పాటు చేశారు. అనంతరం సబ్బంహారి సేవలను వార్డు ఇంచార్జు మద్దిల రాజశేఖర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దొంక రామదీపక్, సింగంశెట్టి రామకృష్ణ, శ్రీనివాస్, సూరల చిన్ని, బర్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

## సెంటర్ జైల్‌ఖైదీలకు అందుబాటులో హెల్త్ ఎటిఎం మెషిన్ సేవలు

ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త




విశాఖ కేంద్ర కారాగారంలో ప్రణామ్స్ మరియు జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీస్ వారిచే తయారు చేయబడిన డిజిటల్ హెల్త్ ఎటిఎం మెషిన్‌ను సింబయాసిస్ టెక్నాలజీస్ డైరెక్టర్ నరేష్‌కుమార్, జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీస్ సి.ఈ.ఓ డాక్టర్ వినోద్ కుమార్, విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ మధుసుదన్ విరాళాలతో ఖైదీల ఆరోగ్య పరీక్షల కోసం హెల్త్ ఎటిఎం మెషిన్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఐ. శ్రీనివాసరావు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ హెల్త్ ఎటిఎం ద్వారా 75 హెల్త్ చెక్ అప్ ఫలితాలను 2 నుండి 3 నిమిషాలలో పూర్తి ఖచ్చితత్వంతో తెలుసుకోవచ్చు అని తెలియజేశారు. ఈ డిజిటల్ హెల్త్ ఎటిఎం మెషిన్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్, అధనపు పర్యవేక్షణాధికారి ఎమ్. వెంకటేశ్వరులు, జైలు అధికారులు, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రినాథుని సన్నిధిలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు

7వ పేజీ తరువాయి..

శనివారం చందనోత్సవాన్ని మైమరిపించే విధంగా భక్తులు సింహగిరికి తరలి వచ్చి స్వామివారికి దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించగా పలు విభాగాలు ద్వారా పెద్ద మెత్తంలో ఆదాయం చేకూరుంది. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజి సభ్యులు గంట్ల.శ్రీనుబాబు దంపతులు శనివారం సింహాద్రినాథుని దర్శించుకోని స్వామి,అమ్మవారు సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సింగపూర్ నుంచి బయలుదేరిన ఐఎన్ఎస్ శివాలిక్



విశాఖపట్నం,జూన్1 ప్రభాతవార్త....

ఐఎన్ఎస్ శివాలిక్, దక్షిణచైనా సముద్రం, పసిఫిక్ మహాసముద్రంలో మోహరించిన మిషన్ సింగపూర్ నుండి జపాన్‌లోని యోకోసుకాకు వెళ్లడానికి శనివారం బయలుదేరింది. ఈ విస్తరణలో జెఎమ్ఎస్‌డీఎఫ్, యూఎస్ నావికాదళం, రిమ్‌పిక్ 24లో పాల్గొనే ఇతర భాగాస్వమ్య నౌకదళాలతో పరస్పర చర్య స్థాయిని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. సింగపూర్‌లో షిప్‌పర్యటన సందర్భంగా బేస్ కమాండర్‌తో కాల్ చేయడం చాంగి నావల్ బేస్, క్రాంజీవార్ మెమోరియల్‌లో పుష్పగుచ్ఛం ఉంచడం ,సింగపూర్‌కు భారత హైకమిషనర్‌తో కాల్‌చేయడం, ఐఎఫ్‌సి సందర్శన బోర్డులో ఉన్న 80మంది పాఠశాలవిద్యార్థుల సందర్శన వంటి వివిధ కార్యకలాపాలు చేపట్టారు. యుఎస్ఎస్ మొబైల్ (ఎల్‌సిఎస్)కి భారతీయ ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ఆన్‌బోర్డు సందర్శన క్రాస్-డెక్ సందర్శనలు సముద్ర సంబంధాలు నౌకాదళాల మధ్య భాగాస్వామ్య విలువలను ప్రతిబింబిస్తాయి. ఇది ప్రధానంగా ప్రాంతంలోని అందరికీ భద్రత, వృద్ధి పరిధిలో ఉంది.

## నగర వాసులకు విస్టా కమ్మని రుచుల వేదిక

ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త

నగర వాసులకు విస్టా అద్భుతమైన కమ్మని రుచుల వేదిక అని పార్క్ హెూటల్ జనరల్ మేనేజర్ జయదేవ్ బిస్వాస్ అన్నారు. ఈ మేరకు శనివారం పార్కు హెూటల్ విస్టాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ హెూటల్ లోని విస్టా పేరల అత్యన్నతమైన ట్రైనింగ్ రెస్టారెంట్ జూన్ 2న ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రెస్టారెంట్ కేవలం నోటి మాత్రమే రుచులు అందించడమే కాక కళ్ళకు సైతం సుందర దృశ్యాలను సాక్షాత్కరించనట్లు అద్భుతంగా రూపకల్పన చేశారన్నారు. సముద్ర దీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతృప్తికరమైన రుచులతో మరపురాని భోజన మధురానుభూతిని ప్రతి ఒక్కరికి అందిస్తుందన్నారు.

## బెంబేలెత్తిస్తున్న కొబ్బరి బొండాల ధరలు

గోపాలపట్నం, జూన్ 1, ప్రభాతవార్త



వేసవి తాపం ఉధృతమయిన నేపథ్యంలో కొబ్బరి బొండాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ ఓ మాదిరిగా పలికిన కొబ్బరి బొండాం ధర ఇప్పుడు అమాంతంగా రెట్టింపు పలుకుతోంది. పోషక విలువలతో పాటు ఒంటిలోని వేడిమిని తగ్గించేందుకు ప్రధానంగా ఉపయోగపడే కొబ్బరి బొండాలను వినియోగించేందుకు ప్రజలు పోటీపడుతుండడం కూడా ధరల పెరుగుదలకు కారణం. రోహిణీ కార్తెలు ప్రవేశించిన తరు ణంలో ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత కూడా అధికంగా వుంటున్న రోజులివి. వీటికి వడగాలులు కూడా తోడవడంతో ప్రజలు తీవ్ర అసహనానికి, అస్వస్థతలకు లోనవుతున్నారు. ఈ పరిస్థితులన్ని కొబ్బరిబొండాల ధరలను అమాంతం పెంచేసాయి.

### రెట్టింపు ధరలుః

నిన్న మొన్నటి వరకు ఓ మోస్తరుగా వున్న కొబ్బరిబొండాం 20 రూపాయల ధర పలికేది. కాసింత పెద్ద సైజు బొండామయితే 25 నుంచి 30 రూపాయలకు అమ్ముడయ్యేది. అలాంటిది ప్రస్తుత పరిస్థితులలో మోస్తరు బొండాం 40 రూపాయలు, పెద్దవయితే 50 రూపాయలు పలుకుతున్నాయి. ఇంత రేటు అయినప్పటికి ప్రజలు వీటిని సేవించేందుకు వెనుకాడటం లేదు. ధర పక్కన పెట్టి కొబ్బరిబొండాం వల్ల కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విరివిగా కొనుగోలు చేస్తున్నారు.

### ప్రయోజనాలెన్నోః

సహజసిద్ధంగా కాసి ఎటువంటి కల్తీ చేయడానికి వీలులేని కొబ్బరిబొండాల వల్ల ప్రయోజనాలు అధి కం. ముఖ్యంగా న్యూట్రియంట్స్, మినరల్స్‌ను అందించే కొబ్బరిబొండాల నీళ్ళు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బరువు తగ్గేందుకు కూడా ఉపయోగపడతాయి. ముఖ వర్చస్సును కూడా మెరుగు పరుస్తాయి. గుండె, కాలేయం వంటి శరీరభాగాలు సక్రమ పద్ధతిలో పనిచేసేందుకు దోహదం చేసే కొబ్బ రి నీళ్ళను వ్యాయామం చేసిన తరువాత సేవిస్తే కలిగే ప్రయోజనాలు అనేకం. ఇన్నిరకాల ప్రయోజనా లు అందించే కొబ్బరిబొండాలను ఎంతైనా ఇచ్చి కొనుగోలు చేయవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

### మధ్యవర్తుల చేతివాటంః

సుదూర ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చే కొబ్బరిబొండాలను టోకులో సరఫరా చేసే మధ్యవర్తులు ప్రస్తుత పరిస్థితులను తమకనుకూలంగా మార్చుకుంటూ దండిగా సంపాదిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. అటు రైతులకు ధరల పెరుగుదల అంతగా లాభించకపోయినా మధ్యవర్తులు మాత్రం రెండు జేబులు నింపుకుంటున్నారన్న వాదనలు వినవస్తున్నాయి. నియంత్రణకు వీలులేని కొబ్బరిబొండాల ధరలు మధ్యవర్తులకు వరంగా పరిణమించాయన్న వాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

## అంజనేయ భక్తులకు ప్రసాదం వితరణ

ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త



హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక 9వ వార్డు పరిధిలో ఉన్న సింహగిరికాలనీ, హనుమంతవాక రామాలయం, ఎస్సీ,ఎస్టీ కాలనీలో ఉన్న అంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకోనేందుకు భక్తులు ఉదయం నుండి బారులు తీరారు. వార్డు ఇంచార్జు బుడుమూరి గోవింద్ అంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన చేతులు మీదుగా భక్తులు ప్రసాద వితరణ చేశారు. బాదరు బాలరాజు, అప్పాజీ, మారుపల్లి చిన్నారావు, నల్ల ఈశ్వరరావు, గెడ్డవలస వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఘనంగా హనుమాన్ జయంతి



విశాఖపట్నం,జూన్1 ప్రభాతవార్త

శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో హనుమాన్ ఆలయాలతో పాటు రామాలయాలలో కూడా హనుమాన్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు. వేకువజాము నుండి స్వామివారికి ప్రత్యేక అభిషేకములతో పాటు పూజలు నిర్వహించారు. శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలను శో భాయమానంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

### ఈస్ట్‌షిర్డి సాయిబాబా ఆలయంలో..

శ్రీ హనుమాన్ జయంతిని ఈస్ట్‌షిర్డి సాయిబాబా ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ప్రత్యేక పూజలను ,భక్తులుకు ఆలయంలో పూజలు అనంతరం తీర్థప్రసాదములు అందజేశారు.

### అభయాంజనేయ స్వామి ఆలయంలో..

సీతమ్మధారలో గల ఆభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. వేకువ జామున అభిషేకములతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి పళ్ళురకాల పళ్ళుతోపాటు తమళ్ళపాకులు పూజలు కూడా నిర్వహించారు. ఆలయంలో పూజలు పూజలు చేసుకున్నావారితోపాటు స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు.

### సీతమ్మధారలో గల షిర్డిసాయిబాబా ఆలయంలో...

శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా సీతమ్మధారలో గల షిర్డిసాయిబాబా ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు, గత మూడు రోజులుగా ఆలయంలో మన్యసూక్త హోమం నిర్వహించారు. శనివారం స్వామివారికి వేకువజాము నుండి ప్రత్యేక అభిషేకములతో పాటు పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదములు పంపిణీచేశారు.

## విద్యుద్ఘాతంతో దుక్కిటెద్దు మృతి

కొయ్యూరు, జూన్1, ప్రభాతవార్త



శనివారం మండలంలోని పలుగ్రామాల్లో పిడుగులతో కురిసిన వర్షానికి తెగిపడిన విద్యుత్‌వైర్లుతాకి మండలంలోని బూదరాళ్ల పంచాయితీ, చౌడుపల్లి గ్రామానికి చెందిన రైతు పొత్తూరుభీమయ్యకు చెందిన ఓ దుక్కిటెద్దు విద్యుదాఘానికి గురై మృత్యువాత పడింది. దీనితో బాధితరైతు పొత్తూరుభీమయ్యకు ప్రభుత్వం ఆర్థికసాయమందించి ఆదుకోవాలని పంచాయితీసర్పంచ్ సాగినము త్యాలమ్మ, వార్డుమెంబర్ సాగిన సంజీవ్ తదితరులు కోరుతున్నారు.


## న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు విశాఖపట్నం జిల్లాలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తివున్న యువకులకు న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.

అభ్యర్థులకు కావలసిన అర్హతలు

— 35 ఏళ్ళ లోపు వయస్సు
— స్థానికంగా నివాసం
— ఇంటర్ లేదా డిగ్రీ
— ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు

ఎన్‌ఎడి, పెందుర్తి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల, నాతవరం, రోలుగుంట, రావికమతం, అచ్చుతాపురం, చోడవరం, మాడుగుల, స్టీల్‌ప్లాంట్, విశాఖపట్నం

అర్హులైన అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో 03-06-2024 సోమవారం ఉదయం 10 గంటలకు వార్త యూనిట్ కార్యాలయం, విశాఖపట్నంలో జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు, ఎస్.ఎస్.సి., ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో హాజరుకాగలరు.

'వార్త' కార్యాలయము
డోర్ నెం.50-1-16/10/బి
దుర్గాగణపతి గుడి వెనుక, గవర్నమెంట్ మున్సిపల్ స్కూల్ ఎదురుగా
సీతంపేట, విశాఖపట్నం -530016

## వైభవోపేతంగా శ్రీ అభయాంజనేయ స్వామి జయంతి



### ఆకట్టుకున్న హనుమాన్ శోభాయాత్ర

అరకులోయ, జూన్ 1, ప్రభాతవార్త

అరకులోయ పెట్రోల్ బంకు సమీపంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద శనివారం స్వామి వారి జయంతి వేడుక ఆలయ కమిటీ నిర్వాహకులు కాపుగంటి కృష్ణారావు, గుణేశ్వరరావు, సంతోష్ జగన్నాథం ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగింది. అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర, లక్ష సింధూర పూజ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఆలయం వద్ద మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమం కు అరకులోయ వాసులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలును స్వీకరించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ, ఉత్సవ కమిటీ నాయ కులు శీలం అప్పల రాం, కొల్లా రమేష్, చందు పాడి,, అప్పు, అర్జున్, నాని, రమణ, శ్రీ అభయాం జనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు సంగీత్, కలియ, ముప్పిడి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌బికె కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ వరి విత్తనాలు సరఫరా చేయాలి

### ఉపసర్పంచ్ భగత్ రాం డిమాండ్



అరకులోయ, జూన్ 1, ప్రభాతవార్త

జిల్లాలో ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న ఆర్‌బికె కేంద్రాల్లో గిరిజన రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను సరఫరా చేయాలని మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయితీ ఉప సర్పంచ్ జె భగత్ రాం డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్.బి.కె కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ వరి విత్తనాలను అందించాలన్నారు. వ్యవసాయ సీజన్ వచ్చినప్పటికీ రైతులకు విత్తనాలు సరఫరా చేయటం లేదని, దీనివలన గిరిజన రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వరి విత్తనాల కొరకు రైతులు మైదాన ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## రక్తదాతలకు అభినందనలు



గాజువాక,జూన్ 1,ప్రభాతవార్త

పెదగంట్యాడ మండల అధ్యక్షులు కిలాని ముసలయ్య జన్మదినం సందర్భంగా వందే భారత్ బ్లడ్ బ్యాంక్, నవీన్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్త ధాన శిభిరం, ఉచిత చెవి, ముక్కు, కంటి, పంటి జనరల్ చెకప్ మెడికల్ క్యాంపుని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధులుగా బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొని రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ప్రతి ఏటా కిలాని ముసలయ్య పుట్టిన రోజున పలు సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో మంది పేదలకు సహాయం చేస్తున్నారని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు పేదలకు సహాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీను, గూటూరు శంకరరావు, ములకలపల్లి ఈశ్వరరావు, సోంబాబు, కరణం వరలక్ష్మీ, పల్లా బెంగుళూరు శ్రీను, సియ్యాద్రి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోని మానసిక ఉల్లాసం



### గ్రంథాలయ అధికారిణి శెట్టి సునీత

డుంబ్రిగుడ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త

క్రీడలతోనే మానసిక ఉలాసాన్ని కలిగిస్తుందని శాఖ గ్రంథాలయ అధికారినిణి శెట్టి సునీత అన్నారు. మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంధాలయంలో విద్యార్థిని విద్యార్థులకు శనివారం శాఖ గ్రంథాలయ అధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా శాఖ గ్రంథాలయ అధికారిని శెట్టి సునీత మాట్లాడుతూ గ్రంధాలయ వారోత్సవాల పురస్కరించుకొని విద్యార్థుల నైపుణ్యత వెలికి తీసేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తీవ్రమైన ఎండతో అల్లాడుతున్న ప్రజలు



డుంబ్రిగుడ, జూన్ 1, ప్రభాతవార్త

మన్యంలో మూడు రోజులపాటు తీవ్రమైన ఎండతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎప్పుడు లేని విధంగా 9గం.ల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కూడా తీవ్రమైన ఎండ ప్రభావం ఉండడంతో ఉక్కపోతతో ప్రజలు ఎవరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు అధికమవడంతో ఇంట్లో ఉన్న కూడా తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలందరూ అల్లాడుతున్నారు. ఎప్పుడు లేని విధంగా ఏదాది ఎండలు తీవ్రతరం అవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



యలమంచిలి, జూన్ 1, ప్రభాతవార్త

యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని మండలంలోని శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి గ్రామంలోనా జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ విగ్రహం ఉన్నచోట ఉదయం 6గంటల నుండి ప్రత్యేక పూజలు ఆచరించి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎలమంచిలి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని హనుమాన్ దేవాలయంలోని, తాటి మెట్ల సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయంలోని, పంట కాలవ వద్ద గల హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్ నగర్ సమీపంలో గల లిటిల్ కాలనీలో వేంచేసి ఉన్న హనుమాన్ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. టిడ్కో కాలనీలో వేచి ఉన్న హనుమాన్‌కు 5 తులం వెండి నామాలు అనకాపల్లికి చెందిన వ్యాపారవేత్త బహుకరించారు. ఇదేవిధంగా యలమంచిలి తులసి నగర్‌లో వంచముఖ ఆంజ నేయస్వామి, ప్రతి ఆలయం వద్ద భారీ ఎత్తున అన్న సమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## యూనివర్సిటీ టాపర్స్‌ను అభినందించిన ఏయు వీసీ



మద్దిలపాలెం, జూన్1, ప్రభాతవార్త

ఆంధ్ర యూనివర్సిటీ గౌరవనీయ ఉపకులపతి ప్రొఫెసర్ పి.వి.జి.డి. ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, సత్య డిగ్రీ, పీజీ కాలేజ్, విజయనగరం బిబిఏ విద్యార్థినులు కుమారి కె.రమ్య, కుమారి టి.ఊర్మిళాదేవి యూనివర్సిటీ పరీక్షలు 2024లో అగ్రస్థానాలు సాధించి నందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కళాశాల సంచాలకులు డా.మజ్జి శశి భూషణరావు, ప్రిన్సిపల్ డా.ఎంవి సాయిదేవ మణి, మేనేజిమెంట్ స్టడీస్ విభాగం హెడ్ డా.ఎస్. వరుధిని లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విధంగా సత్య కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ టాప్ ర్యాంకర్‌గా నిలవడం విద్యార్థుల అధ్యాపకుల తల్లిదండ్రులు, యాజమాన్యం చేసిన కృషి అని, ఇటువంటి విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించి జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలని, మిగిలిన విద్యార్థులు వీరిని చూసి స్ఫూర్తిని పొందాలని, ఏ రంగం ఎన్నుకున్న అందులో చక్కగా రాణించేలా కృషి చెయ్యాలని, సత్య కాలేజ్ మెరుగైన విద్యా ప్రమాణాలకు ఒక ప్రముఖ సంస్థగా నిలిచిపోవాలని, రాబోయే సంవత్సరాలలో మరింతగా అభివృద్ధి చెందాలని ఉపకులపతి ఆకాంక్షను వ్యక్తం చేశారు.

## మద్దిలో హనుమాన్ జయంతి వేడుకలు .. పాల్గొన్న పద్మనాభం ఎంపీపీ కే.రాంబాబు

భీమునిపట్నం, జూన్ 1, ప్రభాతవార్త



మద్ది గ్రామములో మద్ది జంక్షన్‌లో ఉన్న హనుమంతుని ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా వేడుకలలో పద్మనాభం ఎంపీపీ కే రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.సన్యాసమ్మ సత్యనారాయణ కనకల శ్రీను కాళ్ల శ్రీను కే.రాజన్న కనకల నాయుడు పాల్గొన్నారు.

## మార్కెటింగ్ సదుపాయాల కల్పన ద్వారానే ఉపాధి పెరుగుదల

అనకాపల్లి, జూన్ 1, ప్రభాతవార్త



రీ సస్టైనబులిటీ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో రామ్‌కీ ఫౌండేషన్ అమలు చేస్తున్న మత్స్యకారుల జీవనోపాదుల కార్యక్రమంలో భాగంగా శనివారం కొండకర్ల అవ, వాడ్రాపల్లి గ్రామాలకు చెందిన 16 మంది మత్స్యకారులకు వారు పట్టుకునే చేపలను గ్రామాలకు తీసుకుని వెళ్లి అమ్ముకొనుటకు గాను 16 టీవీఎస్ ద్విచక్ర వాహనాలను అందజేశారు. అలాగే మత్స్యకారులు వర్షాకాలంలో వారి వలలు బాగుచేసుకొనుటకు, దాచుకొనుటకు వీలుగా ఒక షెడ్ ని నిర్మించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీ సస్టైనబిలిటీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కే.రవిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద మంచినీటి సరస్సు అయిన కొండకర్ల అవ ద్వారా 300 మంది మత్స్యకారులకు ఉపాధి కలగడం చాలా సంతోషకరమైన విషయమని గత మూడు సంవత్సరాలుగా రీ సస్టైనబిలిటీ రామ్‌కి ఫౌండేషన్ మత్స్యకారులకు 31 ద్విచక్ర వాహనాలు, నాలుగు చేపల వేట పడవలు, చేప పిల్లల కొనుగోలుకు అవసరమైన ఆర్థిక సహాయం చేయడం జరిగిందని అన్నారు. వాటిని సక్రమమైన పద్ధతిలో వినియోగించుకొని ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామ్ కీ ఫౌండేషన్ అధ్యక్షులైన ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ రామ్ కీ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమంలో ఇక్కడ ప్రజలు భాగస్వామ్యులు కావడం చాలా సంతోషంగా ఉందని ఇదే ఉత్సాహం భవిష్యత్తులో చేపట్టిన కార్యక్రమాల్లో కొనసాగించాలని కోరడం జరిగినది. మత్స్యకారులు సంపాదించిన డబ్బుతో కొంత మొత్తాన్ని భవిష్యత్తు అవసరాలకు, పిల్లల చదువుల కొరకు దాచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూ ఎంపీ స్థానిక హెడ్ కే.రవికుమార్, రామ్ కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కే.శ్రీకాంత్, సిఎస్‌ఆర్ మేనేజర్ సిహెచ్. మహేంద్రబాబు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కే. శ్రీనివాసరెడ్డి, ఇతర సిబ్బంది, మత్యకార సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి.. సంయమనం పాటించండి : జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనకాపల్లి, జూన్ 1, ప్రభాతవార్త



ఎగ్జిట్ ఫోల్స్ విడుదల అయిన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనం పాటించాలని జిల్లా ఎస్పీ కెవీ మురళీకృష్ణ కోరారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో శాంతి భద్రతల పరిరక్షణ అవగాహన సదస్సులో రాజకీయ పార్టీ నేతలతో ఆయన మాట్లాడారు. 4వ తేదీన 6 అసెంబ్లీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అనకాపల్లి మండలం, శంకరం గ్రామం, కలెక్టరేట్ వద్ద గల ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌లో ఓట్ల లెక్కింపు, ఫలితాలు విడుదల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించి, జిల్లాలో ఎన్నికల సరళిని ప్రశాంతంగా జరిపేందుకు సహకారం అందించినందుకు గాను అభినందించారు. అదే విధమైన సంయమనం, సహకారం విడుదల అయిన ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాల రోజులలో కూడా పాటించాలని తెలిపారు. కౌంటింగ్‌కు ముందుగానీ, కౌంటింగ్ రోజు గాని, కౌంటింగ్ తర్వాత గాని ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నామని, కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి మొబైల్ ఫోన్స్ కానీ, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కానీ, పెన్ పేపర్ మొదలగు వాటిని అనుమతించరని తెలిపారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, మందుగుండు సామాగ్రిని కాల్చకూడదని, ఎవరు కూడా గుంపులుగా ఉండకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని, ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. ఎవరైనా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను మీరి వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర సమయాలలో నమోదు చేసే కేసులు కన్నా, ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసుల, తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, కె.కోటపాడు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ స్వామి నాయుడు, వి.మాడుగుల ఎస్సై దామోదర్ నాయుడు, చీడికాడ ఎస్సై నారాయణరావు, కె.కోటపాడు ఎస్సై లక్ష్మీనారాయణ, దేవరపల్లి ఎస్సై నాగేంద్ర, మండల రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

## తగరపువలసలో హనుమాన్ జయంతి



భీమునిపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

ఆంజనేయ స్వామి జయంతిని పుష్కరించమని తగరపువలస గాంధీ బొమ్మ నగరపు మీది వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జీవీఎంసీ ఫస్ట్ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తమ్మిన సూరిబాబు జీవీఎంస్ ఫస్ట్ డివిజన్ ఉపాధ్యక్షులు దొంతలపైడ్రాజు దంపతుల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి పూజలు చేయడం జరిగింది. సూరిబాబు మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్‌లో ఇటువంటి అంచనీయ సంఘటన జరగకుండా ఆంజనేయ స్వామి వేడుకోవడం జరిగింది గంట శ్రీనివాసరావు అత్యధిక మెజార్టీతో గెలవాలని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం రావాలని చంద్రబాబునాయుడు సీఎం కావాలని దేవుని ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తమ్మిన సూరిబాబు పులి తగరపువలస గ్రామ పెద్దలు తమ్మిన సూరి రాములు సీనియర్ నాయకులు నరవరామారావు బీసీల అధ్యక్షులు దొంతల సూర్య యూత్ సెక్రెటరీ దండి చంటి విశాఖ పార్లమెంటరీ యూత్ సెక్రెటరీ పిల్ల రాజేష్ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు గిడుతూరి శ్రీను యువ నాయకుడు తమ్మిన శ్రీను బిజెపి నాయకులు పిల్ల తాతాజీ తెలుగుదేశం పార్టీ నాయకులు పందిరి తారకేష్ సారిక మధు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి .. తరలివచ్చిన భక్తులు...

నక్కపల్లి, జూన్ 1, ప్రభాతవార్త



హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున శనివారం వేలాది మంది భక్తుల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. మండలంలోని వేంపాడు, నెల్లిపూడి, ఉపమాక, ఉద్దండపురం, దేవవరం, కాగిత తదితర గ్రామాలతో పాటు నక్కపల్లి పట్ట ణంలోని జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు ఊహించిన విధంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాలు హెూమంలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేష్, కోసూరి శ్రీనివాస రావుతో పాటు పలువురు పట్నానికి చెందిన యువకులు, నాయకులు, మహిళలు దర్శించుకుని గోత్రనామాలతో శ్రీపాద ప్రణవ్‌రామ్, పండు పురోహితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



## హనుమాన్ జయంతి వేడుకల్లో కంబాల జోగులు

నక్కపల్లి, జూన్ 1 ప్రభాతవార్త



పాయకరావుపేట నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఎస్.రాయవరం మండలం ఎస్.రాయవరంలో ఆంజనేయ స్వామివారిని జయంతి సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి

### గ్రామ గ్రామాన ప్రత్యేక పూజలు.. అన్న సమారాధన



గొలుగొండ, జూన్1, ప్రభాతవార్త

హనుమాన్ జయంతి వేడుకలు మండలంలో గ్రామ గ్రామాన ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి గ్రామంలో పెద్దలు మహిళలు పిల్లలు ఉత్సాహంగా హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు అందించారు. ఉదయం నుండే హనుమాన్ ఆలయాలు వద్ద సందడిగా ఆలయాలు శుభ్రపరచడం హనుమాన్ విగ్రహాలను శుద్ధి చేయడం, ఆలయాల అలంకరణలో భక్తులు నిమగ్నమయ్యారు. పాత కృష్ణాదేవిపేట నుండి మొదలు కొని ఏఎల్ పురం, చోద్యం కూడలి గొలుగొండ, జోగుంపేట, జానకిరాంపురం ఛీడిగుమ్మల, పాకలపాడు, ఏటి గైరంపేట, గుండు పాల, కొత్త ఎల్లవరం తోపాటు అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి ఒక వేడుకల సాగింది. భక్తులు ప్రత్యేక పూజలు పాల్గొని స్వామివారికి హారతులు అందించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేసి ఆయా గ్రామాల పరిధిలో గ్రామాలను కూడా కలుసుకొని భక్తులకు ప్రసాదాలు అందించారు. అలాగే ఎంతోమంది కూడా అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. జానకిరాంపురంలో మహిళలు కోలాటం నిర్వహించి భక్తులకు ఆహ్లాదాన్ని అందించారు.

## కౌంటింగుకు సర్వం సిద్ధం

### మరో రెండు రోజుల్లో తేలనున్న భవితవ్యం- పటిష్ట భద్రత మధ్య కౌంటింగ్ -నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు

పాడేరు,జూన్1,ప్రభాతవార్త



సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గర పడింది. మరో రెండు రోజుల్లో రాజ కీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓట్లు లెక్కింపుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తూ భద్రతా చర్యలపై దిశా నిర్దేశం చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాలో ఐరన్ గ్రిల్స్ వేయించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రకాశవంతమైన విద్యుత్ దీపాలు, బారికేడింగ్ ఏర్పాటు చేసారు. కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు వేరు వేరుగా ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేసారు. మీడియా సెంటరుకు రౌండ్ల వారీగా ఫలితాలు చేరవేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టూ సిసి కెమోరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసారు. డిగ్రీ కళాశాల మార్గంలో భారీ వాహనాల రవాణాను నిషేదించారు. అదేవిధంగా 144 సెక్షను అమలు చేస్తున్నారు.

### కౌంటింగ్ ప్రక్రియ ఇలా...

జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకు వ్యాలీ అసెంబ్లీ సెగ్మెంట్లకు పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు వేరు వేరి కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా అరకు పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి అరకు, పాడేరు నియోజక వర్గాలకు ప్రత్యేకంగా కౌంటింగ్ ఏర్పాట్లు చేసారు. రంప చోడవరం నియోజక వర్గానికి రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు చేసారు. నాలుగవ తేదీ ఉదయం ఐదు గంటలకు కౌంటింగ్ సిబ్బంది విధులకు హాజరై వారికి కేటాయిం చిన టేబుళ్లకు చేరుకుంటారు. ఎనిమిద గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను, ఇటిపిబి ఎస్ ఓట్లు లెక్కిస్తారు. ఇవిఎంలలో ఉన్న ఓట్లను లెక్కిస్తారు. జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు ప్రతీ రోజు స్ట్రాంగ్ రూంలను సందర్శించి భద్రతా చర్యలు పరిశీలిస్తున్నారు.

### జిల్లా కలెక్టర్ ఆదేశాలు..

సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు సమీపిస్తున్న వేళ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో పలు దఫాలు సమావేశాలు నిర్వహించి ఓట్లు లెక్కింపుపై దిశా నిర్దేశం చేసారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ అనంతరం ఇవిఎంలు కౌంటింగ్ ప్రక్రియ చేపడతారు. ఓట్లు లెక్కింపు ప్రక్రియలో రిటర్నింగ్ అధికారుల నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేయడం జరిగింది.

### మూడంచెల భద్రతా చర్యలు..

కౌంటింగ్ ప్రశాంతంగా జరగడానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తగిన భద్రతా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్ రూముల నుండి కౌంటింగ్ కేంద్రాలకు ఇవి ఎంలు తరలింపులో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు స్పష్టంగా వివరించారు. అదేవిధంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు రాకపోకలు సాగించే విధానంపై సుస్పష్టమై సూచనలు చేశారు.

### కౌంటింగ్ కేంద్రాలకు ఇలా..

అరకు అసెంబ్లీ నియోజక వర్గం, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని స్థానిక ఎంపిడి ఓ కార్యాలయం జంక్షన్ నుండి వచ్చే మార్గంలో డిగ్రీ కళాశాలకు పవేశం కల్పిస్తామన్నారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి డిగ్రీ కళాశాలకు చేరుకోవడానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. కౌంటింగ్ అధికారులు, ఏజెంట్లు, మీడియాకు జారీ చేసిన పాసులను వెంట తీసుకుని రాకపోతే అనుమతించరు. కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లతో పాటు మైక్రో అబ్జర్వర్లు ఉంటారు.

### తొలిసారి ఓట్లు లెక్కింపు..

గత ఎన్నికలలో విశాఖపట్నం స్వర్ణ భారత స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలలో జరుగుతున్న మొట్టమొదటి ఓట్లు లెక్కింపు సజావుగా నిర్వహించి జిల్లాకు మంచి పేరుతీసుకుని రావాలని అధికారులు కృషి చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసారు. అదే విధంగా విజయవంతంగా కౌంటింగ్ పూర్తి చేయడానికి పలు దఫాలుగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

## నాటు తుపాకీ స్వాధీనం.. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు



అడ్డతీగల, జూన్1, ప్రభాతవార్త

అడ్డతీగల రేంజ్ అటవీ క్షేత్ర పరిధిలో వై.రామవరం మండలం బుల్లోజు పాలెం గ్రామం నుండి కోట వైపు నాటు తుపాకితో ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అటుగా వెళుతున్న అటవీ సిబ్బంది అనుమానం వచ్చి బైక్‌ను తనిఖీ చేయగా వారి వద్ద నాటు తుపాకీ, గుళ్ళు, బాకు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని అడ్డతీగల రేంజ్ కార్యాలయానికి తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ అనంతరం ముగ్గురు నిందితులపై అటవీ చట్టం వన్యప్రాణుల సంరక్షణ చట్టం ఆయుధాలు చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని సబ్ డిఎఫ్ డి.రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజర్ సహాన్సా, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో మహిళ మృతదేహం కలకలం



నర్సీపట్నం, జూన్ 1, ప్రభాతవార్త

నర్సీపట్నం చింతపల్లి రోడ్డులో శనివారం ఉదయం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని టౌన్ పోలీసులకు అంద జేశారు. టౌన్ ఎస్సై ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. మృతిచెందిన మహిళ వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, మహిళ గిరిజన మహిళగా భావిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామన్నారు.

## ఎన్నికల విధులపై ఏఆర్, ఎపిఎస్పి సిబ్బందికి దిశానిర్దేశం

### కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ రవిశంకర్

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద రెండవ అంచలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్, ఎపిఎస్పి సిబ్బందికి ఎన్నికల విధులపై పోలీస్ కమిషనర్ రవిశంకర్ దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత, పార్కింగ్, ఎంట్రన్స్, ఎక్సిట్ లను ఇతర ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. మరో రెండు రోజుల్లో ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన పటిష్ఠ బందోబస్తు చర్యలను సిపి రవిశంకర్ జాయింట్ సిపి ఫకీరప్పతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఇందులో భాగముగా కౌంటింగ్ నాడు కౌంటింగ్ కేంద్రాల ప్రాంగణంనకు చేరుకొనే వాహనాలు, వాటి పార్కింగ్, అన్ని నియోజక వర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరే సిబ్బంది, అభ్యర్థుల వివరాలు, సైనేజ్ బోర్డులు ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళే ప్రధాన రహదారులు ముఖ్యముగా లోపలకు వెళ్ళే ప్రవేశ ద్వారం, బయటకు వెళ్ళే నిష్క్రమించే ద్వారం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తులను స్వయంగా పరిశీలించారు. అనంతరం కీలకమైన కౌంటింగ్ కేంద్రాల వద్ద రెండవ అంచలో విధులు నిర్వహిస్తున్న నగర ఏ.ఆర్, ఎ.పి.ఎస్.పి సిబ్బందిని అదే ప్రాంగణములో ఫాల్ ఇన్ చేసి వారి విధులపై దిశా నిర్దేశం చేశారు, అందులో భాగంగా కౌంటింగ్ నాడు నిర్వహించవలసిన విధులను తెలియజేస్తూ, పాటించవలసిన నియమ నిబంధనలు ప్రత్యక్షంగా తెలిపారు. రెండవ అంచే భద్రతలో కౌంటింగ్ కేంద్రాల లోనికి ప్రవేశించే వారిని తనిఖీ చేయు విధానాలను డెమో రూపంలో సిపి సమక్షంలో చూపించారు, సిబ్బంది అందరికీ కౌంటింగ్ నాడు నిర్వహించవలసిన విధులను పూర్తిగా బ్రీఫింగ్ ద్వారా తెలిపారు. ఎస్.బి ఎ.డి.సి.పి, ఏ ఆర్ ఎ.సి.పి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏజెంట్లకు ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తాం : పోలీస్ కమిషనర్ రవిశంకర్

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉందని, లెక్కింపు కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ డా.ఎ.రవి శంకర్ చెప్పారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జునతో శనివారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా ఉంటుందన్నారు. ఇత రులు డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగర వేయకుండా, లెక్కింపు కేంద్రాలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించామని తెలిపారు. రెండు కిలోమీటర్ల పరిధి వరకు రెడ్‌జోన్ ఉంటుందని, లెక్కింపు రోజున డ్రై డేగా ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యాక కూడా ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసి వేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా వచ్చే వారికి ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తామని, బ్రీత్ ఎన్లైజర్లను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. వాహనాల పార్కింగ్ కోసం లెక్కింపు కేంద్రాలవద్ద కౌంటింగ్ అధికారులకు, ఏజెంట్లకు వేర్వేరుగా పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియా ద్వారా ఇతరులను కించపరిచేలా గానీ, రెచ్చగొట్టే విధంగా గానీ ఎలాంటి పోస్టుల చేయరాదని హెచ్చరించారు. కేంద్రాల పరిధిలోకి వచ్చే వారు విధుల నిర్వహణ నిమిత్తం వచ్చే వారు తప్పకుండా ఐడీ కార్డులు ధరించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

## నిర్ధేశించిన ప్రమాణాల ప్రకారం లేకపోతే డీలర్లపై చర్యలు తప్పవు

కొత్తూరు, జూన్ 1, ప్రభాతవార్త



నిర్దేశించిన ప్రమాణాలు ప్రకారం విత్తనాలు లేకపోతే విత్తనచట్టం చెబుతున్న మేరకు విత్తన విక్రయాలు జరుపుతున్న డీలర్లపైన తయారు చేసిన కంపెనీపైన చర్యలు తప్పవని కొత్తూరు వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని జైకిసాన్ రైతు డిపో నందు ప్రత్తి విత్తనాల నమూనాలు తీసుకున్నారు. తీసుకున్న నమూనాలను తాడేపల్లిగూడెంలో గల ప్రాంతీయ విత్తన పరీక్షా కేంద్రానికి పంపుతున్నట్లు స్థానిక విలేకర్లకు ప్రకటనలో వెల్లడించారు. అక్కడ మొలకశాతం, భౌతిక స్వచ్ఛత, జన్యు స్వచ్ఛత ప్రమాణాల పరీక్ష జరుపుతారన్నారు. పరీక్షల అనరతరం స్వచ్ఛతా ప్రమాణాలు నిర్దేశించిన ప్రమాణాలు ప్రకారం లేకపోతే విత్తన చట్టం ప్రకారం విత్తనాలు తయారు చేసిన కంపెనీపైన అలాగే బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న డీలర్‌పైన తగు చర్యలు తీసుకోబడునన్నారు. దీంతో పాటు తనిఖీ ప్రక్రియలో విత్తనాల స్టాక్ రిజిస్టర్‌లు పరిశీలించడం జరిగిందన్నారు. స్టార్ రిజిష్టర్ అమలు తీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావుతో సహా వ్యవసాయ విస్తరణాధికారులు ఎల్.మాధవరావు, బి.రమేష్‌లు కూడా ఉన్నారు.

## విమలమ్మ ట్రస్ట్ సేవలు సమాజానికి ఆదర్శం కావాలి

### విశ్వసాహితి అధ్యక్షులు పివిఎస్ మాస్టర్



ఆముదాలవలస, జూన్ 1, ప్రభాతవార్త

పేద ప్రజల పట్ల ప్రేమ, మమకారం, సేవాభావం కలిగి ప్రభువైన యేసుక్రీస్తు యందు గొప్ప విశ్వాసం గల విమలమ్మ ట్రస్ట్ సేవలు సమాజానికి ఆదర్శం కావాలని ప్రముఖ విశ్వసాహితి అధ్యక్షులు పొన్నాడ వరాహ నరసింహులు మాస్టారు అన్నారు. పట్టణంలో గల రైల్వేగేటు చిట్టెమ్మ క్వార్టర్స్‌లో ఉన్న షిలోహు ప్రార్ధన మందిరం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో యేసుక్రీస్తు నందు మంది విశ్వాసం గల మెండ విమలమ్మ 25 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో పేదలు నివశించే ప్రాంతానికి తన అనుచరులతో వెళ్లి పేదల కష్టసుఖాలు తెలుసుకుని వారికి ఆర్థికంగా గాను ఆదుకోవడమే గాక దైవశక్తితో వారికి ప్రార్ధన చేసి సేవలందించే వారని ఆయన తెలిపారు. పేదల సమాజానికి సేవ చేయాలనే నిరంతరం విమలమ్మ ఉండేవారని ఆయన పేర్కొన్నారు. నివాసిత ప్రాంతాల్లో ఆమె శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని పివిఎస్ మాస్టర్ సూచించారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో మెండ విమలమ్మ ట్రస్ట్ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న పేదల కోరిక మేరకు తాను విమలమ్మ పేరున ఆయన తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా ప్రతినెల పలు సేవా కార్యక్రమాలతో పాటు వార్షికోత్సవాల సందర్భంగా భారీ ఎత్తున మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. అదే విధంగా ఈ ట్రస్ట్ సెక్రటరీ ఎమ్మెస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాల్లో పేద ప్రజలను భాగస్వాములు చేయడంతో పాటు మేధావులు ఉద్యోగ ఉపాధ్యాయులు అన్ని వర్గాల ప్రజలు సూచనలు, సలహాలు తీసుకుని మరిన్ని సేవలు ఈ ట్రస్ట్ ద్వారా నడిపిస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ అలేఖ్య, ఏరియా మేనేజర్ ఎల్.శ్రీధర్, ఫార్మాసిస్ట్ విశ్వనాథం, పిఆర్ఓ త్రినాథ్‌కుమార్, రాంబాబుతో పాటు ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ కూన రాఘవనాయుడు, డాక్టర్ చాపర అనూష తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ట్రస్ట్ చైర్మన్ మరియు కమిటీ సభ్యులతో పాటు మున్సిపాలిటీలో ఉన్న ఫాస్టర్స్ కూడా పాల్గొన్నారు. ఫాస్టర్ ఎస్.అసిర్‌కుమార్, ఫాస్టర్ రావా విజయ్‌కుమార్, ఫాస్టర్ టి.జార్జి ముల్లర్, ఫాస్టర్ జి.సామ్యూల్, అరుణ్‌కుమార్, ఫాస్టర్ షద్రక్ స్టీవెన్ చంద్రశేఖర్, ఫాస్టర్ కె.కృపారావు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థి విద్యకు ఫీజు చెల్లించిన స్పందన ఫౌండేషన్

సంతబొమ్మాళి, జూన్ 1, ప్రభాతవార్త



సంతబొమ్మాళి మండలం బడే కుప్పన్నపేటకు చెందిన కె.పి స్పందన ఫౌండేషన్ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పేద విద్యార్థి ఇజ్జిన జోషికుమార్ ఇంజనీరింగ్ విద్య కొనసాగించడానికి సాయం అందించింది. జోషి చిన్ననాడే తండ్రిని కోల్పోయి అమ్మ దర్జీ పని సంపాదనతో టెక్కలి ఐతం కాలేజీలో ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి కట్టాల్సిన బకాయి, ఉద్యోగ శిక్షణకు 13వేల రూపాయలు కట్టాలని తనకు సాయం చేయాలని సోషల్ మీడియా ద్వారా విద్యార్థి విజ్ఞప్తి చేశాడు. దీనిపై స్పందన ఫౌండేషన్ సభ్యులు స్పందించి ఫీజు చెల్లింపుకు కావల్సిన సొమ్మును విద్యార్థి నివాస హాస్టల్‌కు వెళ్లి శనివారం అందజేశారు. ఆ విద్యార్థి చదువు పూర్తి అయ్యేంత వరకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు సాయం ఎలాంటిదైనా ఏ ప్రాంతానికి అయినా, ఎవరికైనా మా సంస్థ సభ్యులు, దాతలు ముందుకు రావడం చాలా ఆనందంగా ఉందని స్పందన ఫౌండేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు షన్ముఖరావు, సురేష్‌రెడ్డి, సిమ్మన్న, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

రాజాం, జూన్ 1, ప్రభాతవార్త

రాజాం పట్టణ పరిధిలో ఉన్న అమ్మవారి కాలనీలో శ్రీపోలిపల్లి పైడితల్లమ్మ అమ్మవారి దేవాలయం సమీపంలో గల శ్రీఅభయాంజనేయస్వామి వారి సన్నిధిలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్ధప్రసాదాలు స్వీకరించారు. ఈ జయంతి ఉత్సవాల్లో గెడ్డం పంతులు, వెంపల లక్ష్మణరావు, బాబ్జి మాస్టారు, శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు, ఎరువులు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవు



వీరఘట్టం, జూన్ 1, ప్రభాతవార్త

ఎరువులు, వరి విత్తనాలు, పురుగు మందులు గాని ఎవరైనా అధిక రేట్లుకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.రత్న కుమారి డీలర్లను హెచ్చరించారు. శని వారం స్థానిక మార్కెట్ యార్డులో మండ లంలోని ప్రైవేటు డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ప్రతి షాపుకు లైసెన్స్ ఉండాలని అలాగే ఆయా షపుల ద్వారా విక్రయించే సరుకులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని ఆమె తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు గాని ఇతర పురుగు మందులు గాని అమ్మితే అటువంటి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లను కూడా రద్దు చేస్తామని ఆమె గుర్తు చేశారు. ప్రతి ఒక్క డీలరు తమ షాపుల వద్ద స్టాకు బోర్డులను, రేట్లును స్టాకును వివరిస్తూ వేలాడదీయాలని ఆమె అన్నారు. ఆయా షాపుల ద్వారా రైతులు ఎవరైనా తమకు ఫిర్యాదు చేస్తే వెంటనే తగుచర్యలు తీసుకుంటామని రత్నకుమారి అన్నారు. ఆమెతో పాటు మండల వ్యవసాయశాఖ అధికారి జక్కు సౌజన్య, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడల ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

కోటబొమ్మాళి, జూన్ 1, ప్రభాతవార్త



మండలంలో గల అన్ని గ్రామాల్లో శ్రీఆంజనేయ ఆలయాలతో పాటు శ్రీరామ మందిరాల్లో శనివారం భక్తులు, ఆలయ నిర్వాహకులు ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. మండలం ఊడికలపాడు గ్రామంలో శ్రీఅభయాంజనేయ ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు 2వేల మందికి ఆలయ ధర్మకర్తలు మెండ అప్పన్న, భారతి, నేతింటి సింహాచలం, రమాల ఆధ్వర్యంలో గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి హనుమంతు అన్నంనాయుడు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. అలాగేమ ఒడలం చలమయ్యపేట, నిమ్మాడ జంక్షన్, దంత, లఖందిడ్డి, గంగరాం, తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. అలాగే ఊడికలపాడు గ్రామంలో ఆలయం వద్ద నేతింటి వెంకటరావు ఆధ్వర్యంలో భజన కాలక్షేపం నిర్వహించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త




పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్ ఆవరణలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. భూమి నుంచి వస్తున్న వస్తువులను దుర్వినియోగం చేసి భూమిలోకి చేరుస్తున్నామని దీని వల్ల అనర్థాలు ఉన్నాయని చెప్పారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మహిళలు వీటిపై అవగాహన కల్పించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణయ్యరెడ్డి, దేవరాజురెడ్డి, సీతయ్యరెడ్డి, నాగరాజుపాత్రో, బైరి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కరించండి



ఇచ్ఛాపురం, జూన్ 1, ప్రభాతవార్త

మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అద్దె ట్యాంకర్లకు చరమగీతం పాడుతూ మున్సిపాలిటీ సొంతంగా 1.50 లక్షలతో రెండు నీటి ట్యాంకర్లు కొనుగోలు చేయడంతో కౌన్సిల్ ఆమెదం తెలిపింది. మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కరించి అన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని 11వ వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి కోరారు. కౌన్సిల్ ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా కౌన్సిల్ హాల్ మరమ్మతులు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదంటూ వైస్‌చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి అన్నారు. మున్సిపాలిటీ తరపున 30వేల రూపాయలు పేపర్ ప్రకటన ఎలా ఇచ్చారని వైస్‌చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి నిలదీశారు. నీలకంఠేశ్వరవీధిలో కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని వెంటనే తొలగించాలని కోరారు. 23వ వార్డు బెల్లుపడ కాలనీలో సొంత నిధులతో లక్ష రూపాయలు వెచ్చించి కల్వర్టు నిర్మించామని ఏడాదిగా బిల్లులు చెల్లించడం లేదని కౌన్సిలర్ ప్రదీప్‌కుమార్ నిలదీశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ కమిషనర్ నారాయణరావు పాల్గొన్నారు.

## సొంత నిధులతో నారాయణపురం హైలెవల్ కాలువ మరమ్మతులు

ఆముదాలవలస, జూన్ 1, ప్రభాతవార్త



ఆముదాలవలస నియోజకవర్గంలో ఆముదాల వలస, బూర్జ మండలాల్లో సుమారు 5వేల ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం ప్రాజెక్ట్ హైలెవల్ కెనాల్ సుమారు 4లక్షల రూపాయల సొంత నిధులతో వైసీపీ నాయకులు, వైఎస్ఆర్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ మరమ్మతులు చేయిస్తున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడిక తీయించడం, వరదతో గండి కొట్టుకుపోయిన కాలువ గట్లు మరమ్మతులు చేయించడం వంటి పనులను చేయిస్తున్నారు. బూర్జ మండలం చీడివలస దగ్గర నుంచి ఆముదాలవలస మున్సిపాలిటీ రావికంటిపేట వరకు గల ఈ కాలువ మరమ్మతు పనులను చింతాడ రవికుమార్ రైతులతో కలిసి దగ్గరుండి చేయిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ మరమ్మతు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో గత 20 రోజులుగా పనులను రైతుల సహకారంతో చేయిస్తున్నారు. ఈ కాలువ మరమ్మతు పనులు పూర్తయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు గల ప్రతి ఎకరాకు సాగునీరు పుష్కలంగా అందుతుందని ఇక పంటలకు ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ ధాతృత్వానికి ఆయకట్టు రైతాంగం అంతా అభినందిస్తున్నారు.

## కొండంపేటలో నూతన వృద్ధాప్య అనాధాశ్రమం ప్రారంభం




రాజాం, జూన్ 1, ప్రభాతవార్త

రాజాం పురపాలక సంఘ పరిధిలో ఉన్న కొండం పేట గ్రామ సమీపంలో పెదపూడి శ్రీనివాస రావు, విజయభారతి ఆధ్వర్యంలో నిర్మించిన ఆధునిక వసతులతో కూడిన సుమారుగా 50 మందికి సరిపడే నూతన వృద్ధాప్య అనాధాశ్రమాన్ని మోనంగి ఆదినారాయణ, ప్రమీల కుమారి దంపతులు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ఈ ప్రారంభోత్సవం సర్వమతాలు సమ్మేళనంగా హిందూ ముస్లీం, క్రిస్టియన్ మత పెద్దలతో ప్రార్ధనలు జరిపి ప్రారంభోత్సవం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తలే రాజేష్, పాలవలస శ్రీనివాసరావు, ముక్కా అప్పలనాయుడు, చైతన్యకుమార్, గట్టి పాపారావు, బీవి అచ్యుత్‌కుమార్, కొత్త అనంతరావు, చంద్రమతి దంపతులు, మానం వెంకటేష్, సలాది తులసి మాస్టారు పాల్గొన్నారు.

## సంతబొమ్మాళిలో హనుమాన్ జయంతి వేడుకలు

సంతబొమ్మాళి, జూన్ 1, ప్రభాతవార్త



నిత్య బ్రహ్మచారి నవ వ్యాకరణ పండితుడు, రామ భక్తుడు, దుష్ట సంహారుడు అయిన ఆంజనేయస్వామి హనుమత్ జయంతి వేడుకలు, పూజలు సంతబొమ్మాళి మండలంలో వైభవంగా దేవాలయాల్లో నిర్వహించారు. వేకువజాము నుంచే పలు గ్రామాల్లో దేవాలయాల్లో స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష అభిషేకాలు నిర్వహించి భక్తులు ధరించారు. సెలకపేట అభయాంజనేయస్వామి ఆలయం వద్ద విశేష తమలార్చనలు నిర్వహించారు. నౌపడ అభయాంజనేయస్వామి వారికి విశేష పూజలు నిర్వహించి మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సంతబొమ్మాళి పంచముఖాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హనుమాన్ చాలీషా పారాయణం నిర్వహించారు. కోటపాడు, భావనపాడు గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు విశేషంగా శుభ కలశాలతో శోభాయాత్ర నిర్వహించి స్వామికి మహా అభిషేకాలు నిర్వహించారు. సంతబొమ్మాళి బోరుభద్ర, నౌపడ శ్రీలక్ష్మీనారాయణ దేవస్థానంలో స్వామికి విశేష అలంకారాలు ప్రత్యేక సిందూర పూజలు నిర్వహించారు. శనివారం మండలం మొత్తంగా హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా ఘనంగా భక్తిశ్రద్ధలతో భక్తులు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



శృంగవరపుకోట, జూన్ 1, ప్రభాతవార్త

హనుమాన్ జయంతి వేడుకలు ఎస్.కోట మండలంలో వాడవాడలా శనివారం ఘనంగా జరిగాయి. ఎస్.కోట పట్టణం లోని గౌరీనగర్‌లో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఉద యం ఐదు గంటల నుంచి మద్యాహ్నం 11 గంటల వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం స్వామి వారిని ఊరేగించారు. అర్చకులు విన్నకోట బాస్కరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అలాగే మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయాలు రామాలయాలు వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అనన సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే భవానీనగర్‌లో శ్రీ భవానీమాత ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వెండి, బంగారం తొడిగి చక్కగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొత్తం మీద హనుమాన్ జయంతి వేడుకలు అలాగే భవానీమాత వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## నిర్ణీత సమయం 8గం.కే కౌంటింగ్ ప్రారంభం

విజయనగరం, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి



నిర్ణత సమయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కౌటింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాజాగా ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాలపై కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. 4వ తేదీ ఉదయం 8 గంటలకి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఖచ్చితంగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. దీని కోసం 7.30 గంటలకే ట్రంకు బాక్సులు లెక్కింపు కేంద్రాల్లోకి తరలించి, 500 చొప్పున కట్టలు కట్టే టేబుళ్ళ వద్దకు చేర్చాలని సూచించారు. ప్రాథమిక లెక్కింపులో మొదటి రౌండ్ గంట సమయం తీసుకున్నప్పటికీ రెండో రౌండ్ నుంచి మాత్రం 45 నిముషాల్లో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో దశలో చేపట్టే పోస్టల్ ఓట్ల సమగ్ర లెక్కింపు ప్రక్రియలో ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తి కావడానికి గంటన్నర కంటే ఎక్కువ సమయం తీసుకోకూడదని సూచించారు. ప్రతీ రౌండ్ పూర్తయిన వెంటనే ఫలితాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. కౌటింగ్ ముగిసిన తరువాత నిబంధనల ప్రకారం ప్యాకింగ్, సీలింగ్ ప్రక్రియలను పూర్తి చేసి, మర్నాడు ఉదయం వాటిని గోదాములకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబందించి ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన తాజా ఆదేశాలను కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్.డి అనిత, నోడల్ అధికారులు, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్ఒలు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

సాలూరు, జూన్ 1, ప్రభాతవార్త



సాలూరు పట్టణంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర జన్మదిన వేడుకలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇంకా ఆయన శ్రేయోభిలాషుల మధ్య నిరాడంబరంగా జరుపుకొన్నారు. అందులో భాగంగా శనివారం ఆయన నివాసానికి పట్టణ వైసీపీ నాయకులు వెళ్ళి రాజన్నదొరకు పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల జరిగిన నేపథ్యంలో 144 సెక్షన్ ఉండటం వల్ల డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆయన జన్మదిన వేడుకలు ఆర్భాటంగా చేయడానికి సుముఖత చూపకపోవడంతో పుట్టినరోజును ఏ హంగు అర్భాటం లేకుండా సాదాసీదాగా జరుపుకొన్నారు. ఇష్టమైన దైవం హనుమంత్ జయంతి రోజున పుట్టిన రోజు కావడం ఎంతో సంతోషంగా ఉందని రాజన్నదొర ఆనందం వ్యక్తపరిచారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు అప్పలనాయుడు, జరజాపు సూరిబాబు, రాపాక మాధవరావు, గిరి రఘు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం విజయనగరం
వార్త
25 Glorious years

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

గరివిడి, జూన్ 1, ప్రభాతవార్త



గరివిడిలో హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆంజనేయునికి భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. గరివిడి వెంకటేశ్వర ఆలయ ప్రాంగణం, కోడూరు మిలట్రీ రామారావు కాలనీ సమీపంలో గల హనుమాన్ ఆలయాల పట్ల జయంతి ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. ఆలయ అర్చకులు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భక్తి పారావశ్యంతో పూజలు నిర్వహించి హనుమంతుని అనుగ్రహానికి ప్రాప్తులయ్యారు. మిలట్రీ రామారావు కాలనీ సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద సుమారు వెయ్యి మంది భక్తులకి అన్న ప్రసాదం అందించారు. వేడుకల్లో ఎస్.ఐ ఎల్.దామోదరరావు, కోడూరు సర్పంచ్ ప్రతినిధి గేదెల ఆదినారాయణ, మాజీ సర్పంచ్ అడపా జానకి రమణమ్మ, ఆర్టీసీ యూనియన్ నాయకులు కుప్పిలి చంద్రమౌళి, ఎలకల వెంకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మూడంచెల భద్రత...! : జిల్లా ఎస్పీ దీపిక

విజయనగరం, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి



సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ చేపట్టే జెఎన్‌టియు, లెండీ ఇంజనీరింగ్ కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. మూడంచెల భద్రతలో భాగంగా స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు భద్రత విధులు నిర్వహిస్తాయన్నారు. తరువాత ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీ ఎస్పీ బలగాలు స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ నిర్వహించే భవనాలు చుట్టూ భద్రత విధులు నిర్వహిస్తాయని, వీరితో పాటు సివిల్ పోలీసులు కూడా భద్రత విధుల్లో పాల్గొంటారని ఆమె వివరించారు. వీరు కాకుండా ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు రెండు కిలోమీటర్ల పరిధిలో కట్ ఆఫ్ పార్టీలు పహారా కాస్తాయన్నారు. ఆ యా ప్రాంతాల్లోకి కౌంటింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులు, ఆథరైజేషన్ లెటర్స్ ఉన్న ఏజెంట్లు, మీడియా వారిని మాత్రమే అనుమతిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలింగ్ నిర్వహించే రోజు జిల్లా వ్యాప్తంగా 144 సిఆర్పీసి అమలులో ఉంటుందని చెబుతూ ఎక్కడా కూడా గుంపులుగా వ్యక్తులు ఉండకూడదని స్పష్టం చేశారు. అంతేకాకుండా విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు వినియోగానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు, మందుగుండు సామాగ్రిని వినియోగిస్తే, వారిపై ఐపిసి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్ 6 వరకు అమలులో ఉన్నందున ఎన్నికల నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ జరిగే జూన్ 4వ తేదీన విశాఖపట్నం– విజయనగరం, విజయనగరం–విశాఖపట్నం, గజపతినగరం–విశాఖపట్నం వైపు వెళ్ళే వాహనాల దారిని మళ్లించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపును ప్రజలందరూ గమనించాలని పోలీస్‌శాఖకు సహకరించాలని ఎస్పీ దీపిక తెలిపారు. విశాఖ నుంచి విజయనగరం వచ్చే వాహనాలను మోదవలస నుంచి నాతవలస జాతీయ రహదారి వైపు మళ్ళిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఆస్మా పర్హీన్, స్పెషల్ బ్రాంచి సి.ఐ కె.కె.వి విజయనాద్, విజయనగరం వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



మక్కువ, జూన్ 1, ప్రభాతవార్త

మార్కొండ పుట్టి పంచాయతీ పరిధిలో బట్టి వలస గిరిజన గ్రామంలో హనుమాన్‌జయంతి వేడుకలను గ్రామస్తులంతా కలిసి సామూహికంగా జరుపు కొన్నారు. శ్రీ విద్యా ఉపాసకుల ఎస్.హేమసుందరాచార్యులచే జరిపించి పూజలో గ్రామస్తులంతా పాల్గొన్నారు. హనుమాన్ జయంతి వేడుకలలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మావుడి రంగునాయుడు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదాలను స్వీకరించారు.

## ఇప్పుడు రాను... రాలేను...! : ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విజయనగరం, జూన్ 1, ప్రభాతవార్త ప్రతినిధి



మండలి ఛైర్మన్‌కి వైసీపీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు రివర్స్ గేర్‌లో ఆన్సర్ ఇచ్చారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రఘురాజు స్వంత పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఆయన సతీమణిని కూడా సాక్షాత్తూ లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్టు ఆధారాలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ కలగలిపి ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా పార్టీ నేతలు మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తన వద్దకు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా రఘురాజుకి మండలి ఛైర్మన్ తాఖీదు పంపారు. కానీ రఘురాజు ఈ తాఖీదును సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో మండలి ఛైర్మన్ మరోసారి రఘురాజుకి నోటీసు పంపారు. దీనికి రఘురాజు రెస్పాండ్ అయ్యారు. తనకు అనారోగ్యంగా ఉందని, ఇప్పుడు రానని, రాలేనని ఆయన ఛైర్మన్‌కి సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో రఘురాజు ఎపిసోడ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆయనపై వేటు తప్పకపోవచ్చని సర్వత్రా చర్చ జరుగుతోంది. మరి మండలి ఛైర్మన్ రఘురాజు వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో, దానిపై రఘురాజు ఎలా రియాక్ట్ అవుతారో వేచి చూడాలి.

## రామతీర్థంలో ఘనంగా హనుమత్ జయంతి వేడుకలు



నెల్లిమర్ల, జూన్ 1, ప్రభాతవార్త

ప్రసిద్ద పుణ్యక్షేత్రం రామతీర్దం రామస్వామి వారి దేవస్థానంలో శనివారం హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా దేవాలయంలో ప్రాత:కాలార్చన, బాలభోగం నిర్వహించారు. తర్వాత ఆంజనేయ స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పళ్ల రసాలతో పంచామృత అభిషేకాలు , అలంకరణ నిర్వహించారు. అలాగే తమలపాకులు, సింధూరంతో సహస్ర నామార్చన లను అర్చకులు నిర్వహించారు. భక్తులందరిచే సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. యాగశాలలో సుందర కాండ హవనం , అనంతరం ఉత్సవ మూర్తు వద్ద నిత్య కళ్యాణాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ సందర ్భంగా దేవాలయమంతా జైశ్రీరామ్ అనే జెండాలతో మామిడి తోరణాలతో దేవాలయం అంతా అలంకరించారు. ఈ కార ్యక్రమాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పర్యవేక్షించగా అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, సుదర్శనం పవన్‌కుమార్, రామ్‌గోపాల్ తదితరులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక ్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి సువ్వాడ వనజాక్షి, పార్టీ సీనియర్ నాయకుడు విశాఖ పట్నం నార్త్ నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ దంపతులు, కడగల సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ ను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**CHANGE OF NAME**

KAKI SUGUNA KUMARI Name Change PATTIKA SUGUNA KUMARI new name as per Aadhar Card, Pan Card Name pattika Suguna Kumari W/o Apparao, Gaddi Colony, G.L.Puram,Parvathipuram Manyam District.

**CHANGE OF NAME & DATE OF BIRTH**

I, PINNINTI JAYASUDHA wife of Army No.JC-334001N, Rank - Sub, Name PINNINTI BABU RAO, R/o KUNTIBHADRA (Vill.), Sirusuvada (PO), Kotturu (Mdl), Srikakulam (Dist.), Andhra Pradesh - 532455 have changed my name from A. JAYASUDHA, DOB 02, March, 1980 to PINNINTI JAYASUDHA, DOB 01 January 1981 vide affidavit Swom before date 28th May, 2024

**CHANGE OF NAME**

I, No.-JC-334001N Rank - sub Name PINNINTI BABU RAO, my daughter PINNINTI ANU R/o KUNTIBHADRA (Vill.), Sirusuvada (PO), Kotturu (Mdl), Srikakulam (Dist.), Andhra Pradesh - 532455 have changed my name from PINNINTI ANNU (OLD NAME) to PINNINTI ANU (New Name), Vide Affidavit dated 28-05-2024 Swom before Notary K.H.V.A. Naidu Notary, Vizianagaram.

2-6pg10.qxd:2-6pg10.qxd 1/1/02 5:40 AM Page 1



# వరల్డ్ కప్‌లో యువ ఆటగాళ్ల హవా




## ఈ ప్లేయర్లపైనే స్పెషల్ ఫోకస్

**న్యూఢిల్లీ:** ఐసిసి టి-20 వరల్డ్ కప్-2024 మరికొద్ది గంటల్లో ప్రారంభమవుతోంది. ఈ టోర్నీలో యంగ్ ప్లేయర్ల హవా కనిపించనుంది. ఈ ప్రపంచ కప్‌లో పాల్గొనే ఆయా దేశాల్లోని పలువురు యువ ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టి ఉండనుంది. ఈ విధంగానే ఇప్పటి వరకూ జరిగిన టి20 వరల్డ్ కప్ 8 ఎడిషన్లలో పలువురు యువ ప్లేయర్లు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. అటువంటి వారిలో ఇప్పటి స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, బాబర్ అజామ్, కర్లోస్ బ్రాత్ వంటి వారు ఉన్నారు. ఇలా ప్రతీ ఎడిషన్లలో ఆయా దేశాల జట్ల నుండి పాల్గొనే యంగ్ ఆటగాళ్లు ప్రపంచానికి పరిచయం కావడంతో ఇప్పుడు అందరి చూపు వారిపైనే ఉంది. అటువంటి వారిలో టీమిండియాకు చెందిన యశస్వీ జైస్వాల్ ఒకడు. ఈ 21 ఏళ్ల యంగ్ బ్యాటర్ తన కెరీర్‌లో తొలి టి20 ప్రపంచ కప్ కోసం భారత్ జట్టు తరపున ఆడనున్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో ఇన్నింగ్స్ ఓపెనింగ్ చేసే అవకాశం దాదాపు జైస్వాల్‌కే దక్కే అవకాశం ఉంది. గత ఏడాది ఐపిఎల్‌లో రాణించిన జైశ్వాల్‌కు టీమిండియా తరపున అరంగేట్రం చేసే ఛాన్స్ వచ్చింది. దీంతో అంతర్జాతీయ టి20ల్లో 16 ఇన్నింగ్స్‌లో 502 పరుగులు చేశాడు.

కాగా ఐపిఎల్-2024లోనూ 435 పరుగులతో అదరగొట్టిన ఈ యువ ప్లేయర్ ప్రపంచ కప్‌లోనూ రాణిస్తే భారత్‌కు మంచి ఆరంభాలు దక్కుతాని క్రీడాభిమానుల అభిప్రాయం. ఇక 25 ఏండ్ల ఇంగ్లండ్ ఆల్ రౌండర్ విల్ జాక్స్ ఒక్కసారి క్రీజులో కుదురు కుంటే విధ్వంసం సృష్టించగలడు. ఇటీవల ముగిసిన ఐపిఎల్ 2024లో గుజరాత్‌తో మ్యాచ్‌లో సాధించిన సెంచరీయే అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుకు ప్రాతినిధ్యం వహించిన జాక్స్ ఈ మ్యాచ్‌లో 50 నుండి 100 పరుగుల మార్క్ అందుకోవడానికి కేవలం 10 బంతులు మాత్రమే తీసుకున్నాడు. దీంతో ఒక్కసారిగా జాక్స్ పైనే అందరి దృష్టి పడింది. ఈ వరల్డ్ కప్‌లోనూ ఇంగ్లండ్ ఈ యంగ్ ఆల్ రౌండర్ మీదే ఆశలు పెట్టుకుంది. అలాగే మరో దక్షిణాఫ్రికా యంగ్ ప్లేయర్ స్టబ్స్ అంతర్జాతీయ క్రికెట్‌లో పెద్దగా ఇంపాక్ట్ చూపలేదు. అయితే తాజాగా ముసిగిన ఐపిఎల్‌లో మాత్రం స్టబ్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు మిడిలార్డర్‌లో బలంగా నిలిచాడు. 13 ఇన్నింగ్స్‌లో 378 పరుగులు చేసి తన సత్తా ఏంటో చూపించాడు. దీంతో దక్షిణాఫ్రికా ఈ యువ ప్లేయర్‌ను ప్రపంచ కప్‌కు ఎంపికచేసింది. ఇక ఐపిఎల్ ఫామ్ కొనసాగిస్తే సఫారీలకు ఛేజింగ్‌లో కీలక ప్లేయర్‌గా మారే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా యూత్ ప్లేయర్ గ్రీన్ ఇప్పటి వరకూ అంతర్జాతీయంగా టి20లో పెద్దగా రాణించ లేదు. కానీ ఐపిఎల్-2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు తరపున ఆడిన గ్రీన్ 255 పరుగులు చేసి అందరి దృష్టి ఆకర్షించాడు. దూకుడైన బ్యాటింగ్‌తో పాటు, బౌలింగ్ చేయగల సత్తా, నైపుణ్యం ఉండటం గ్రీన్‌కు కలిసొచ్చే అంశం. ఈ కారణంగానే గ్రీన్ ఆస్ట్రేలియా జట్టుకు ప్రపంచ కప్ టోర్నీకి ఎంపికయ్యాడు. ఒక వేళ తుది జట్టులోస్థానం దక్కితే పవర్ ప్లేలో గ్రీన్ ఇంపాక్ట్ చూపించే ఛాన్స్ ఉంది.




# దక్షిణాఫ్రికాతో టీమిండియా ఢీ

## సిరీస్ మ్యాచ్‌లకై భారత్ మహిళా జట్టు ఎంపిక

### ఈ నెల 16 నుండి జులై 9 వరకూ బెంగళూరు, చెన్నైలో మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో ఆల్ ఫార్మాట్ సిరీస్ మ్యాచ్‌ల కోసం భారత్ మహిళా జట్టును భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఎంపిక చేసింది. ఈ నెల 16వ తేదీ నుండి ప్రారంభమై జూలై 9వ తేదీతో ముగియనున్నాయి. వన్ డే మూడు సిరీస్‌లు జూన్ 16, 19, 23 తేదీల్లో బెంగుళూరులోను, 28న చెన్నైలో ఒకే టెస్ట్ మ్యాచ్, జూలై 5, 7, 9 తేదీల్లో టీ 20 మూడు సిరీస్‌ల మ్యాచ్‌లు చెన్నైలో జరగనున్నాయి. ఈ మేరకు జట్టు వివరాలను ప్రకటించింది. హార్మన్‌ప్రీత్ కౌర్ మూడు ఫార్మాట్లలో టీమ్ ఇండియాకు నాయకత్వం వహిస్తుంది. స్మృతి మంధాన డిప్యూటీగా ఉంటుంది. జెమియా రోడ్రిగ్స్, ఫాస్ట్ బౌలర్ పూజా వస్త్రాకర్ టీమ్ ఇండియా మూడు స్క్వాడ్‌లలో భాగంగా ఉన్నారు. అయితే వీరిద్దరి ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుంది. ఈ దక్షిణాఫ్రికా పర్యటన మూడు మ్యాచ్‌ల వన్ డే ఇంటర్నేషనల్ సిరీస్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత రెండు జట్ల మధ్య ఒక టెస్ట్ మ్యాచ్ కూడా జరుగుతుంది. వన్డే సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లు 2022-2025 ఐసిసి మహిళల ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఉన్నాయి. ఆతిథ్య భారత్‌తో పాటు, ఛాంపియన్‌షిప్‌లోని టాప్ 5 జట్లు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ మహిళా క్రికెట్ ప్రపంచ కప్-2025కు నేరుగా అర్హత సాధిస్తాయి. ఈ పర్యటన మూడు మ్యాచ్‌ల టి 20తో సిరీస్‌తో ముగుస్తుంది. వన్డే సిరీస్‌కు ముందు జూన్ 13న బెంగుళూరులో బోర్డ్ ప్రెసిడెంట్స్ ఎలెవన్‌తో విజిటింగ్ టీమ్ వార్మప్ మ్యాచ్ ఆడనుంది. బెంగుళూరు వేదికగా వన్డే సిరీస్ జరగనుంది. అదే సమయంలో చెన్నైలో ఏకైక టెస్టు, టీ 20 సిరీస్‌లు జరగనున్నాయి.

**మూడు వన్డేల సిరీస్ జట్టు:** భారత్ మహిళా జట్టులో హార్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలి వర్మ, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (కీపర్), ఉమా ఛెత్రి (కీపర్), దయాళన్ హేమలత, రాధా యాదవ్, ఆశా శోభన, శ్రేయాంక పాటిల్, సైకా ఇషాక్, పూజా వస్త్రాకర్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతిరెడ్డి, ప్రియా పునియా.

**ఏకైక టెస్ట్ జట్టు:** హార్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైఎస్ కెప్టెన్), షఫాలీ వర్మ, శుభా సతీష్, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, ఉమా ఛెత్రి (కీపర్లు), దీప్తీ శర్మ, స్నేహ రాణా, సైకా ఇసాక్, రాజేశ్వరి గైక్వాడ్, పూజా వస్త్రాకర్, అరుంధతిరెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, మేఘనా సింగ్; ప్రియా పునియా.

**మూడు మ్యాచ్‌ల టీ 20 సిరీస్ జట్టు:** హార్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్),షఫాలీ వర్మ, దయాళన్ హేమలత,ఉమాఛెత్రి, రిచాఘోషక్ష, జెమీయారోడ్రిగ్స్, సజ్నాసజీవన్, దీప్తిశర్మ, శ్రేయాంక పాటిల్, రాధాయాదవ్, అమంజోత్, ఆశాశోభన, పూజా వస్త్రాకర్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతిరెడ్డి.

# ఒలింపిక్స్‌కు భారత్ బాక్సర్ నిశాంత్



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక విశ్వ క్రీడలకు భారత బాక్సర్ నిశాంత్ దేవ్ అర్హత సంపాదించాడు. ఈ మెగా ఈవెంట్‌కు ఆఖరి అర్హత టోర్నీ అయిన వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో నిశాంత్ పురుషుల 71 కేజీల విభాగంలో సెమీ ఫైనల్స్ చేరడ ద్వారా బెర్త్ దక్కించుకున్నాడు. బ్యాంకాక్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో అతను 5-0తో మాల్డోవాకు చెందిన వాసిల్ సెంటరీపై ఏకపక్ష విజయం సాధించాడు. కాగా మహిళల 60 కేజీల క్వార్టర్స్‌లో అంకుశిత 2-3తో స్వీడన్‌కు చెందిన అగ్నెస్ చేతిలోను, స్లోవేకియాకు చెందిన జెస్సికా చేతిలో 4-1తో అరుంధతి ఓడి ఒలింపిక్స్‌కు దూరమయ్యారు. అలాగే 57 కేజీల క్వార్టర్స్‌లో సచిన్ సివాచ్ 4-1తో ఫ్రాన్స్‌కు చెందిన శామ్యూల్ కిస్తోహారీపై గెలిచి సెమీస్ చేరాడు. ఈ వెయిట్ కేటగిరిలో మూడు బెర్త్‌లు మాత్రమే ఉండటంతో సచిన్ ఫైనల్ చేరాలి. లేదంటే బాక్స్ ఆఫ్ బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాడు. పురుషుల 92 కేజీల విభాగం ప్రి కార్వర్టర్ ఫైనల్లో భారత్ బాక్సర్ సంజీత్ 0-5తో అజర్‌బైజాన్‌కు చెందిన అల్ఫోన్సో చేతిలో పరాజయం చెందాడు.

# వరల్డ్ సెమీస్‌లో భారత్ మహిళా జోడి ఓటమి



**న్యూఢిల్లీ:** సంచలన పర్వానికి బ్రేక్ పడింది. ప్రతిష్టాత్మక సింగపూర్ వరల్డ్ ఓపెన్ బ్యాట్‌మెంటన్‌లో సంచలనాలు సృష్టించి సెమీస్‌కు వచ్చిన భారత్ మహిళా జోడీకి చుక్కెదురైంది. సింగపూర్ ఓపెన్ మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ, గాయత్రీ గోపీచంద్ జోడీ ప్రస్థానం ముగిసింది. సంచలన విజయాలతో దూసుకెళుతున్న ఈ భారత్ ద్వయానికి సెమీ ఫైనల్లో ఎదురుదెబ్బ తగిలింది. ఫైనల్ బెర్తు కోసం శనివారం సింగపూర్‌లో జరిగిన పోరులో త్రిసా, గాయత్రీ జంట అనూహ్యంగా ఓటమి పాలైంది. ఆద్యాంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో జపాన్ జోకీ నమి మత్సుయమ, చిహరు షిదా ధాటికి భారత్ జోడీ నిలువ లేకపోయింది. తొలి సెట్‌లో త్రిసా, గాయత్రిలు గట్టిగానే ప్రతిఘటించినా రెండో సెట్‌లో తేలిపోయారు. దాంతో 21-25, 11-21తో మ్యాచ్ చేజారిపోయింది. ఫలితంగా బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో తొలి టైటిల్ గెలవాలనుకున్న త్రిసా, గాయత్రీల కల చెదిరింది.

# నార్వే చెస్‌లో వైశాలి విజయం



**న్యూఢిల్లీ:** నార్వే చెస్ మహిళల విభాగంలో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి తన జోరు కొనసాగిస్తోంది. నాలుగో రౌండ్ గేమ్‌లో వైశాలి 54ఎత్తుల్లో స్వీడన్‌కు చెందిన పియా క్రామ్లింగ్‌పై గెలుపు సాధించింది. ఆరుగురు గ్రాండ్ మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్దతిలో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్‌తర్వాత వైశాలి 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇక భారత్ నవంబర్ వన్ కోనేరు హంపి 55 ఎత్తుల్లో ఉక్రెయిన్‌కు చెందిన అనా ముజిచుక్ చేతిలో ఓడిపోయింది. ఇదే టోర్నీ పురుషులవిభాగంలో వైశాలి తమ్ముడు, యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద నాలుగోరౌండ్‌లో 65ఎత్తుల్లో అమెరికాకుచెందిన షికారు నకమురచేతిలో పరాజయం చెందాడు.

# వాణిజ్యం

# 'ఆటో' సేల్స్‌లో టాటా హైస్పీడ్ గేర్!

**ముంబై,జూన్ 1:** ఆటోమొబైల్ అమ్మకాల్లో టాటామోటార్స్ ఈ సారి తన అమ్మకాలను పెంచుకోగలిగింది. టాటా దేశీయ లమ్మకాలు రెండుశాతం పెరిగి 75,173యూనిట్లకు పెరిగాయి. మొత్తం ఎగుమతులు, దేశీయంగా చూస్తే 76,766యూనిట్లు అమ్మకాలుజరిపింది. కమర్షియల్ వాహనాలు 29,691 యూనిట్లు విక్రయిస్తే దేశీయంగా కమర్షియల్ వాహనాలు 28,476 యూనిట్లకు పెరిగాయి. ప్యాసింజర్ వాహనాలు 47,075కిచేరితే దేశీయంగా ప్యాసింజర్ వాహనాలు 46,697కి చేరుకున్నాయి. కియా మోటార్స్ అమ్మకాలు 3.9శాతం పెరిగాయి. స్థానిక విక్రయాలు 3.9శాతంపెరిగి 19,500 యూనిట్లుగా ఉన్నాయి. ఎగుమతులు 2304 యూనిట్లు జరిగాయి. మేనెలలో మొత్తం కియా కెపాసిటీ 21,804గా ఉంది. ఇక మారుతి సుజుకి విక్రయాలను ఎగుమతులు ప్రభావితం చేసాయి. మొత్తం 1.74 లక్షలయూనిట్లు అమ్మకాలు జరిగాయి. దేశీయంగా 1.57 లక్షల యూనిట్లు కాగా ఎగుమతులు 34 శాతం తగ్గాయి. 17,367 యూనిట్లు ఎగుమతి చేసింది.



ఇక టివిఎస్‌మోటార్ పరంగా చూస్తే 12శాతం పెరిగి 3,69,914 యూనిట్లు జరిగాయి. టూవీలర్ విక్రయాలు 13శాతం పెరిగి 3,59,590 యూనిట్లకు చేరాయి. ఎగుమతులు కూడా 88,450 యూనిట్లకు చేరాయి. త్రీవీలర్ అమ్మకాలు 89.75శాతం క్షీణించాయి. 10,342 యూనిట్లు మాత్రమే విక్రయించింది. ఇక హుండై మోటార్స్ స్థానికంగా 49,151 యూనిట్లు విక్రయిస్తే ఎగుమతులు 14,400 యూనిట్ల వరకూ జరిగాయి. ఇక మహీంద్ర వాహనాలు 71,682 యూనిట్లు జరిగి 17శాతం వృద్ధిని నమోదుచేసింది. టయోటా కిర్లోస్కర్ ఇండియా 24శాతం పెరిగి 25,273 యూనిట్లు జరిగినట్లు ప్రకటించింది. అలాగే ఎస్కార్ట్స్ క్యూబా విక్రయాలు ట్రాక్టర్ల పరంగా చూస్తే 6.1శాతం క్షీణించాయి. 8612 యూనిట్లు మాత్రమే జరిగాయి. మొత్తం అమ్మకాలు 8612వరకూ జరిగినట్లు తేలింది. ఎగుమతులు కూడా 17.9 శాతం క్షీణించాయి.

# ఎఫ్‌డిలకు ఇదే రైట్ టైం..

**ముంబై, జూన్ 1:** ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకునే వారికి ఇదే రైట్ టైం. సాధారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లకు వచ్చే సరికి అన్ని చోట్ల ఒకే రకమైన వడ్డీ రేటు ఉండదు. బ్యాంకులను బట్టి, కాల వ్యవధులను బట్టి మారుతుంటుంది. ఒకవేళ ఆర్‌బిఐ ఈ యేడాదిలోనే రెపోరేటును తగ్గిస్తే, బ్యాంకులు కూడా వెంటనే తమ బ్యాంకుల్లో టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లనుతగ్గిస్తాయి. ప్రస్తుతం ఎఫ్‌డిలపై బ్యాంకులు అధిక వడ్డీరేట్లను అందిస్తున్న నేపథ్యంలో దానిని సద్వినియోగం చేసుకోవడం మంచిది. మీరు ఒకవేళ ఇప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకున్నా, ముందు అన్ని బ్యాంకుల్లో వడ్డీరేట్లను సరిచూసుకోవాల్సి ఉంటుంది. మీరు డిపాజిట్ చేయాలను కుంటున్న మొత్తం, కాల వ్యవధి ఆధారంగా బ్యాంకును ఎంచుకోవాలి. మీరు ఒక సంవత్సరానికి ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెట్టుబడి పెట్టాలనే ప్లాన్ చేస్తున్నట్లయితే ఈ వార్త ఉపకరిస్తుంది. దీనిలో ఒక యేడాది కాలానికి అధిక వడ్డీని అందించే టాప్ బ్యాంకులను పరిశీలిద్దాం. దేశంలోని అతిపెద్ద బ్యాంకు అయిన ఎస్‌బిఐలో సాధారణ పౌరులకు ఒక సంవత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సంవత్సరానికి 6.8శాతం, సీనియర్ సిటిజన్‌లకు 7.3శాతం వడ్డీరేటు అందిస్తోంది. ఇవి మే 15, 2024 నుంచి అమల్లోకి వచ్చాయి. అతిపెద్ద ప్రైవేట్ రుణదాత అయిన హెచ్‌డిఎఫ్‌సి సాధారణ పౌరులకు తన ఒక సంవత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వార్షిక వడ్డీ రేటును 6.6శాతం, సీనియర్ సిటిజన్‌లకు 7.1శాతం వడ్డీరేటును అందిస్తోంది. ఈ యేడాది ఫిబ్రవరి 9 నుంచి అమల్లోకి వచ్చాయి. ఐసిఐసిఐ బ్యాంకు ఈ ప్రైవేట్ బ్యాంకు ఒకసంవత్సరం ఎఫ్‌డిపై 6.7శాతం, సీనియర్ సిటిజన్లకు 7.2శాతం అందిస్తోంది.కోటక్ మహీంద్రా బ్యాంకు ఈబ్యాంకు సాధారణ పౌరులకు ఒక సంవత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 7.1 శాతం, సీనియర్ సిటిజన్‌లకు 7.6శాతం అందిస్తోంది. తాజా ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు ఫిబ్రవరి 27, 2024 నుంచి అమల్లోకి వచ్చాయి. బ్యాంకు ఆఫ్ బరోడా ఈ రుణదాత సాధారణ పౌరులకు ఒక సంవత్సర కాలవ్యవధి కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 6.85శాతం, సీనియన్ సిటిజన్‌లకు 7.35 శాతం వడ్డీరేటు అందిస్తోంది.




# దిగివచ్చిన ఎటిఎఫ్ ధర

**ముంబై, జూన్ 1:** జూన్ నెలలో చాలా రకాల వస్తువుల ధరలు తగ్గాయి. అన్నింటిలో మొదటిది ఎల్‌పిజి సిలిండర్ల ధర తగ్గడం, రెండోది విమాన ఇంధనంధర కూడా తగ్గడం. ప్రభుత్వ చమురు, గ్యాస్ కంపెనీలు ఇచ్చిన సమాచారం ప్రకారం, జూన్ 1 నుంచి విమాన ఇంధనం అంటే ఎటిఎఫ్ ధరలు కిలోలీటర్‌కు 6,673.87 రూపాయలు తగ్గాయి. ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం జూన్ నుంచి ఢిల్లీలో ఎటిఎఫ్ కిలోలీటర్‌కు 94,969.01 రూపాయలకు చౌకగా మారింది. అంతకుముందు మే 1న కిలోలీటర్‌కు రూ.749.25 చొప్పున ఎటిఎఫ్ రేట్లు పెంచారు. ఆ తర్వాత ఢిల్లీలోని ఎటిఎఫ్ ధర కిలోలీటర్‌కు రూ.1,01,642.88కి పెరిగింది. తాజా మార్పు తర్వాత ముంబైలో ఎటిఎఫ్ ఇప్పుడు కిలోలీటర్‌కు రూ.88,834.27కు చేరింది. నాలుగు మెట్రో నగరాలు పరిశీలిస్తే, ప్రస్తుతం ముంబైలో మాత్రమే విమాన ఇంధనం చౌకగా అందుబాటులో ఉంది. అదేవిధంగా కోల్‌కతాలో ఎటిఎఫ్ ధరలు కిలోలీటర్‌కు రూ,1,03,715కి తగ్గాయి. చెన్నైలో కిలోలీటర్‌కు 98,557.14రూపాయలుగాఉంది. ప్రభుత్వ చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెల ప్రారంభంలో విమాన ఇంధన ధరలను సమీక్షిస్తాయి. కంపెనీలు మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రకారం విమాన ఇంధనం అంటే ఎటిఎఫ్ ధరను తగ్గించాలని లేదా పెంచాలని నిర్ణయించుకుంటాయి. అంతకుముందు గత నెల ఒకటో తేదీన, ఎటిఎఫ్ ధరలో స్వల్ప పెరుగుదల కనిపించింది. విమానయాన సంస్థల అతిపెద్ద వ్యయం ఇంధనంపైనే. ఎటిఎఫ్ రేట్ల మార్పుల ప్రత్యక్ష ప్రభావం విమానయాన ఛార్జీలపై కనిపిస్తుంది.




# తగ్గిన ఎల్‌పిజి సిలిండర్ ధర..

**న్యూఢిల్లీ, జూన్ 1:** లోక్‌సభ ఎన్నికల చివరి దశకు ముందు ఎల్‌పిజి విని యోగదారులకు పెద్ద ఊరట లభించింది. ఎల్‌పిజి సిలిండర్ల ధరలను ప్రభుత్వ చమురు, గ్యాస్ మార్కెటింగ్ కంపెనీలు వరుసగా మూడో సారి తగ్గించాయి. ఈవిధం గా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఎల్‌పిజి సిలిండర్ల ధర మూడురెట్లు తగ్గింది. ప్రభుత్వ చమురు కంపెనీలు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, శనివారం నుంచి దేశంలోని వివిధ నగరాల్లో ఎల్‌పిజి సిలిండర్ల ధర సుమారు రూ.70 తగ్గింది. అయితే ఈ తగ్గింపు ప్రయోజనం 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లకు మాత్రమే, గృహావసరాలకు వినియోగించే ఎల్‌పిజి సిలిండర్ల ధరల్లో ఈ సారి కూడా ఎలాంటి మార్పు లేదు. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.69.50 తగ్గి రూ.1676కి చేరుకుంది. అంతకు ముందు ఏప్రిల్ నెలలో ధర రూ.19 తగ్గి రూ.1,745.50 కి వచ్చింది. కోల్‌కతాలో కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్లు రూ.1,787గాఉంది. ముంబై ప్రజలు ఇప్పుడు ఈ పెద్ద సిలిండర్ కోసం రూ.1,629 చెల్లించాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు చివరిదశలో ఉన్న తరుణంలో 19కిలోల వాణిజ్య సిలిండర్ల ధరలో ఈ తగ్గించారు. మే1నుంచి వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధర రూ.19 తగ్గింది. ఏప్రిల్‌కుముందు వరుసగా మూడు నెలల పాటు వాణిజ్య సిలిండర్ల ధరలు పెరిగాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మహిళా దినోత్సవం సందర్భంగా గృహవినియోగ ఎల్‌పిజి సిలిండర్‌ల ధరలను రూ.100 తగ్గిస్తున్నట్లు మార్చిలో ప్రకటించారు. 2025 మార్చి 31 వరకు పిఎం ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.300 సిబ్సిడీని అంద చేస్తున్నట్లు మంత్రివర్గం ప్రకటించింది. అప్పటి నుంచి 14 కిలోల సిలిండర్ల ధరలో ఎలాంటి మార్పులేదు. అంటే దాదాపు 3 నెలలుగా గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు.



# 55% పెరిగిన అదానీ లాభాలు..

**ముంబై, జూన్ 1:** మార్చి 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ 55శాతం లాభాలను నమోదుచేసింది. 2023-24లో అదానీ గ్రూప్ తన లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువను హిండెన్‌బర్గ్ దెబ్బ తీసింది. ఆ తర్వాత మళ్లీ పుంజుకుంది. ఎక్స్ఛేంజ్ డేటా, విశ్లేషకుల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ లిస్టెడ్ కంపెనీల నికర లాభం రూ.19,833 కోట్ల నుంచి రూ.30,767 కోట్లకు చేరుకుంది. లాభవృద్ధికి 5 సంవత్సరాల కార్గ్ 54శాతంగా ఉంది. ఎబిటా ఆదాయంలో 6శాతం పడిపోయినప్పటికీ 40శాతం పెరిగి రూ.66,244 కోట్లకు చేరుకుంది. 'మొత్తం గ్రూప్ ఎబిటా 2024లో సంవత్సరానికి 40శాతం పెరిగింది. గ్రూప్ కంపెనీలలో ప్రమోటర్ల పెరిగిన వాటా, గ్రూప్ ఎంక్యాప్ పుంజుకుందని ఒక నోట్‌లో తెలిపారు. 'గ్రూప్ తిరిగి విస్తరణలో ఉంది. వచ్చే దశాబ్దంలో యుఎస్‌డి 90 బిలియన్ల కాపెక్స్‌ను దృష్టిలో ఉంచుకుంది' అని బ్రోకరేజ్ తెలిపింది. గ్రూప్ స్థాయిలో నికర రుణం 2024లో రూ.2.2 లక్షల కోట్లకు వ్యతిరేకంగా రూ.2.3 లక్షల కోట్ల వద్ద స్థిరంగా ఉంది. 2024లో అదానీ పోర్ట్స్, అదానీ పవర్ నికర రుణంలో పడిపోయాయి. కంపెనీలు చేపట్టిన కొత్త కాపెక్స్ ప్రాజెక్ట్‌ల నేపథ్యంలో అదానీ ఎంటర్ ప్రైజెస్, అదానీ గ్రీన్‌లకు పరపతి పెరిగింది. అదానీ పోర్ట్స్ గోపాల్‌పూర్ ఓడరేవును స్వాధీనం చేసుకుంది. అదానీపవర్ 1.6 జిడబ్ల్యూ గొడ్డ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించింది. అదానీ గ్రూప్ 2.8జిడబ్ల్యూ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంది.



# స్టాక్ సూచీలపై ఎన్నికల ఎఫెక్ట్

**న్యూఢిల్లీ, జూన్ 1:** దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పండుగ ముగితంపు దశకు వచ్చేసింది. శనివారంతో చివరి దశ పోలింగ్ పూర్తయింది. ఆరు వారాల పాటు సాగిన జాతీయ ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరగనుంది. ఫలితాలపై ప్రజలతో పాటు ప్రధానంగా స్టాక్ మార్కెట్లు అత్యంత ఆసక్తిగా చూస్తున్నాయి. ఇప్పటికే ముగిసిన పోలింగ్ దశలతో ఇన్వెస్టర్లు, రాజకీయ విశ్లేషకులు ఫలితాలపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ఓటింగ్ శాతం జరగడం ముఖ్యంగా ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపికి సవాలుగా మారాయి. గత 2019 ఎన్నికల్లో మొత్తం 543 స్థానాలకు గానూ బిజెపి, దాని మిత్రపక్షాలు 352 సీట్లను దక్కించుకున్నాయి. బిజెపి ఒంటరిగానే 303సీట్లను సాధించింది. అయితే 2019 కంటే బలమైన మెజారిటీని బిజెపి గెలవగలిగితే మౌలిక సదుపాయాలపై ఖర్చు కొనసాగడం, తయారీ రంగానికి ప్రోత్సాహకం వంటి వృద్ధి ఆధారిత ఆర్థిక విధానాల అంచనాలతో ఈక్విటీ మార్కెట్లు ర్యాలీ కానున్నాయని మార్కెట్లు నిపుణులు వెల్లడించారు. బిజెపి గెలిస్తే సెన్సెక్స్, నిఫ్టీ 4-5 శాతం మేర ర్యాలీ చేస్తాయని, ఫారెక్స్ కన్సల్టెన్సీ అసెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఐఎఫ్‌ఎ గ్లోబల్ ఫౌండర్ వెల్లడించింది. ప్రధాని మోడీని మార్కెట్ సానుకూలంగా చూస్తోంది. తద్వారా రాజకీయ స్థిరత్వం కొనసాగుతుందని, విధానపరమైన నిర్ణయాలు కొనసాగుతాయని సీనియర్ ఇన్వెస్టర్ ఒకరు వెల్లడించారు. అంచనాలను కాదని, ప్రస్తుతం ఉన్న ప్రచారానికి భిన్నంగా ఎన్డీఎ ఓటమి పాలై కాంగ్రెస్ నేతృత్వం లోని ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ఫలితాలు వస్తే మార్కెట్లలో అమ్మకాలకు అవకాశం ఉంటుంది. స్టాక్ మార్కెట్లు ఇప్పటి వరకు ప్రస్తుత ప్రభుత్వ కొనసాగింపునే ఆశిస్తున్నాయి. కాబట్టి మరో పార్టీ గెలిస్తే ప్రతికూలతను ఎదుర్కొనవచ్చని కూడా తెలిపారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.